

'నా అక్కలూ..చెల్లెళ్లు... తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 278

గురువారం 29-12-2022



అట్టడుగు వర్గాల కోసం..

స్వచ్ఛంద సంస్థల సమన్వయకర్త స్నేహలతతో ఇంటర్వ్యూ - 11లో



అంజలి శర్వాణికి చోటు

టి20 ప్రపంచకప్‌లో పాల్గొనే భారత జట్టులో ఏపీ అమ్మాయికి చోటు - 12లో

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నలుగురు ఉగ్రవాదులు హతం

పాకిస్తాన్ నుంచి అక్రమంగా చొరబడిన నలుగురు సాయుధ ఉగ్రవాదులు భారత జవాన్ల ఎదురు కాల్పుల్లో హతమయ్యారు.

వివరాలు 6లో ▸



ఇక ప్రపంచంపైకి.. చైనీయులు!

కరోనా కల్లోలం కొనసాగుతూనే ఉన్నా.. దేశ సరిహద్దులను తెరవాలన్న చైనా ప్రభుత్వ నిర్ణయంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు 6లో ▸



ప్రధాని మాతృమూర్తికి అస్వస్థత

ప్రధాని మోదీ మాతృమూర్తి హీరాబెన్ అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

వివరాలు 6లో ▸



'రిటైర్డ్ పోప్' ఆరోగ్యం విషమం

క్యాథలిక్‌ల మత గురువుగా పదవీ విరమణ చేసిన పోప్ బెనడిక్ట్–16 ఆరోగ్యం విషమంగా ఉందని వాటికన్ సిటీ వర్గాలు తెలిపాయి.

వివరాలు 6లో ▸


రోడ్డు షోలో చంద్రబాబు

'షో'క సంద్రం

8 చంద్రబాబు రోడ్ షోలో మంది దుర్మరణం

నెల్లూరు జిల్లా కందుకూరులో దుర్ఘటన


ఇరుకు రోడ్లలో కదిలే పరిస్థితి లేక ఒకరిపై ఒకరు పడ్డ జనం

- వారు అరుస్తుండగా... మరింత మంది భయంతో పరుగులు
- అంతా ఒకరిపై ఒకరు పడి... లేవలేక... ఊపిరాడని తీరు
- అక్కడికక్కడే ఇద్దరు; ఆసుపత్రికి తీసుకెళ్లాక మరో ఆరుగురి మృతి
- డ్రోన్ షూటింగ్ కోసం వేసిన వ్యూహం కొంప ముంచిందంటున్న స్థానికులు
- పెద్ద రోడ్లు ఉన్నా వదిలేసి... కావాలని ఎన్టీఆర్ సర్కిల్లో రోడ్ షో
- ఘటనా స్థలికి కొద్ది దూరంలో వందడుగుల రోడ్లతో మరో సర్కిల్
- గతంలో పాదయాత్ర సందర్భంగా అక్కడే వైఎస్ జగన్ రోడ్ షో
- మునుపు కందుకూరు స్కూల్ గ్రౌండ్లో చంద్రబాబు సభ సైతం సాఫీగానే
- ప్రస్తుతం ఇరుకు రోడ్లు కావటం వల్లే దారుణం జరిగిందన్న స్థానికులు
- ఈ దుర్ఘటనను కూడా రాజకీయ లబ్ధికి ఉపయోగించుకోబోయిన బాబు
- జనం ఈ ప్రభుత్వంపై ఆవేశంతో వచ్చారని, అందుకే ఇలా జరిగిందని వ్యాఖ్య
- ఆసుపత్రికి వెళ్లి పరామర్శ; ఒక్కో కుటుంబానికి టీడీపీ తరఫున రూ.10 లక్షలు
- బాబు వ్యాఖ్యల్ని శవాలపై పేలాలు ఏరుకునేవిగా కొట్టిపారేసిన నాయకులు

ప్రాణాలు కోల్పోయిన వారు


దేవినేని రవీంద్ర


కాకుమాను రాజా


యాటగిరి విజయ


మర్లపాటి చినకొండయ్య


ఉప్పటూరి పురుషోత్తం


గద్దం మధు


కలవకూరి యానాది


ఇదిమూడి రాజేశ్వరి

చంద్రబాబు రోడ్డు షోలో విషాద ఘటన జరిగిన ఇరుకు రోడ్డు, ఇరువైపులా ఉన్న మురుగు కాల్వలు



(సాక్షి- నెల్లూరు)

అసలే 30 అడుగుల ఇరుకు రోడ్లు. దాన్లో కూడా అటూ ఇటూ ఫ్లెక్సీలు, కటౌట్లు పెట్టి... 20 అడుగులకు కుదించేశారు. ఆ ఇరుకు రోడ్లో ఐదారు వేల మంది వచ్చినా... పై నుంచి డ్రోన్లతో షూటింగ్ చేస్తే చాలా భారీగా జనం తరలివచ్చినట్లు కనిపిస్తుంది. ఆ ఫొటోలను పత్రికల్లో, టీవీల్లో విస్తృతంగా ప్రచారం చేయటం ద్వారా ప్రతి సభకూ, రోడ్ షోకూ జనం పోటెత్తుతున్నారని చెప్పటం చంద్రబాబు నాయుడి ఉద్దేశం. కొద్దిరోజులుగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో చంద్రబాబు రోడ్ షోలకు సంబంధించి తెలుగుదేశం పార్టీ అనుసరిస్తున్న ఈ ఫార్ములా... బుధవారం మాత్రం నెల్లూరు జిల్లా కందుకూరులో ఎనిమిది నిండు ప్రాణాలను బలి తీసుకుంది.

ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు... 'ఇదేం ఖర్మ' కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో చంద్రబాబు రోడ్ షో నిర్వహించారు. ఈ సర్కిల్ రోడ్లు కాస్త ఇరుగ్గా ఉండగా... సర్కిల్ నుంచి గుండంకట్ట వెళ్లే రోడ్డు అన్నిటికన్నా ఇరుగ్గా ఉంది. దాంట్లోనే అటూ ఇటూ ఫ్లెక్సీలు పెట్టడంతో చిన్న సందులా తయారయింది. అక్కడే మురికి కాలువ పక్కన వరసగా కొందరు

మిగతా 2వ పేజీలో ▶

ఢిల్లీలో ప్రధాని మోదీకి జ్ఞాపికను అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



సడలని పట్టు!

విభజన పెండింగ్ అంశాలపై ప్రధాని మోదీతో చర్చించిన సీఎం జగన్

- రాష్ట్రానికి ఇచ్చిన హామీలను నెరవేర్చండి.. పోలవరం పెండింగ్ నిధులివ్వడంతోపాటు సవరించిన అంచనా వ్యయాలను ఆమోదించాలి
- తెలంగాణ నుంచి రూ.6,886 కోట్ల విద్యుత్ బకాయిలు ఇప్పించాలి
- గత సర్కారు తప్పిదాలకు రుణ పరిమితిలో ఆంక్షలు సరికాదు
- ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అవశ్యం.. సానుకూల నిర్ణయం తీసుకోండి
- కడప స్టీల్ ప్లాంట్ కోసం ఏపీఎండీసీకి గనులు కేటాయించాలి
- విశాఖ మెట్రో రైలు డీపీఆర్ ఇప్పటికే అందజేశాం.. సహకారం అందించండి
- మరో 12 మెడికల్ కాలేజీలకు అనుమతులు మంజూరు చేయండి
- రాష్ట్ర అంశాలపై దాదాపు గంట పాటు ప్రధాని మోదీతో సీఎం జగన్ చర్చ

2లో

సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ దంపతులకు ప్రసాదాన్ని అందజేస్తున్న టీటీడీ చైర్మన్



తిరుచానూరు పద్మావతి అమ్మవారి సేవలో సీజేఐ

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ కుటుంబ సమేతంగా తిరుపతి జిల్లాలోని తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. జస్టిస్ చంద్రచూడ్ దంపతులు కుంకుమార్చన సేవలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సీజేఐ చిత్తూరు జిల్లా శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.

- వివరాలు 2లో

మంచుతో గడ్డ కట్టిన నయాగరా జలపాతం



తేరుకోని అమెరికా

మంచు తుపాను బీభత్సం నుంచి అమెరికా ఇంకా బయట పడలేదు. హిమపాతం కాస్త తగ్గినా.. ఆ దేశవ్యాప్తంగా అతి శీతల వాతావరణం కొనసాగుతోంది. మృతుల సంఖ్య కూడా పెరుగుతోంది. మంచులో కూరుకుపోయిన కార్లలో నిస్సహాయంగా మరణించిన వారి శవాలు ఒక్కటొక్కటిగా బయట పడుతున్నాయి. పశ్చిమ న్యూయార్క్‌లోని బఫెలో నగరంలో పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉంది. చాలాచోట్ల 8 అడుగుల ఎత్తున మంచు పేరుకుపోయింది. మంచు తుపాను, అతి శీతల వాతావరణంతో నయాగరా జలపాతం పాక్షికంగా గడ్డకట్టింది.

6లో





ముకేశ్ అంబానీ @ 20

- ముకేశ్ అంబానీ రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) పగ్గాలను చేపట్టి రెండు దశాబ్దాలయ్యింది. ఈ ఇరవై ఏళ్లలో అనేక రంగాల్లోకి తన సామ్రాజ్యాన్ని విస్తరించారు. ఆయన సారథ్యంలో రిలయన్స్ ఆదాయం 17 రెట్లు, లాభాలు 20 రెట్లు ఎగిశాయి. ముకేశ్ నేతృత్వంలో రిలయన్స్ ప్రస్థానంపై కథనం.

13లో

పేదలందరికీ అన్నం



- రాష్ట్రంలో కొత్తగా 70,807 బియ్యం కార్డుల మంజూరు
- జనవరి మొదటి వారంలో వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ
- రాష్ట్రంలో 1,46,14,803కు చేరిన బియ్యం కార్డుల సంఖ్య
- అదనంగా ప్రభుత్వంపై నెలకు రూ.3.40 కోట్ల భారం

5లో

రైతుల ఖాతాల్లోకి ధాన్యం సొమ్ము

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు రూ.1,773.98 కోట్లు జమ చేసినట్టు పౌరసరఫరాల సంస్థ ఎండీ జి.వీర పాండియన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలోనే బుధవారం రూ.926.90 కోట్లను రైతుల ఖాతాల్లోకి విడుదల చేసినట్టు పేర్కొన్నారు. దాదాపు 16 రోజులు దాటిన ఎఫ్‌టీవోలు అన్నింటికీ నగదు జమ చేశామన్నారు. ఇప్పటి వరకు 3,10,791 మంది రైతుల నుంచి రూ.3,578.43 కోట్ల విలువైన 17.35 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. ఇప్పటి వరకు 1.67 లక్షల మంది రైతులు మద్దతు ధర నగదును అందుకున్నట్టు వివరించారు. త్వరలోనే మిగిలిన రైతులకూ మద్దతు ధరను ఖాతాల్లో వేస్తామని తెలిపారు. రైతులకు గోనె సంచులు, హమాలీ, రవాణా ఖర్చుల కింద రూ.17.66 కోట్లు అందించినట్టు వివరించారు.

క్లుప్తంగా...

నేడు అమిత్ షాతో సీఎం జగన్ భేటీ

సాక్షి, అమరావతి: ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురువారం ఉదయం 10.30 గంటలకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో భేటీ కానున్నారు.

పోలవరానికి పీపీఏ బృందం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనులు, నిర్వాసితులకు పునరావాసం కల్పనను క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో శివ్‌నందకుమార్ నేతృత్వంలోని అధికారుల బృందం బుధవారం రాజమహేంద్రవరానికి చేరుకుంది. పీపీఏ సభ్య కార్యదర్శి రఘురాం, సీఈలు రాజేశ్‌కుమార్, వెంకటసుబ్బయ్య, డైరెక్టర్ దేవేందర్‌రావు ఈ బృందంలో ఉన్నారు. పీపీఏ సీఈవోగా శివ్‌నందకుమార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత క్షేత్ర స్థాయిలో ప్రాజెక్టు పనులను పరిశీలిస్తుండడం ఇదే తొలి సారి. గురువారం పోలవరం ప్రాజెక్టు హెడ్ వర్క్స్, కుడి, ఎడమ కాలువలను జలాశయంతో అనుసంధానం చేసే కనెక్టివిటీలను పీపీఏ బృందం పరిశీలిస్తుంది. శుక్రవారం ఏలూరు జిల్లాలో తాడ్వాయి, కృష్ణునిపాలెం వద్ద నిర్మిస్తున్న పునరావాస కాలనీలను పరిశీలించి, నిర్వాసితులతో సమావేశమవుతుంది. ఆ తర్వాత ఈ సీజన్‌లో చేయాల్సిన పనులు, నిర్వాసితులకు పునరావాసం కల్పించడంపై ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, పోలవరం ప్రాజెక్టు అధికారులతో పీపీఏ బృందం సమీక్ష సమావేశం నిర్వహించనుంది.

ముగిసిన ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2022–23 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ బుధవారంతో ముగిసింది. అయితే బీడీఎస్‌లో ప్రవేశాల ప్రక్రియ గడువు జనవరి 14వ తేదీ వరకూ ఉంది. రాష్ట్రంలో ఉన్న 11 ప్రభుత్వ కళాశాలల్లో 2,185 సీట్లు ఉన్నాయి. అలాగే 16 ప్రైవేట్, రెండు మైనార్టీ కళాశాలల్లో 3 వేలు, శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్)లో 175 సీట్లు ఉన్నాయి. మొత్తం 5,360 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, బీ కేటగిరిలో 12 సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోవడంతో వాటిని సీ కేటగిరిలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలే భర్తీ చేసుకోవాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ ఆదేశించింది. ఎంబీబీఎస్ సీట్లన్నీ భర్తీ అయ్యాయి. రెండు ప్రభుత్వ, 14 డెంటల్ కళాశాలల్లో 1,440 బీడీఎస్ సీట్లు ఉన్నాయి. కడప ప్రభుత్వ డెంటల్ కళాశాలలో అన్ని సీట్లు భర్తీ అయ్యాయి. విజయవాడ ప్రభుత్వ డెంటల్ కళాశాలలో ఒక సీటు, ప్రైవేట్ డెంటల్ కళాశాలల్లో 300 వరకూ సీట్లు భర్తీ కావాల్సి ఉంది.

సడలని పట్టు!

విభజన పెండింగ్ అంశాలపై ప్రధాని మోదీతో చర్చించిన సీఎం జగన్

పెండింగ్ సమస్యలు, విభజన హామీలపై ప్రధాని సానుకూలంగా స్పందించారంటూ అనంతరం సీఎం జగన్ ట్వీట్


ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలన్నింటినీ పరిష్కరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్రం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. రాష్ట్ర విభజన జరిగి 8 ఏళ్ల సుదీర్ఘ కాలం గడిచినా విభజన చట్టంలో పేర్కొన్న అంశాల్లో చాలావరకు ఇప్పటికీ నెరవేర్చలేదని, తెలుగు రాష్ట్రాల మధ్య చాలా అంశాలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయని ప్రధాని దృష్టికి తెచ్చారు. అపరిష్కృత అంశాలపై గతంలో తాము చేసిన విజ్ఞప్తి మేరకు ఏర్పాటైన కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నేతృత్వంలో కమిటీ పలుమార్లు సమావేశమై కొంత పురోగతి సాధించినా కీలక అంశాలు మాత్రం ఇప్పటికీ పరిష్కారం కాలేదని ప్రధానికి వివరించారు. రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ అంశాలపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించేందుకు మంగళవారం రాత్రి ఢిల్లీ చేరుకున్న ముఖ్యమంత్రి జగన్ బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రధానితో సమావేశమయ్యారు. సుమారు గంట పాటు జరిగిన ఈ భేటీలో వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ మళ్లీ విరుచుకుపడుతున్న నేపథ్యంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నట్లు వివరించారు.

ఆర్థిక ఆంక్షలపై జోక్యం చేసుకోండి..

గత సర్కారు పరిమితికి మించి అధికంగా చేసిన రుణాలను ఇప్పుడు సర్దుబాటు చేస్తూ కేంద్ర ఆర్థిక శాఖ రుణ పరిమితిపై ఆంక్షలు విధిస్తోందని, కేటాయించిన రుణ పరిమితిలో కోతలు విధిస్తోందని ముఖ్యమంత్రి జగన్ ప్రధాని దృష్టికి తెచ్చారు. గత సర్కారు చేసిన తప్పిదాలకు ఇప్పుడు ఆంక్షలు విధించడం సరికాదన్నారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో ఈ ఆంక్షలు రాష్ట్రాన్ని బాగా దెబ్బతీస్తాయని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. 2014–15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద చెల్లించాల్సిన బకాయిల అంశాన్ని సీఎం జగన్ ప్రస్తావించారు. రూ.18,330.45 కోట్ల బిల్లులు, 10వ వేతన సంఘం బకాయిలు, పెన్షన్లు మొదలైన వాటి రూపేణా మొత్తం రూ.32,625.25 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వెంటనే మంజూరు చేయాలని కోరారు.

పోలవరానికి నిధులిచ్చి సహకరించండి..

ప్రధానితో భేటీలో ప్రధానంగా పోలవరానికి కేంద్రం నుంచి రావాల్సిన పెండింగ్ నిధులు, సవరించిన అంచనా వ్యయాల ఖరారు, నిర్వాసితులకు చెల్లింపులు లాంటి అంశాలను సీఎం జగన్ ప్రస్తావించారు. ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధుల నుంచి ఖర్చు చేసిన రూ.2,937.92 కోట్లను రెండేళ్లుగా కేంద్రం చెల్లించలేదని, ఈ డబ్బులను వెంటనే విడుదల చేయాలని కోరారు. పోలవరం సవరించిన అంచనా వ్యయం రూ.55,548 కోట్లను సీడబ్ల్యూసీ సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) ఇప్పటికే ఆమోదించిన విషయాన్ని ప్రధానికి గుర్తు చేస్తూ దీన్ని ఖరారు చేసి త్వరగా నిధులివ్వాలని విజ్ఞప్తి చేశారు. తాగునీటి కాంపొనెంట్‌ను విడిగా కాకుండా ప్రాజెక్టులో భాగంగానే చూడాలని కోరారు. నిర్మాణ వ్యయాన్ని కాంపొనెంట్‌వారీగా పరిగణించడంతో బిల్లుల రీయింబర్స్‌మెంట్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనివల్ల నిర్మాణంలో జాప్యం కావడంతోపాటు వ్యయం కూడా పెరుగుతోందని ప్రధానికి వివరించారు. ప్రాజెక్టు నిర్మాణ వ్యయాన్ని కాంపొనెంట్ వారీగా చూడొద్దని, ఆ నిబంధనలను పూర్తిగా తొలగించాలని కోరారు. పోలవరం నిర్వాసితులకు సహాయ పునరావాస ప్యాకేజీని డీబీటీ ద్వారా చెల్లిస్తే చాలావరకు సమయం ఆదా అవుతుందన్నారు. ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టి ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. 41.15 మీటర్ల ఎత్తు వరకు నిర్వాసిత కుటుంబాలను తరలించేందుకు రూ.10,485.38 కోట్లు అవసరమని, అడ్‌హాక్‌గా నిధులు మంజూరు చేస్తే పనులు వేగంగా కొనసాగుతాయని వివరించారు. ఈ నిధులను మంజూరు చేస్తే భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ పనులు సకాలంలో పూర్తి చేసే అవకాశం ఉంటుందన్నారు.

ప్రధాని సానుకూలం.. సీఎం ట్వీట్

విజ్ఞప్తులపై ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారని భేటీ అనంతరం ముఖ్యమంత్రి జగన్ ట్వీట్ చేశారు. 'రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రధానితో చర్చించాం. రాష్ట్ర విభజన హామీలు నెరవేర్చాలని, ప్రత్యేక హోదాతో పాటు పలు పెండింగ్ అంశాలను పరిష్కరించాలని కోరటంపై ప్రధాని సానుకూలంగా స్పందించారు' అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

తెలంగాణ బకాయిలు.. హోదా.. విశాఖ మెట్రో

తెలంగాణ డిస్కంల నుంచి ఏపీకి రావాల్సిన రూ.6,886 కోట్ల కరెంటు బకాయిలను వెంటనే ఇప్పించాలని ప్రధానిని సీఎం జగన్ కోరారు. తీవ్ర ఆర్థిక కష్టాల్లో ఉన్న ఏపీ జెన్‌కోకు ఈ బకాయిల వసూలు అత్యవసరమన్నారు. జాతీయ ఆహార భద్రతా చట్టం నిబంధనలు హేతుబద్ధంగా లేకపోవడంతో రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో అర్హత ఉన్నప్పటికీ 56 లక్షల కుటుంబాలు పీఎంజీకేఏవై కింద లబ్ధి పొందడం లేదని, వీరికి రేషన్ సరుకులను రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా అందిస్తోందని చెప్పారు. ఇందుకోసం రూ.5,527 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. నెలకు సుమారు 3 లక్షల టన్నుల రేషన్ బియ్యం నిల్వలు కేంద్రం వద్ద మిగిలిపోతున్నాయని, ఇందులో 77 వేల టన్నులు రాష్ట్రానికి కేటాయిస్తే అర్హులందరికీ ఆహార భద్రతా చట్టం వర్తింపచేసినట్లు అవుతుందని సీఎం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తం చేసిన అంశాలతో నీతి ఆయోగ్ కూడా ఏకీభవించి కేంద్రానికి సిఫార్సు చేసిందని గుర్తు చేశారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని సీఎం కోరారు.

- రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవాలని సీఎం జగన్ ప్రధానిని కోరారు. విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన ఏపీకి ప్రత్యేక హోదా అవశ్యమన్నారు. పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.
- కడపలో నిర్మించనున్న స్టీల్ ప్లాంట్‌కు సరిపడా ఖనిజాన్ని అందుబాటులో ఉంచేలా ఏపీఎండీసీకి గనులు కేటాయించాలని సీఎం కోరారు.
- రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుతో వాటి సంఖ్య 26కు పెరిగిన నేపథ్యంలో అదనంగా మెడికల్ కాలేజీలను మంజూరు చేయాలని సీఎం కోరారు. కేంద్రం కొత్తగా మంజూరు చేసిన 3 మెడికల్ కాలేజీలతో కలిపి 14 మాత్రమే ఉన్నందున మిగిలిన 12 జిల్లాలకు కూడా వెంటనే వైద్య కళాశాలలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పునర్విభజన తర్వాత ప్రతి జిల్లాలో సుమారుగా 18 లక్షల మంది జనాభా ఉన్నట్లు తెలిపారు.
- విశాఖలో 76.9 కిలోమీటర్ల మేర మెట్రో రైల్ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే డీపీఆర్ సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని సీఎం జగన్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ప్రధానిని కోరారు.

రాష్ట్రపతి ముర్ముకు రాజమహేంద్రవరంలో ఘన స్వాగతం


విమానాశ్రయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలుకుతున్న మంత్రులు

మధురపూడి(రాజమహేంద్రవరం): రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం విమానాశ్రయంలో బుధవారం ఘన స్వాగతం లభించింది. ఉదయం 9.40 నిమిషాలకు ఆమె ప్రత్యేక విమానంలో హైదరాబాద్ నుంచి భద్రాచలం వెళ్తూ ఎయిర్‌పోర్టుకు వచ్చారు. కొద్ది నిమిషాలు ఉండి తర్వాత హెలికాప్టర్‌లో భద్రాచలానికి బయలుదేరారు. అంతకు ముందు రాష్ట్రపతికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, హోంమంత్రి తానేటి వనిత స్వాగతం పలికారు. రాష్ట్రపతి వెంట కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, తెలంగాణ గిరిజనశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఉన్నారు. స్వాగతం పలికిన వారిలో జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఇన్‌చార్జి ఎస్పీ సిహెచ్.సుధీర్ కుమార్, ఫైర్ శాఖ డీజీ ఎన్.సంజయ్, ఏలూరు రేంజ్ డీఐజీ పాలరాజు, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు, విజయనగరం బెటాలియన్ కమాండెంట్ విక్రమ్ సింగ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఉన్నారు.

భద్రాద్రి ఆలయంలో ముర్ము ప్రత్యేక పూజలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/వరంగల్: రాష్ట్రపతి బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో పర్యటించారు. రాజమండ్రి నుంచి హెలికాప్టర్ ద్వారా సారపాకలోని ఐటీసీకి చేరుకున్న ముర్ము.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ప్రయాణించి భద్రాద్రి రాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థయాత్ర పునరుజ్జీవనం, స్పిరిచ్యువల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్ (ప్రశాద్) పథకం ద్వారా రూ.41 కోట్లతో చేపట్టబోతున్న పనులకు శంకుస్థాపన చేశారు. తెలంగాణ ఆదివాసీ కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మక్క సారలమ్మ పూజారుల సమ్మేళనంలో పాల్గొన్నారు. అదే వేదిక నుంచి వర్చువల్ పద్ధతిలో ఆసిఫాబాద్, మహబూబాబాద్ జిల్లా నామాలపాడులో కొత్తగా నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రారంభించారు. ములుగు జిల్లా రామప్ప దేవాలయాన్ని రాష్ట్రపతి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న సీజేఐ

శ్రీనివాసమంగాపురంలో గోపూజలో పాల్గొన్న సీజేఐ దంపతులు


కుటుంబ సమేతంగా కళ్యాణ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న జస్టిస్ చంద్రచూడ్

తిరుచానూరు/చంద్రగిరి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ బుధవారం కుటుంబ సమేతంగా తిరుపతి జిల్లాలోని తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట వారికి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జిల్లా జడ్జి వీర్రాజు, టీటీడీ సీవీఎస్వో నరసింహ కిషోర్, తదితరులు పూర్ణకుంభంతో సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ధ్వజస్తంభానికి మొక్కుకున్న అనంతరం జస్టిస్ చంద్రచూడ్ దంపతులు కుంకుమార్చన సేవలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. దర్శనానంతరం ఆశీర్వాద మండపంలో పండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం సీజేఐ కుటుంబసమేతంగా చిత్తూరు జిల్లా శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఆయనకు వైవీ సుబ్బారెడ్డి, అనిల్ కుమార్ సింఘాల్ స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు సాంప్రదాయ బద్ధంగా స్వాగతించారు. ధ్వజస్తంభానికి మొక్కుకున్న అనంతరం జస్టిస్ చంద్రచూడ్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు శేషవస్త్రం అందజేసి వేదాశీర్వాదం చేశారు. సీజేఐకి చైర్మన్, ఈవోలు స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం సీజేఐ దంపతులు ఆలయంలో గోపూజలో పాల్గొని గోవు, దూడకు గ్రాసం తినిపించారు.

వెంకన్న సేవలో సుప్రీం కోర్టు రిజిస్ట్రార్

శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వర స్వామిని బుధవారం సుప్రీం కోర్టు రిజిస్ట్రార్ రాజీవ్ శర్మ, ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ లక్ష్మణరావు దర్శించుకున్నారు. వీరికి ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఏఈవో గురుమూర్తి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

'షోక సంద్రం


క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం


ఘటనాస్థలంలో చెల్లాచెదురుగా పడిన చెప్పులు


ఆసుపత్రిలో క్షతగాత్రుడికి వైద్యం అందజేస్తున్న వైద్య సిబ్బంది

▶ మొదటి పేజీ తరువాయి

బైక్‌లు పార్క్ చేయగా... ఓ తోపుడు బండి, టీవీ ప్రసారాల లైవ్ వెహికల్ కూడా ఉండటంతో... కొందరు లైవ్ వెహికల్ ఎక్కారు. మరికొందరు బైకులు పట్టుకుని నిల్చున్నారు.

ఇంతలోనే చంద్రబాబు కాన్వాయ్ భారీ వాహన ర్యాలీతో వచ్చింది. ఒక్కసారిగా వాహనాలు రావడంతో ఎన్‌టీఆర్ సర్కిల్ మధ్య తన ప్రసంగ వాహనాన్ని నిలపాల్సిన చంద్రబాబునాయుడు కొంచెం ముందుకు బాగా ఇరుగ్గా ఉండే ప్రదేశంలో నిలిపారు. దాంతో ఈ నాలుగు రోడ్ల కూడలి కాస్త మరింత ఇరుగ్గా మారిపోయింది. చంద్రబాబు తన ప్రసంగం ప్రారంభించబోతూ.... గుండంకట్ట రోడ్డులో ఉన్న లైవ్ వెహికల్ ఎక్కిన వారిని దిగిపోవాలని అభ్యర్థించారు. ''తమ్ముళ్లూ... మీరంతా దిగాలి'' 'ఏయ్ తమ్ముళ్లా అందరూ దిగండి' అంటూ పదే పదే కేకలు వేశారు. దీంతో ఆ ప్రాంతంలో కాస్త అలజడి నెలకొంది. అదే సమయంలో చంద్రబాబు ప్రసంగ వాహనానికి వెనుక వైపు ఉన్న వారు ఒక్కసారిగా ముందుకు చొచ్చుకురావడంతో మరింత గందరగోళం నెలకొంది. అంతా ముందుకు రావటంతో గుండంకట్ట రోడ్డులో తోపులాట మొదలై తోపుడు బండి తిరగబడిపోయింది. బైకులపై పడింది. బైకులన్నీ వరసగా కిందికి పడిపోవటంతో... వాటిని ఆనుకుని ఉన్న కొందరు జనం కూడా అదుపు తప్పి బైకుల కింద, పక్కనున్న కాలువలోను పడిపోయారు. ఈ హఠాత్పరిమాణంతో వారు భయపడి... గట్టిగా కేకలు వేస్తూ లేవటానికి ప్రయత్నించారు. అయితే ఆ అరుపులతో మరింత మంది కంగారుపడ్డారు. భయభ్రాంతులై ఏదో జరిగిపోతోందనుకుని పరుగులు పెట్టారు. అదే రోడ్లో నుంచి మరికొంత ముందుకు వెళ్లటానికి ప్రయత్నించారు. ఈ సంఘటనను దగ్గర్నుంచి చూస్తున్న పలువురు తెలుగుదేశం కార్యకర్తలు అరుస్తూ వారిని నిలువరించబోయారు. కానీ ఆ అరుపులతో వారంతా మరింత కంగారుపడి కింద పడ్డ వారిని పట్టించుకోకుండా తొక్కుకుంటూ వెళ్లిపోవటానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో మరింత మంది కిందపడ్డారు. అలా పడిన వారిలో చాలా మంది ఊపిరాడక లేవలేకపోయారు. ఫలితంగా ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా... మరో ఆరుగురు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ మరణించారు. మరో ఎనిమిది మందికి సైతం తీవ్రంగా గాయాలయ్యాయి. వారంతా ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఈ సర్కిల్లో ఇదే తొలిసారి...

కందుకూరు ఎన్‌టీఆర్ సర్కిల్‌కు నాలుగువైపులా దక్షిణం వైపు పామూరు రోడ్, ఉత్తరం వైపు బైపాస్ రోడ్, తూర్పు గుండంకట్ట రోడ్, పడమర ఇప్పగుంట రోడ్ ఉంటాయి. ఆ నాలుగు రోడ్లూ జంక్షన్ నుంచి కొంత ఇరుగ్గానే ఉంటాయి. కాకపోతే పామూరు రోడ్‌లో జంక్షన్ నుంచి ఓ 200 మీటర్లు వెళితే రోడ్డు వందడుగులతో విశాలంగా ఉంటుంది. గతంలో వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఈ వందడుగుల రోడ్లోనే సభ ఏర్పాటు చేశారు. రోడ్డు విశాలంగా ఉండటంతో జనం భారీగా తరలి వచ్చినా సాఫీగా సాగిపోయింది. ఇక చంద్రబాబు నాయుడు కూడా గతంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇక్కడకు వచ్చినపుడు స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో సభ నిర్వహించారు. దీంతో పాటు గతంలో దాదాపు 5 సార్లు కందుకూరుకు వచ్చిన చంద్రబాబు... ప్రతిసారీ స్థానిక అంకమ్మ దేవాలయం ప్రాంగణంలో సభను నిర్వహించారు. అది విశాలమైన ప్రాంగణం కావటంతో ఎంత మంది జనం వచ్చినా ఇబ్బంది ఉండేది కాదు. కానీ ఈ సారి ఇరుకు రోడ్లను ఎంచుకోవటంతో ఊహించని దారుణం జరిగిపోయిందని స్థానికులు వాపోతున్నారు.

ప్రసంగం ప్రారంభించకముందే....

చంద్రబాబు సభలో ప్రసంగం ప్రారంభిస్తున్నపుడే ఈ ఘోరం చోటు చేసుకోవటంతో ఆయన ప్రసంగం నిలిపేశారు. జరిగిన ఘటన తెలుసుకుని, బాధితులను ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్ళాక, ఆయన కూడా ఆసుపత్రికి వెళ్లారు. పరామర్శించిన అనంతరం మళ్లీ ఎన్టీఆర్ సర్కిల్‌కు వచ్చి... ఈ సంఘటన దురదృష్టకరమంటూనే... అందరూ ఆవేశంతో ఉన్నారని వ్యాఖ్యానించటం గమనార్హం.

విషాద సంఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు పార్టీ తరఫున రూ.10 లక్షల వంతున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు.

చంద్రబాబు పర్యటన ఇలా..

చంద్రబాబు తొలుత సింగరాయకొండ ఫ్లైఓవర్ నుంచి నేరుగా ఓగూరు మీదగా కందుకూరు వాసవీ నగర్ గుడికి వచ్చి పూజలు చేశారు. అనంతరం కోటారెడ్డి సెంటర్‌కు చేరుకుని డీవీ కొండయ్య చౌదరి విగ్రహానికి పూలమాల వేశారు. అక్కడ నుంచి పోస్టాఫీస్ సెంటర్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్‌కు వచ్చారు. షెడ్యూల్ కంటే గంట సేపు ఆలస్యంగా సభ మొదలుపెట్టబోయారు. కాగా శింగరాయకొండ జాతీయ రహదారిపై మల్లినేని లక్ష్మయ్య ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా చంద్రబాబు కాన్వాయ్‌లో అపశృతి చోటు చేసుకుంది. రహదారిపై వెళ్తున్న స్కూటరిస్ట్‌ను చంద్రబాబు వాహనం ఢీకొనడంతో స్కూటరిస్ట్ కిందపడిపోయాడు. స్కూటర్ దెబ్బతింది.

కూలి వస్తుందని ఆశపడి మీటింగ్‌కు...

మీటింగ్‌కు వెళితే కూలి వస్తుందని ఆశపడిన ఆ మహిళ... చంద్రబాబు కందుకూరు పర్యటనకు వెళ్లి ప్రాణాలు కోల్పోయింది. ఉలవపాడు వరిగచేను సంఘానికి చెందిన యాటగిరి విజయ (54) కూలి చేసుకుని జీవిస్తోంది. ఆమె భర్త శీనయ్యది నిజామాబాద్‌లో బేల్దారి పని. వీరికి ముగ్గురు పిల్లలు. ఇద్దరు ఆడపిల్లలు, ఒక అబ్బాయి. పెద్దకుమార్తె తండ్రి వద్దే ప్రై వేటు కంపెనీలో పనిచేస్తుండగా, రెండో కుమార్తె శిరీష ఉలవపాడులోని ఓ షాపులో పనిచేస్తోంది. కుమారుడు శ్రీకర్ టెన్త్ క్లాస్. టీడీపీ నాయకులు చంద్రబాబు కార్యక్రమం కోసం ఈ సంఘం నుంచి ఆటోలు పెట్టి మహిళలకు కూలి ఏర్పాటు చేశారు. కూలి డబ్బులు వస్తాయి కదా అని మీటింగ్‌కు వెళ్లిన విజయ... అక్కడ కాల్వలో పడి ఊపిరాడక మృతి చెందింది. వీరు రెండేళ్ల క్రితం వరకు హైదరాబాద్‌లో బేల్దారి పని చేసుకునేవారు. కరోనా తరువాత ఇక్కడకు వచ్చి ఆధార్, రేషన్ కార్డులు మార్పించుకుని ఇక్కడే ఉంటున్నారు.

మృతులు వీరే...

- దేవినేని రవీంద్రబాబు (73) ఆత్మకూరు గ్రామం, ఉలవపాడు మండలం
- యాటగిరి విజయ (35) వరిచేను సంఘం, ఉలవపాడు మండలం
- ఉప్పలూరి పురుషోత్తం (65) గుండ్లపాలెం, గుడ్లూరు మండలం
- కలవకూరి యానాది (53) కొండముడుచుపాలెం, కందుకూరు మండలం
- కాకుమాను రాజా (50) గుర్రంవారిపాలెం, కందుకూరు పట్టణం
- మర్లపాటి చినకొండయ్య (55) అమ్మవారిపాలెం, గుడ్లూరు మండలం
- గడ్డం మధుబాబు (45) ఓగూరు, కందుకూరు మండలం
- ఇదిమూడి రాజేశ్వరి, (35) కందుకూరు

గాయపడినవారు..

- దిమ్మకూర్తి మస్తాన్, పెద్ద అమ్మపాలెం, వలేటివారిపాలెం
- గోచిపాతల రమేష్, మోచర్ల, గుడ్లూరు మండలం
- వెంకటాద్రి పిచ్చయ్య, శ్రీరంగ రాజుపాలెం, మాచవరం
- శానివరపు మణికంఠ, పోలినేనిచెరువు, వలేటి వారిపాలెం
- ఎస్‌కే మస్తూర్, తెట్టు గ్రామం, గుడ్లూరు మండలం
- చెరుకూరి మాల్యాద్రి, దపలంపాడు, గుడ్లూరు మండలం
- ఉన్నం ప్రభాకర్, విక్కిరాలపేట, కందుకూరు మండలం
- మదులూరి రంగమ్మ, గుళ్లపాలెం, గుడ్లూరు మండలం

కన్నీళ్లను తుడిచేది సీమ ఎత్తిపోతలే

అది మినహా మరో ప్రత్యామ్నాయం లేదు రాయలసీమ కడగండ్లను తీర్చండి

- శ్రీశైలం, సాగర్‌పై తెలంగాణ ఏకపక్ష ధోరణి
- యథేచ్ఛగా విద్యుదుత్పత్తికి నీటి విడుదలతో ఏపీ ప్రయోజనాలకు తీవ్ర నష్టం
- కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌తో సీఎం జగన్ భేటీ


కేంద్రమంత్రి భూపేంద్రయాదవ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, న్యూఢిల్లీ: తరతరాలుగా కరువుతో తల్లడిల్లుతున్న సీమ కడగండ్లు తీర్చేలా చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌కు సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారు. కరువుతో అల్లాడే సీమ ప్రాంతానికి తాగునీరు అందించేలా రాయలసీమ ఎత్తిపోతల ఎంతో ఉపకరిస్తుందని పథకం ఆవశ్యకతను వివరించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాలకు సంబంధించిన అంశాలను కూడా కేంద్రమంత్రి దృష్టికి తెచ్చారు. మచిలీపట్నం, భావనపాడు పోర్టులు, పంప్డ్ స్టోరేజీ విద్యుదుత్పత్తి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు వేగంగా మంజూరు చేసి రాష్ట్ర ప్రగతికి తోడ్పాటు అందించాలని కోరారు. బుధవారం ఢిల్లీలో భూపేంద్రయాదవ్‌తో 40 నిమిషాల పాటు సమావేశం సందర్భంగా పర్యావరణ అనుమతులతోపాటు రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సీఎం చర్చించారు.

ఏకపక్షంగా నీటి విడుదల..

కృష్ణా నదిపై ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల విషయంలో తెలంగాణ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. కృష్ణా నది యాజమాన్య బోర్డు ఆపరేషనల్ ప్రొటోకాల్స్, ఒప్పందాలు, ఆదేశాలను ఉల్లంఘించడంతో కృష్ణాపై వాటా హక్కుల్ని ఏపీ కోల్పోవాల్సి వస్తోందన్నారు. 2021–22, 2022–23లో సీజన్ ప్రారంభమైన తొలిరోజు నుంచి అంటే జూన్ 1వ తేదీ నుంచే విద్యుదుత్పత్తి కోసం తెలంగాణ ప్రభుత్వం కృష్ణా జలాలను వినియోగించడం ప్రారంభించిందన్నారు. శ్రీశైలం జలాశయంలో కనీస నీటి మట్టం 834 అడుగులు కంటే తక్కువగా ఉన్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం విద్యుదుత్పత్తికి నీటిని విడుదల చేయడంతో పాటు బోర్డుకు ఎలాంటి ఇండెంట్ లేకుండా... నాగార్జునసాగర్, కృష్ణాడెల్టాకు అవసరం లేనప్పటికీ ఏకపక్షంగా నీటిని విడుదల చేసిందన్నారు. నీటి పారుదల అవసరాల్లో విద్యుదుత్పత్తి అన్నది కేవలం యాదృచ్ఛికంగా ఉంటుందని స్పష్టం చేశారు. విద్యుదుత్పత్తి కోసం తెలంగాణ ప్రభుత్వం ఏటా 796 అడుగుల దిగువ వరకు నీటిని విడుదల చేస్తూ శ్రీశైలంలో కనీస నీటి మట్టం నిర్వహణకు సహకరించడం లేదని సీఎం జగన్ తెలిపారు. దీనివల్ల ఏపీ ఎదుర్కొంటున్న ఇబ్బందిని గతంలోనే కేంద్రం దృష్టికి తెచ్చామని గుర్తు చేశారు. శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 881 అడుగులకు చేరుకుంటే కానీ పోతిరెడ్డిపాడు నుంచి పూర్తిస్థాయిలో నీటి విడుదల సాధ్యం కాదని కేంద్రమంత్రికి వివరించారు. లేదంటే పోతిరెడ్డిపాడు నుంచి కరువు పీడిత రాయలసీమ సాగు, తాగునీటి అవసరాలతో పాటు శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు, చెన్నైకి తాగునీరు అందించడం సాధ్యం కాదన్నారు.

ఎత్తిపోతల మినహా మరో ప్రత్యామ్నాయం లేదు..

తెలంగాణ ప్రభుత్వం అనధికారికంగా, ఎలాంటి పర్యావరణ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (3 టీఎంసీలు), డిండి పథకాల గురించి గతంలోనే కేంద్రం దృష్టికి తెచ్చామని సీఎం జగన్ గుర్తు చేశారు. దీనివల్ల శ్రీశైలం నీటి మట్టం 854 అడుగుల కంటే పైన నిర్వహించడం సాధ్యం కాదని, మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన నీటిని వినియోగించుకోవడం కూడా సాధ్యపడదన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రాయలసీమ ఎత్తిపోతల పథకం (ఆర్‌ఎల్‌ఎస్) అమలు చేయడం మినహా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మరో ప్రత్యామ్నాయం లేదని, దీనిద్వారా రోజుకు 3 టీఎంసీల నీటిని తెలుగు గంగ ప్రాజెక్టు, ఎస్ఆర్‌బీసీ, గాలేరునగరి సుజల స్రవంతికి సరఫరా చేయగలుగుతామన్నారు. నిబంధనలు, ప్రొటోకాల్స్‌ను పూర్తిగా విస్మరించి తెలంగాణ ప్రభుత్వం నీటిని విడుదల చేయటాన్ని దృష్టిలో పెట్టుకుని రాయలసీమ ఎత్తిపోతలను సాధ్యమైనంత వేగంగా పూర్తి చేయడం ద్వారా ఏపీ ప్రయోజనాలు ప్రమాదంలో పడకుండా కాపాడాలన్నారు.

పంప్డ్ స్టోరేజ్ విద్యుదుత్పత్తి..

పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ప్రధాని మోదీ లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపట్టిందని సీఎం జగన్ వివరించారు. పంప్డ్ స్టోరేజ్ విద్యుదుత్పత్తికి అనువైన స్థలాలను గుర్తించడంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని, వీటిని ప్రోత్సహించేందుకు పాలసీ కూడా రూపొందించినట్లు తెలిపారు. ఆ తరహా ప్రాజెక్టులకు ఎర్రవరం, కురికుట్టి, సోమశిల, అవుకు లాంటి చోట్ల ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో వాటికి అనుమతులు ఇవ్వాలని కోరారు. వైఎస్సార్ జిల్లా గండికోట వద్ద 1,000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు కోసం ఇప్పటికే కేంద్ర అటవీ పర్యావరణ శాఖకు ప్రతిపాదనలు పంపినట్లు గుర్తు చేశారు. వీటితో పాటు లోయర్ సీలేరు హైడ్రో పవర్ ప్రాజెక్టు (230 మెగావాట్లు), అప్పర్ సీలేరు పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టుల (1,350 మెగావాట్లు) పర్యావరణ అనుమతుల కోసం దరఖాస్తు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ఉజ్వల ప్రగతికోసం చేపట్టిన ఆయా ప్రాజెక్టులన్నింటికీ అవసరమైన పర్యావరణ అనుమతులు త్వరగా మంజూరు చేయాలని కేంద్రమంత్రికి సీఎం జగన్ విజ్ఞప్తి చేశారు.

ప్రధాన కాలువకు నీటిని అందించేందుకే..

రాయలసీమ ఎత్తిపోతలకు పర్యావరణ అనుమతుల కోసం కేంద్ర అటవీ పర్యావరణశాఖకు దరఖాస్తు చేశామని, దీనికి సంబంధించి రాష్ట్ర అధికారులతో సమగ్ర చర్చలు జరిగాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి సమాచారాన్ని ఇప్పటికే అందించామన్నారు. ఇందుకోసం భూ సేకరణ చేయడం లేదని, అటవీ ప్రాంతం, వన్యప్రాణుల అభయారణ్యాల ప్రమేయం లేదని, ఎకో సెన్సిటివ్ జోన్ నుంచి 10 కి.మీ దూరంలో ఉండడంతో పాటు కేవలం ప్రధాన కాలువకు పూర్తిస్థాయిలో నీటిని అందించడం కోసమే ఎత్తిపోతలను చేపడుతున్నట్లు సీఎం వివరించారు. వీలైనంత త్వరలో రాయలసీమ ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

3 పోర్టులు.. 9 ఫిషింగ్ హార్బర్లు

''ఏపీ 974 కిలోమీటర్ల విస్తారమైన తీరప్రాంతంతో అపారమైన ఆర్థిక కార్యకలాపాలకు అనువుగా ఉందని సీఎం జగన్ కేంద్రమంత్రికి తెలిపారు. రామాయపట్నం, మచిలీపట్నం, భావనపాడులో మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. దీంతోపాటు తీరప్రాంతంలో 10 లక్షల మంది మత్స్యకారుల కుటుంబాలను ఆదుకునేందుకు 9 వ్యూహాత్మక ప్రదేశాలలో ఫిషింగ్ హార్బర్‌ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. రామాయపట్నం ఓడరేవు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, 2024 మార్చి నాటికి పోర్టు కార్యకలాపాలు కూడా ప్రారంభం కానున్నాయన్నారు. మచిలీపట్నం, భావనపాడు పోర్టులకు పర్యావరణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుని అవసరమైన సమాచారాన్ని కూడా అందజేశామన్నారు. ఈ పనులను వేగంగా ప్రారంభించేందుకు వీలుగా అనుమతులిచ్చి సహకారం అందించాలని కోరారు.

తగ్గిన నేరాలు.. పెరిగిన భద్రత

వినూత్న విధానాలతో రాష్ట్రంలో సమర్థంగా నేరాల కట్టడి
- తగ్గిన రోడ్డు ప్రమాదాలు
- లోన్‌యాప్ వేధింపులపై కఠిన చర్యలు
- పోలీసు శాఖ వార్షిక నివేదిక విడుదల చేసిన డీజీపీ


వార్షిక క్రైమ్ రిపోర్టును మీడియాకు చూపిస్తున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో పోలీసు శాఖ నేరాలను నియంత్రించి శాంతిభద్రతలను సమర్థంగా పరిరక్షిస్తోందని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పారు. వినూత్న పోలీసింగ్ విధానాలతో 2022లో అన్ని రకాల నేరాలు తగ్గడంతో పాటు ప్రజలకు మెరుగైన భద్రతను అందించగలిగామని తెలిపారు. ఆయన బుధవారం మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర పోలీసు శాఖ వార్షిక నివేదిక – 2022ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. గంజాయి, అక్రమ మద్యం దందాను సమర్థంగా కట్టడి చేశామన్నారు. అసాంఘిక శక్తులపై నిఘా, పీడీ యాక్ట్ ప్రయోగం, తక్షణ అరెస్టులతో రాష్ట్రంలో హత్యలు, ఘర్షణలను నియంత్రించినట్లు తెలిపారు. గ్రామాల సందర్శన, అవగాహన కార్యక్రమాలతో ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలు, దాడులను గణనీయంగా తగ్గించామన్నారు. దిశ వ్యవస్థను పటిష్టంగా అమలు చేశామన్నారు. నేర ప్రభావిత ప్రదేశాల జియో మ్యాపింగ్, మహిళా పోలీసుల పర్యవేక్షణ తదితర చర్యలతో మహిళా భద్రతను పటిష్టం చేసినట్లు చెప్పారు. రోడ్లపై బ్లాక్ స్పాట్‌లు గుర్తించడం, ఇతరత్రా చర్యలతో రోడ్డు ప్రమాదాలను తగ్గించామన్నారు. లోన్ యాప్ వేధింపులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్ర పోలీసు శాఖ జాతీయ స్థాయిలో 36 అవార్డులు సాధించిందని చెప్పారు. 420 ఎస్సై పోస్టులు, 6,100 కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. కానిస్టేబుల్ పోస్టుల్లో హోంగార్డులకు తొలిసారిగా రిజర్వేషన్ కల్పించామన్నారు. కొత్తగా నాలుగు ఐఆర్ బెటాలియన్లు మంజూరయ్యాయని అన్నారు. 2023లో కూడా సమర్థ పోలీసింగ్‌తో శాంతిభద్రతలను పరిరక్షిస్తామని చెప్పారు.

డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి వెల్లడించిన ప్రధానాంశాలు ఇవీ...

▲ 2020లో రాష్ట్రంలో 2,92,565 కేసులు, 2021లో 2,84,753 కేసులు నమోదు కాగా 2022లో కేసులు 2,31,359కి తగ్గాయి. గత సంవత్సరంతో కలిపి పెండింగ్ కేసులు 3,77,584 ఉండగా, 2,66,394 కేసుల దర్యాప్తు పూర్తయింది. దీంతో పెండింగ్ కేసుల సంఖ్య 1,11,190కి తగ్గింది. 96 శాతం కేసుల్లో 60 రోజుల్లోనే చార్జిషీట్లు దాఖలు చేశారు. నేరాలకు శిక్షలు 66.69 శాతానికి పెరిగాయి. 2020లో 21 పోక్సో కేసుల్లో శిక్షలు పడగా, 2022లో ఆరు నెలల్లోనే 90 కేసుల్లో శిక్షలు పడ్డాయి. 42 కేసుల్లో జీవిత ఖైదు పడటం గమనార్హం. రాష్ట్రంలో 2021లో 945 హత్య కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 857కు తగ్గాయి. రోడ్డు ప్రమాదాలు 2021లో 19,203 జరగ్గా 2022లో 18,739కు తగ్గాయి.

▲ లైంగిక దాడి కేసులు 2021లో 1,456 నమోదు కాగా, ఈ ఏడాది 1,419 నమోదయ్యాయి. పోలీసులు చేపట్టిన అవగాహన కార్యక్రమాలతో మహిళలు ధైర్యంగా ఫిర్యాదులు చేస్తున్నారు. దాంతో కేసుల సంఖ్య పెరిగింది. మహిళలపై వేధింపుల్లో 2021లో 10,373 కేసులు నమోదు కాగా 2022లో 11,895 నమోదయ్యాయి.

▲ దిశ యాప్‌ను 1,37,54,267 మంది డౌన్‌లోడ్ చేసుకోగా, 1,11,08,227 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 2022లో దిశ యాప్ వినతుల్లో 17,933 కేసుల్లో తక్షణ చర్యలు తీసుకుని 1,585 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

▲ ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారం కేసులు 2021లో 231 నమోదు కాగా, 2022లో 205కు తగ్గాయి. దాడులపై 2021లో 606 నమోదవగా 2022లో 585 నమోదయ్యాయి.

▲ అక్రమ మద్యం, నాటుసారాపై మొత్తం 37,189 కేసులు నమోదు చేసి 28,803 మందిని అరెస్టు చేశారు. 169 మందిపై పీడీ యాక్ట్ అమలు చేశారు. 2,093 గ్రామాలను నాటు సారా లేని గ్రామాలుగా ప్రకటించారు. కేవలం 103 గ్రామాలు మాత్రమే నాటు సారా లేని గ్రామాలుగా ప్రకటించాల్సి ఉంది. నాటుసారా తయారీపైనే ఆధారపడుతున్న 1,363 కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించారు.

▲ ఆపరేషన్ పరివర్తన్ ద్వారా 7119.85 ఎకరాల్లో గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. కేవలం ఐదు రోజుల్లో 720 ఎకరాల్లో గంజాయి సాగును ధ్వంసం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2,45,000 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 70 శాతం ఒడిశా నుంచి తరలిస్తున్నదే.

ఏప్రిల్ మొదటి వారంలో టెన్త్ పరీక్షలు

ఆరు పేపర్లు.. రోజు విడిచి రోజు నిర్వహణ
- ప్రభుత్వానికి ఎస్సెస్సీ బోర్డు ప్రతిపాదనలు
- ఏప్రిల్ 4తో ముగియనున్న ఇంటర్ పరీక్షలు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో టెన్త్ పబ్లిక్ పరీక్షలు–2023 ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభం కానున్నాయి. ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ముగింపు తేదీకి అటుఇటుగా ఒకరోజు వ్యవధిలో టెన్త్ పబ్లిక్ పరీక్షలను ప్రారంభించేలా రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్(ఎస్సెస్సీ బోర్డు) షెడ్యూల్‌ను రూపొందించింది. ఇంటర్ పరీక్షలు మార్చి 15న ప్రారంభమై ఏప్రిల్ 4వ తేదీతో ముగుస్తాయి. రాష్ట్రంలో పాఠశాల విద్యలో సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) విధానాన్ని అనుసరిస్తున్న నేపథ్యంలో.. టెన్త్ పబ్లిక్ పరీక్షలనూ అదే ప్యాట్రన్‌లో చేపట్టాలని విద్యాశాఖ నిర్ణయించింది. సీబీఎస్ఈలో పబ్లికపరీక్షలు రోజు విడిచి రోజు జరుగుతాయి. టెన్త్ పబ్లిక్ పరీక్షలను కూడా రోజు విడిచి రోజు నిర్వహించాలని ఎస్సెస్సీ బోర్డు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. టెన్త్ పబ్లిక్ పరీక్షలను ఆరు పేపర్లలోనే నిర్వహించేలా ప్రభుత్వం ఇంతకు ముందు ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసిందే. ఆ మేరకు ఆరు పేపర్ల పరీక్షలను రోజు విడిచి రోజు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు సంబంధించి ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానందరెడ్డి ఇటీవల పలు విద్యాసంస్థల యాజమాన్యాలతో జూమ్ మీటింగ్ నిర్వహించి.. పలు అంశాలపై చర్చించారు. సైన్స్ సబ్జెక్టుకు సంబంధించి ఫిజికల్ సైన్స్, నేచురల్ సైన్స్‌లు కలిపి ప్రశ్నపత్రాలిస్తారు. పీఎస్‌లో 16, ఎన్ఎస్‌లో 17 ప్రశ్నలుంటాయి. సమాధాన పత్రాలు రెంటికీ వేర్వేరుగా రాయాల్సి ఉంటుంది. ముందు పీఎస్, అనంతరం ఎన్ఎస్ ప్రశ్నలుంటాయి. అలానే సమాధానాలూ రాయాలి.

పేర్లు, వివరాల్లో తప్పులు సరిచేసుకునేందుకు.. ఎడిట్ ఆప్షన్

పరీక్ష ఫీజును పాఠశాలల యాజమాన్యాలు కట్టినా, లేదా సీఎఫ్ఎంఎస్ ద్వారా ఎవరు కట్టినా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. విద్యార్థి పేరు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ తదితర వివరాలు తప్పుగా నమోదు చేసి ఉంటే కనుక ఆందోళన చెందాల్సిన పనిలేదని, పరీక్ష ఫీజు చెల్లించిన అనంతరం ఎడిట్ ఆప్షన్ ఇస్తామని దేవానందరెడ్డి ఆయా యాజమాన్యాలకు వివరించారు.

30 వరకు సచివాలయాల్లో ప్రత్యేక 'ఆధార్' క్యాంపులు

బయోమెట్రిక్ వివరాల అప్‌డేట్‌కు అవకాశం

సాక్షి, అమరావతి : ఆధార్ కార్డుదారులు తమ బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో విడత ఈ నెల 30 వరకు గ్రామ వార్డు సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేసింది. మంగళవారం నుంచి నాలుగు రోజులు పాటు ఆధార్ సేవలు అందుబాటులో ఉన్న అన్ని గ్రామ సచివాలయాల్లోనూ ఈ క్యాంపులు నిర్వహించాలని గ్రామ, వార్డు సచివాలయ శాఖ ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులకు ఆదేశాలిచ్చింది. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల మందికి పైగా గ్రామ, వార్డు సచివాలయాల్లో తమ ఆధార్ కార్డులో తమ బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకున్నారని అధికారులు వెల్లడించారు. ఇప్పటి దాకా ఆధార్ వివరాలు అసలు నమోదు చేసుకోని పాఠశాలల విద్యార్థులు ఈ క్యాంపులో తమ వివరాలు పూర్తి ఉచితంగా నమోదు చేసుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

నాలుగో విడత టిడ్కో ఇళ్లు పంపిణీకి ఏర్పాట్లు

- వచ్చే నెల మొదటి వారంలో 14,460 యూనిట్ల అందజేత
- టిడ్కో బోర్డు డైరెక్టర్ల సమావేశంలో నిర్ణయం


టిడ్కో బోర్డు సమావేశంలో చైర్మన్ ప్రసన్న కుమార్, ఎండీ శ్రీధర్

సాక్షి, అమరావతి: పట్టణ పేదల కోసం ప్రభుత్వం నిర్మిస్తున్న టిడ్కో (జీ+3) ఇళ్లు నాలుగో విడత పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి మొదటి వారంలో 14,460 మంది లబ్ధిదారులకు ఇళ్లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఈమేరకు తీసుకోవాల్సిన చర్యలు, పెండింగ్ పనులపైనా టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, ఎండీ శ్రీధర్ అధ్యక్షతన బుధవారం బోర్డు డైరెక్టర్లు సమావేశమై చర్చించారు. నంద్యాల, శ్రీకాకుళం, పాన్నూరు, అడవి తక్కెళ్లపాడు, సాలూరు, కావలి ప్రాంతాల్లో అన్ని మౌలిక సదుపాయాలతో సిద్ధంగా ఉన్నవాటిని అందజేయనున్నారు. ఇందులో నంద్యాల 5 వేలు, శ్రీకాకుళం 1,280, పాన్నూరు 2,368, అడవి తక్కెళ్లపాడు(గుంటూరు) 2,500, సాలూరు 1,200 యూనిట్లు సిద్ధంగా ఉన్నాయి. మొదటి వారానికి కావలిలో మరో 2,112 యూనిట్లు కూడా అన్ని వసతులతో అందుబాటులోకి రానున్నాయి. కాగా, పంపిణీ చేసేనాటికి ఆయా ప్రాంతాల్లో అదనంగా ఎన్ని పూర్తయితే అన్నింటినీ అదే వేదిక ద్వారా లబ్ధిదారులకు అందజేయాలని భావిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో నిర్మించిన ఇళ్లలో ప్రభుత్వం రూ. 1కే అందిస్తున్న 300 చ.అడుగుల యూనిట్లు మినహా మిగిలిన 365, 430 చ.అ విస్తీర్ణం గల ఇళ్ల విషయంలో ఇప్పటివరకు రుణాలు మంజూరు కానివారికి నాలుగైదు రోజుల్లో మంజూరు చేయించి జనవరి మొదటి వారంలో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని అధికారులు నిర్ణయించారు. అలాగే, జనవరి చివరినాటికి సీఎం వైఎస్ జగన్ నిర్దేశించిన 1.20 లక్షల యూనిట్ల పంపిణీపై తీసుకోవాల్సిన చర్యలపైనా సమావేశంలో చర్చించారు. ఇప్పటికే 75 నుంచి 80 శాతం పూర్తయిన బ్లాకులకు యుద్ధప్రాతిపదికన ఎస్టీపీలు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, లబ్ధిదారుల బ్యాంకు లింకేజీని సాధ్యమైనంత వేగంగా పూర్తిచేయాలని ఆయా పట్టణ స్థానిక సంస్థల అధికారులను ఆదేశించారు. బోర్డు సమావేశంలో చీఫ్ ఇంజినీర్ గోపాలకృష్ణారెడ్డి, మెప్మా ఎండీ విజయలక్ష్మితో పాటు టిడ్కో బోర్డు డైరెక్టర్లు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దావులూరి దొరబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద చేపడుతున్న పేదల ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దావులూరి దొరబాబు అధికారులకు సూచించారు. విజయవాడలోని గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో బోర్డు సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే 2.10 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. మరో 12 లక్షల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. వీటిని సకాలంలో పూర్తి చేయాలని కోరారు. గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం చేపడుతున్న లేఅవుట్లలోకి సామగ్రిని సరఫరా చేయడానికి గోడౌన్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రస్తుతం 72 గోడౌన్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో సెర్ప్ సీఈవో ఇంతియాజ్ అహమ్మద్, గృహ నిర్మాణ సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివ ప్రసాద్, చీఫ్ ఇంజినీర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మూగవారి వేదన వినేలా... చెవిటివారి ఆవేదన అర్థంచేసుకునేలా...

- ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఒక ట్రాన్స్‌లేటర్ ఏర్పాటుపై కసరత్తు
- రాష్ట్రంలో 1.66 లక్షల మంది చెవిటి.. 1.24 లక్షల మంది మూగవారు
- వారి సమస్యలు అర్థం చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ

విభిన్నప్రతిభావంతుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

రాష్ట్రంలో విభిన్నప్రతిభావంతుల కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగానే ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఒక ట్రాన్స్‌లేటర్‌ను కేటాయించాలని ప్రతిపాదించాం. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో పుట్టుకతోనే వినికిడిలోపంతో బాధపడుతున్న దాదాపు 400 మందికి పైగా చిన్నారులకు లక్షలాది రూపాయల ఖర్చుతో ప్రభుత్వం కాంక్లియర్ ఇంప్లాంటేషన్ అందించింది. విద్య, ఉద్యోగం, ఉపాధిలో విభిన్నప్రతిభావంతులకు తగిన అవకాశాలు కల్పిస్తూ అందరిలాగే సమాజంలో గౌరవం, గుర్తింపు పొందేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోంది.
– బి.రవిప్రకాశ్‌రెడ్డి, సంచాలకుడు, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ

సాక్షి, అమరావతి : మూగవారి వేదన అర్థం చేసుకునేలా... చెవిటివారి రోదన వినేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వారి సమస్యలను సక్రమంగా తెలుసుకుని, పరిష్కరించేందుకు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఒక ఉద్యోగికి ట్రాన్స్‌లేటర్‌గా శిక్షణ ఇవ్వాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ప్రణాళికలు రూపొందించింది. రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 1,66,413 లక్షల మంది వినికిడిలోపం (చెవిటి), 1,23,733 మంది మాటలురాని (మూగ)వారు ఉన్నారు. వీరు తమ సమస్యలను వివరించేందుకు, ఎదుటివారు చెప్పే విషయాన్ని అర్థం చేసుకునేందుకు అనేక అవస్థలు పడుతుంటారు. ఇటువంటివారి గోడు పట్టించుకునేలా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చిన ఒక ఉద్యోగిని కేటాయించాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ తాజాగా ప్రతిపాదనలు చేసింది. ఈ మేరకు అన్ని ప్రభుత్వ శాఖలకు సిఫారసు చేసింది. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఎంపిక చేసిన ఉద్యోగులకు నోయిడాలోని సైన్ లాంగ్వేజ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ ఇప్పించాలని సూచించింది. ఈ ప్రక్రియ పూర్తయితే మూగ, చెవిటి వారికి పెద్ద ఊరట కలగనుంది.

జనసేనలో ఓ వర్గంపై మరో వర్గం దాడి

- ఇరు వర్గాలు కుర్చీలు, బాదులతో దాడులు
- బట్టబయలయిన అంతర్గత విభేదాలు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గ జనసేన పార్టీలో కొనసాగుతున్న అంతర్గత విభేదాలు బట్టబయలయ్యాయి. ఆధిపత్యపోరులో భాగంగా సత్తెనపల్లి పట్టణ అధ్యక్ష పదవిని కైవసం చేసుకునేందుకు పావులు కదుపుతున్న వ్యక్తులు మరో వర్గంపై దాడికి పాల్పడ్డారు. పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని మండలాల వారీగా పార్టీ పరిస్థితులపై చర్చ ప్రారంభించారు. తొలుత ముప్పాళ్ళ మండలం గురించి చర్చిస్తున్న క్రమంలో పార్టీలో అందరిని కలుపుకుని పోవడం లేదంటూ పార్టీ నేత సూరంశెట్టి సతీష్ ప్రస్తావించారు. ఆ సమయంలో ముప్పాళ్ళ మండల పార్టీ అధ్యక్షుడు శిరిగిరి పవన్ కుమార్ మాట్లాడుతూ మండల కమిటీలో స్థానం కల్పిస్తే ఇంతవరకు నీవు నియామక పత్రం తీసుకెళ్లలేదన్నారు. ఆ సమయంలో పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి సిరిగిరి శ్రీను జోక్యం చేసుకుని జిల్లా అధ్యక్షుడి సమక్షంలో ఇది అవసరమా అనడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇదే సమయంలో సత్తెనపల్లి పట్టణ అధ్యక్ష పదవిపై కూడా చర్చ వస్తుందేమోనని భావించి పట్టణానికి చెందిన వల్లెం శ్రీనివాసరావు అలియాస్ రాడ్ల శ్రీను, ఆయన సోదరుడు ఒక్కసారిగా శిరిగిరి పవన్ కుమార్, పట్టణ 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కుమార్‌పై కుర్చీలు, బాదులు, కత్తులతో దాడి చేశారు. దీంతో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు దాడి చేసుకుంటూ ఘర్షణ పడ్డారు. ఈ దాడిలో శిరిగిరి పవన్‌కుమార్‌కు గాయాలు కావడంతో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అందించారు. తమపై దాడి చేయడమే కాక చంపుతామంటూ హెచ్చరిక చేశారని వారి నుంచి తమకు ప్రాణహాని ఉందంటూ రంగశెట్టి సుమన్ కుమార్, సిరిగిరి పవన్ కుమార్ 9 మందిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా...

ఫేషియల్ రికగ్నిషన్ హాజరుకు మొబైల్ అప్లికేషన్

- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకూ ఇదే విధానంలో హాజరు
- జనవరి 1 నుంచి ఫేషియల్ రికగ్నిషన్ హాజరు తప్పనిసరి

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులందరికీ నూతన సంవత్సరం జనవరి 1వ తేదీ నుంచి ఫేషియల్ రికగ్నిషన్ ఆధారిత హాజరును అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా.కె.ఎస్.జవహర్ రెడ్డి ఆదేశాలు జారీ చేయడంతో అందుకు అనుగుణంగా సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) చర్యలు చేపట్టింది. ఫేషియల్ రికగ్నిషన్ హాజరుకు మొబైల్ అప్లికేషన్ అభివృద్ధి చేసే బాధ్యతను ఐటీ శాఖకు అప్పగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొబైల్ అప్లికేషన్‌కు అవసరమైన సమాచారాన్ని ఐటీ శాఖకు అందించేందుకు సచివాలయంలోని అన్ని శాఖలు ఓ మిడిల్ లెవల్ ఆఫీసర్‌ను, శాఖాధిపతుల కార్యాలయాల్లో డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించాలని తెలిపింది. జిల్లా స్థాయిలో సమాచారాన్ని అందించేందుకు జిల్లా రెవెన్యూ ఆఫీసర్‌ను నోడల్ అధికారిగా నియమించాలని కలెక్టర్లను ఆదేశించింది. నిర్దేశించిన నమూనా పత్రంలో నోడల్ అధికారి పేరు, హోదా, కార్యాలయం చిరునామా, మొబైల్ నంబర్, ఇ–మెయిల్ ఐడీని ఐటీ శాఖకు పంపాలని పేర్కొంది. ఐటీ శాఖ వెంటనే నోడల్ అధికారులను సంప్రదించి మొబైల్ అప్లికేషన్ అభివృద్ధి చేయాలని, ఉద్యోగులు మొబైల్ అప్లికేషన్‌లో ఎన్‌రోల్ అయ్యేందుకు అవసరమైన శిక్షణ కూడా నోడల్ అధికారులకు ఇవ్వాలని పేర్కొంది. ఉద్యోగుల సెలవుల నిర్వహణ కూడా ఈ వ్యవస్థలోనే ఉంటుందని పేర్కొంది. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకూ ఇదే విధానంలో హాజరు అమలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి కార్యాలయాల్లో జనవరి 1 నుంచి ఫేషియల్ రికగ్నిషన్ ఆధారిత హాజరు అమల్లోకి తెస్తుండగా మిగతా కార్యాలయాల్లో జనవరి 16 నుంచి అమల్లోకి తేనున్నారు. స్వయంప్రతిపత్తి గల సంస్థలు, రీజినల్, డివిజనల్, స్థానిక సంస్థలు, మండల, గ్రామ స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ఫేషియల్ రికగ్నిషన్ ఆధారిత హాజరు అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. గ్రామ స్థాయి వరకు గల సబార్డినేట్ కార్యాలయాల్లో ఫేషియల్ రికగ్నిషన్ హాజరు అమలు చేయాల్సిన బాధ్యత శాఖాధిపతులు కార్యాలయాల అధిపతులపైన ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో హాజరు బాధ్యత జిల్లా కలెక్టర్లపైన ఉంటుందని స్పష్టం చేశారు.

నేడు ఏపీహెచ్ఈపీబీ రాష్ట్రస్థాయి సమావేశం


మాట్లాడుతున్న హేమచంద్రారెడ్డి, వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

గుంటూరు రూరల్: ఉన్నత విద్యా విధానంలో అధునాతన పద్ధతులు, సమష్టి కృషితో విద్యాభివృద్ధికి కృషి చేయడం హయ్యర్ ఎడ్యుకేషన్ బోర్డ్ ముఖ్య ఉద్దేశమని ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కే.హేమచంద్రారెడ్డి చెప్పారు. బుధవారం గుంటూరు నగర శివారులాంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ పరిపాలన భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డ్ (ఏపీహెచ్ఈపీబీ)ను 2020లో ప్రారంభించినట్లు చెప్పారు. రాష్ట్రస్థాయిలో ఇప్పటివరకు మూడు సార్లు సమావేశాలను నిర్వహించినట్లు తెలిపారు. 29, 30వ తేదీల్లో రెండు రోజుల పాటు ఎన్జీ రంగా వర్సిటీలో జరిగే నాలుగో రాష్ట్రస్థాయి సమావేశంలో సామాజిక స్పృహను ఉన్నత విద్యాసంస్థలు ముందుకు తీసుకువెళ్లడం ఎలా అనే అంశంపై చర్చించనున్నట్లు తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ ఆడిటోరియంలో ఈ సమావేశం 29న ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ వీసీ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు మాట్లాడారు.

ఏసీబీకి చిక్కిన ఆర్ఐ, సర్వేయర్

కర్నూలు (న్యూటౌన్): ల్యాండ్ కన్వర్షన్ చేసేందుకు లంచం తీసుకుంటూ కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయ ఆర్ఐ విజయ్‌కుమార్, సర్వేయర్ జిలానీబాషా బుధవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. కర్నూలు మండలం నిడ్జూరుకు చెందిన శ్రీనివాసులుకు సర్వే నంబర్ 366బీ2లో 88 సెంట్ల భూమి ఉంది. అయితే ఇందులో 38 సెంట్లకు ల్యాండ్ కన్వర్షన్ చేసేందుకు శ్రీనివాసులు మధ్యవర్తి మాణిక్యంరెడ్డి ద్వారా ఆర్ఐ విజయ్ కుమార్, సర్వేయర్ జిలానీ బాషాను సంప్రదించారు. ఇందుకోసం అధికారులు రూ.1.60 లక్షలు డిమాండ్ చేశారు. అంతసొమ్ము ఇచ్చుకోలేని శ్రీనివాసులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచన మేరకు బుధవారం కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ విజయ్‌కుమార్, సర్వేయర్ జిలానీబాషాకు రూ.1.60 లక్షలు ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ శివనారాయణస్వామి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దాడుల్లో సీఐలు తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియం పనులు వేగవంతం చేయాలి

- గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి కాంతిలాల్ దండే
- ప్రారంభమైన గిరి విజ్ఞాన సంబరాలు


పనులను పరిశీలిస్తున్న కాంతిలాల్ దండే

చింతపల్లి/గూడెంకొత్తవీధి/సాక్షి,పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా) : మండలంలోని తాజంగిలో జరుగుతున్న స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి కాంతిలాల్ దండే అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన లంబసింగి, తాజంగి , చింతపల్లిలో పర్యటించారు. లంబసింగి వద్ద ఐటీడీఏ ఆధ్వర్యంలో పునర్నిర్మించిన అతిథి గృహాలను ఆయన ప్రారంభించారు. అనంతరం తాజంగిలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రూ.35 కోట్లతో నిర్మిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేసి ఈ ఏడాది ఆగస్టు నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యూజియం నిర్మాణం పూర్తయితే రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. అనంతరం చింతపల్లిలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న, గూడెంకొత్తవీధిలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాలను పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి త్వరలో రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గిరిజనులు సాగు చేస్తున్న కాఫీ పంట వివరాలు, వారికి కల్పిస్తున్న మార్కెటింగ్ సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. కాఫీసాగు, ఉత్పత్తి, ఎగుమతుల్లో జిల్లా అగ్రగామిగా నిలవాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం గిరిజన రైతులకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తుందని కాంతిలాల్‌దండే వివరించారు.

గిరి విజ్ఞాన సంబరాలు ప్రారంభం..

గిరిజన విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించే లక్ష్యంతో పాడేరు ఐటీడీఏ చేపట్టిన మూడు రోజుల గిరి విజ్ఞాన సంబరాలను బుధవారం సాయంత్రం కాంతిలాల్ దండే జ్యోతి వెలిగించి ఘనంగా ప్రారంభించారు. ఐటీడీఏ పరిధిలోని 122 గిరిజన విద్యాలయాలకు చెందిన 1,100 మంది గిరిజన విద్యార్థులు అన్ని పాఠ్యాంశాలకు సంబంధించి 577 విజ్ఞాన ప్రాజెక్టులను ఈ సంబరాల్లో ప్రదర్శించారు. కార్యక్రమాల్లో కలెక్టర్ సుమిత్ కుమార్, జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, డీఈవో రమేష్, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్‌లను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలి: ఎంపీ.ఆర్.కృష్ణయ్య

- జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాంకు వినతి
- ఓబీసీ జాబితాలో చేర్చనిపక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తాం

సాక్షి, న్యూఢిల్లీ : వీరశైవ లింగాయత్ /లింగబలిజ కులాన్ని కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప, పట్లోళ్ల సంగమేశ్వర్‌తో కలసి ఆయన జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహిర్‌ను కలసి బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ అంశంపై త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందించి, ఓబీసీ జాబితాలో కలిపేలా ప్రయత్నం చేస్తానని హన్స్‌రాజ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. తెలంగాణలోని వీరశైవ లింగాయత్ లింగ బలిజలు పేదరికంలో ఉన్నారని..రాష్ట్రంలో బీసీ జాబితాలో ఉన్నప్పటికీ కేంద్రస్థాయిలో ఓబీసీ జాబితాలో లేని కారణంగా విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని వివరించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వీరిని ఓబీసీ జాబితాలో కలపని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్.భూపేశ్ సాగర్, రాష్ట్ర వీరశైవ లింగాయత్ నాయకులు శెట్టి శివకుమార్, జి.దినేశ్ పాటిల్, పరమేశ్వర్, డి.శివ కుమార్, ఆనందప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని కుట్రలు పన్నినా తిప్పికొడతాం

822వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: కుట్రలు, కుతంత్రాలకు చంద్రబాబునాయుడు అడ్రస్‌గా మారాడని, రాష్ట్రంలో ఎన్ని తోకపార్టీలను ఏకం చేసినా బహుజనులను మభ్యపెట్టడం సాధ్యం కాదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 822వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో పలువురు మాట్లాడారు. యావత్ రాష్ట్రానికి అన్యాయం చేస్తూ ఒకే ప్రాంతంలో చంద్రబాబు కుల రాజధానిని నిర్మాణం చేసేందుకు చూడడం దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు. ఇది గమనించే ప్రజలు గత ఎన్నికల్లో బాబు అండ్ కోను చిత్తుచిత్తుగా ఓడించారన్నారు.ప్రజాభీష్టం మేరకే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనా వికేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తున్నారని చెప్పారు. గతంలో పలు నిపుణుల కమిటీలు సైతం అదే సూచించినా అవన్నీ తుంగలో తొక్కిన చంద్రబాబు తన దోపిడీ కోసం అమరావతిని బూచిగా చేసుకున్నాడనేది బహిరంగ రహస్యమన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ ఎల్లో మీడియాలో విష ప్రచారం చేస్తూ తన మనుగడ కోసం పాకులాడుతున్న చంద్రబాబుకు రాష్ట్రంలో మనుగడ లేదనే నిజం తెలుసుకోవాలని హెచ్చరించారు. సంక్రాంతి నుంచి విశాఖ నుంచి పాలన సాగించి ప్రభుత్వం ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల ప్రజలకు కూడా వెన్నుదన్నుగా నిలుస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, బొలిమేర శామ్యూల్, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, కారుమూరి పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో 'అద్దాల మేడ' నిర్మాణానికి భూమి పూజ


అద్దాల మేడ మండపం నిర్మాణానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు, ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, విరాళ దాత కుటుంబ సభ్యులు, ఈవో

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో అద్దాల మేడ మండపం నిర్మాణానికి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు, ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉన్న చోటే అద్దాల మేడ మండపం నిర్మాణం చేపట్టామని తెలిపారు. రూ.కోటి అంచనా వేయగా, ఆ నగదును హైదరాబాద్‌కు చెందిన ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ అధినేత మహేష్ రెడ్డి విరాళంగా ఇవ్వడానికి ముందుకు వచ్చారని తెలిపారు. అనంతరం విరాళ దాత మహేష్‌రెడ్డి కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకటనారాయణ, కాంట్రాక్టర్ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గతాన్ని మరిచిపో, అది నీ అధీనంలోంచి వెళ్లిపోయింది.
భవిష్యత్ మరిచిపో, అది నువ్వు చేర శక్యంకానిది. వర్తమానాన్ని
నియంత్రించు! బ్రహ్మాండంగా జీవించు. వివేకవంతుల విధానం ఇదే.

– పరమహంస యోగానంద

సాక్షి

గురువారం, డిసెంబర్, 29

నేపాళంలో కొత్త భూపాలం?

పెళ్ళిలో నాగవల్లి నాటి మాట సదస్యానికి ఉంటుందా?! నేపాల్‌కు కొత్త ప్రధానిగా కొలువు తీరిన పుష్పకమల్ దహల్ (ప్రచండ)ను చూస్తే ఆ జాతీయమే గుర్తొస్తుంది. ఎన్నికల్లో చెట్టపట్టాలేసుకు తిరిగిన 5 పార్టీల కూటమిని ఫలితాలొచ్చాక గాలికి వదిలేసి, అప్పటి దాకా తాను విమర్శించిన వారితో కలసి ఆయన అధికారంలోకి రావడం అలానే ఉంది. 'కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ –మావోయిస్ట్ సెంటర్' (సీపీఎన్–ఎంసీ) నేత ప్రచండ ఈ ఎన్నికల ముందు మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా నేతృత్వంలోని నేపాలీ కాంగ్రెస్‌తో తిరిగారు. తీరా అధికారం కోసం తన బద్ధశత్రువైన మరో మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీతో చేతులు కలిపారు. ఓలీ సారథ్య 'కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్– ఐక్య మార్క్సిస్ట్– లెనినిస్ట్' (సీపీఎన్– యూఎంఎల్)తో పాటు పలు చిన్నాచితకా పార్టీలతో కలసి అధికారం పంచుకుంటున్నారు. ఏ ప్రభుత్వమూ పూర్తికాలం అధికారంలో ఉండదన్న అపకీర్తిని మూటగట్టుకున్న నేపాల్‌లో ఈ అవసరార్థ అధికార కూటమి ఎన్నాళ్ళుంటుందో తెలీదు కానీ చైనా అనుకూల ప్రచండ, దేవ్‌బా ద్వయం వల్ల భారత్ అప్రమత్తం కాక తప్పని పరిస్థితి.

68 ఏళ్ళ ప్రచండ 13 ఏళ్ళు అజ్ఞాత జీవితం గడిపారు. 1996 నుంచి 2006 వరకు సాగిన సాయుధ తిరుగుబాటుకు ప్రచండే సారథి. 2006 నవంబర్‌లో సమగ్ర శాంతి ఒప్పందంపై సంతకంతో ఆ తిరుగుబాటు కథకు తెరపడింది. దశాబ్ద కాలపు తిరుగుబాటుకు స్వస్తి చెప్పి, సీపీఎన్ – ఎంసీ ప్రశాంత రాజకీయాల పంథాను అనుసరించడం మొదలుపెట్టాక ఆయనా ప్రధానస్రవంతి రాజకీయాల్లోకి వచ్చారు. ఈ విప్లవ వీరుడు ప్రధాని పీఠం అధిష్ఠించడం ఇది ముచ్చటగా మూడో సారి. దేవ్‌బా సారథ్య నేపాలీ కాంగ్రెస్ ఈసారి ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు సాధించింది గనక అదే పగ్గాలు పడుతుందనీ, దేవ్‌బా, ప్రచండలు పదవిని పంచుకుంటారనీ అంతా అనుకున్నారు. కానీ, ప్రధానిగా తొలి విడత ప్రచండకు ఇవ్వడానికి దేవ్‌బా తటపటాయించడంతో తేడా వచ్చింది. అదే అదనుగా ఓలీ చాణక్యతంత్రంతో ప్రచండను తన వైపు తిప్పుకోవడం రాజకీయ చాతుర్యం.

నిజానికి, 275 స్థానాల ప్రజాప్రతినిధుల సభలో ప్రచండ నాయకత్వంలోని సీపీఎన్–ఎంసీ ఈ ఎన్నికల్లో గెలిచింది 32 సీట్లే. అయితే, ఓలీ సారథ్యంలోని సీపీఎన్–యూఎంఎల్ (78) కాక మరో అయిదు పార్టీలు మద్దతు నిచ్చాయి. అలా ప్రచండకు 165 మంది సభ్యుల అండ దొరికింది. బద్ధ శత్రువులుగా ఎన్నికల్లో పోరాడిన ప్రచండ, ఓలీలు ఫలితాలొచ్చాక ఇలా కలసిపోతారనీ, వంతుల వారీగా ప్రధాని పీఠం పంచుకొనేలా అవగాహన కుదుర్చుకుంటారనీ ఎవరూ ఊహించలేదు. ఇది ఓటర్లకూ మింగుడుపడని విషయం. ఇవన్నీ నేపాల్ అంతర్గత రాజకీయాలు. అక్కడ ఏ పార్టీలో, ఎవరు ప్రధాని కావాలనేది అక్కడి పార్టీల, ప్రజల ఇష్టం. ఆ ప్రధానులూ, ప్రభుత్వాలూ పూర్తికాలం అధికారంలో లేకుంటే అది ఆ దేశానికి నష్టం. కాకపోతే, రాచరికం నుంచి ప్రజాస్వామ్యానికి మారిన ఈ హిమాలయ పొరుగుదేశపు బాగోగులు, దోస్తీ భౌగోళిక–రాజకీయాల్లో భారత్‌కు కీలకం.

అధికారమే లక్ష్యంగా 2 కమ్యూనిస్ట్‌పార్టీ గ్రూపుల నేతలూ దగ్గరవడానికి చైనాతో సాన్నిహిత్యంతో పాటు ఓలీ అంటే సానుకూలత ఉన్న నేపాల్ ప్రెసిడెంట్ విద్యాదేవి కూడా కారణమంటారు. ఏమైనా దీంతో నేపాల్‌తో బంధాల్లో చైనాదే పైచేయనే అభిప్రాయం సహజమే. కొత్త ప్రధాని ప్రచండ ఏనాడూ భారత్‌కు సానుకూల వ్యక్తి కాదు. పైపెచ్చు ఆయన మనసంతా చైనా మీదే. కాకపోతే, క్రితంసారి ఆయన పదవిలో ఉన్నప్పుడు భారత్ పట్ల సదా సానుకూలత చూపే నేపాలీ కాంగ్రెస్‌తో పొత్తులో ఉన్నారు. కాబట్టి కథ నడిచిపోయింది. కానీ, ఈసారి చైనా వైపు మొగ్గే ఓలీతో కలసి అధికారం పంచుకుంటున్నారు గనక రానున్న రోజులు భారత్‌కు ఎలా ఉంటాయన్నది ప్రశ్న. అలా చూస్తే ప్రపంచంలో ఒకప్పటి ఏకైక హిందూరాజ్యాన్ని అక్కున చేర్చుకోలేకపోవడం ఇక్కడ హిందూ ఆధిక్యవాదాన్ని పరోక్షంగా ప్రవచిస్తున్న పాలకుల దౌత్య వైఫల్యమని కొందరి విమర్శ.

అయితే, పదవి చేపట్టిన ప్రచండను ముందుగా మోదీనే అభినందించడం విశేషం. గతంలో ఓలీ అధికారంలో ఉండగా మోదీ రెండుసార్లు నేపాల్‌కెళితే, ఆయన రెండుసార్లు భారత్‌కు వచ్చారు. కింగ్‌మేకర్ ఓలీ నేతృత్వ పార్టీ కూడా తాము భారత్ కన్నా చైనాతో బంధానికే మొగ్గుతామనే భావనను తొలగించేందుకు ప్రయత్నిస్తోంది. భారత, చైనాల పట్ల నేపాల్ వైఖరిలో పెద్ద మార్పేమీ ఉండదనీ, భారత్‌తో 'సంతులిత, విశ్వసనీయ' సంబంధాలు నెరుపుతామనీ అంటోంది. కానీ, ఓలీ గద్దెపై ఉన్నప్పుడే వివాదాస్పద ప్రాంతాలను నేపాల్‌లో భాగంగా చూపుతూ కొత్త రాజకీయ పటాన్ని జారీ చేయడం, చకచకా పార్లమెంట్ ఆమోదముద్ర వేయడం అంత తేలిగ్గా మర్చిపోలేం.

ఆరేళ్ళు పనిచేసి, అర్ధంతరంగా చైనా వదిలేసిన రెండు జలవిద్యుత్ ప్రాజెక్టులను ఈ ఏడాదే భారత్ చేపట్టింది. మునుపటి దేవుబా సర్కార్ వాటిని భారత్‌కు కట్టబెట్టింది. అప్పట్లో ఓలీ దాన్ని వ్యతిరేకించారు. ఇప్పుడు ఓలీ భాగస్వామిగా కొత్త ప్రభుత్వం వచ్చేసరికి, వాటి భవిత ప్రశ్నార్థకమే. పైగా, కొత్త సర్కార్ రాగానే చైనా రకరకాల ప్రాజెక్టులతో నేపాల్‌లో కాలూనేందుకు ఉరకలేస్తోంది. నేపాల్ – చైనా సరిహద్దు రైల్వేలైన్ అధ్యయనానికి నిపుణుల బృందాన్ని మంగళవారమే పంపింది. ఈ పరిస్థితుల్లో భారత్ చొరవ చూపాలి. ప్రాజెక్టులే కాక విద్య, వైద్యం, పర్యావరణం లాంటి అనేక అంశాల్లోనూ ప్రజాస్వామ్య గణతంత్ర భారత్‌తో సన్నిహిత భాగస్వామ్యమే నేపాల్‌కు దీర్ఘకాలంలో లాభమని నచ్చజెప్పగలగాలి. ఒక్క నేపాల్‌కే కాదు... వ్యూహాత్మకంగా మనకూ అది ముఖ్యం!

అధికారంలో ఔన్నత్యం చాటుకోవాలి



మల్లెపల్లి లక్ష్మయ్య

షెడ్యూల్డ్ ఏరియాల్లో జరుగుతున్న సంక్షేమ విధానాలకు సంబంధించి రాష్ట్రపతి ఎప్పుడు అడిగినా, ఆయా రాష్ట్రాల గవర్నర్లు వెంటనే నివేదికలు అందజేయాల్సి ఉంటుంది. అంటే ఆదివాసీలు నివసించే ప్రాంతాలలో జరుగుతున్న ఎటువంటి కార్యక్రమాలనైనా రాష్ట్రపతి పర్యవేక్షించవచ్చు. రోజురోజుకీ పెరుగుతున్న ఆర్థిక అసమానతలు ఆదివాసీలను కుంగుబాటుకు గురిచేస్తున్నాయి. అందుకే ఒక ఆదివాసీ బిడ్డగా, ఒక నాయకురాలిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యాంగంలో పొందుపరిచిన అధికారాలను సంపూర్ణంగా వినియోగిస్తే ఆదివాసుల జీవితాల్లో కొంతైన వెలుగు రాకపోతుందా అన్న ఆశ ఆదివాసీలు, ప్రగతిశీల వాదుల్లో ఉంది. అలా జరిగితే ఓ మూలవాసీ మహిళ రాష్ట్రపతిగా ఎంపికవడమనే విషయానికి ఓ ఔన్నత్యాన్ని తీసుకొస్తుంది.

'ఈ ఆర్టికల్ రాజ్యాంగంలోని అన్నింటి కన్నా ముఖ్యమైనది. అణగారిన వర్గాలకు సంబంధించి మనం కేవలం రిజర్వేషన్ల వరకే పరిమితమయ్యాం. కానీ అణగారిన వర్గాలు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలను పరిష్కరించడానికి ఈ ఆర్టికల్ అవకాశం ఇస్తుంది. దీనిని సమర్థవంతంగా అమలు చేయడానికి రాష్ట్రపతికి శక్తి మంతమైన అధికారాలిచ్చే విధంగా ఈ ఆర్టికల్‌ను పొందుపరచాలి'' అంటూ రాజ్యాంగ సభ సభ్యుడు పండిట్ ఠాకూర్ దాస్ భార్గవ చేసిన వ్యాఖ్యలివి. భారత రాజ్యాంగ సభలో జూన్ 16, 1949న బాబాసాహెబ్ అంబేడ్కర్ ముసాయిదా రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టిన సందర్భంగా పండిట్ భార్గవ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

రాజ్యాంగ ముసాయిదాలో 301 నంబర్‌తో ఉన్న ఆర్టికల్ రాజ్యాంగ సభ ఆమోదం పొందిన రాజ్యాంగంలో 340గా పొందు పరిచారు. ''భారత దేశంలో ఉన్న వెనుకబడిన తరగతులైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సామాజిక విద్యా విషయాలను పరిశోధించడానికి, పరిశీలించడానికి రాష్ట్రపతి ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయవచ్చును.'' ఇది ఆర్టికల్ 340 సారం.

అయితే ఇప్పటి వరకూ రాష్ట్రపతి పదవిని పొందిన చాలామంది ఇటువంటి ప్రయత్నాలు చేయలేదు. పదవ రాష్ట్రపతిగా పనిచేసిన డా.కె.ఆర్.నారాయణన్ మినహాయింపు. 2000 జూలై 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగిన గవర్నర్ల సదస్సులో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమ కార్యక్రమాల అమలు, ప్రత్యేకించి బడ్జెట్ కేటాయింపులు, వినియోగం, దారిమళ్ళింపు సమస్యలు, అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలును గురించి అధ్యయనం చేయడానికి ఏడుగురు గవర్నర్లతో ఒక కమిటీని నియమించారు. అప్పటి మహారాష్ట్ర గవర్నర్ పి.సి. అలెగ్జాండర్ అధ్యక్షతన, మేఘాలయ గవర్నర్ ఎం.ఎం. జాకబ్, కేరళ గవర్నర్ ఎస్.ఎస్. కాంగ్, కర్ణాటక గవర్నర్ వీఎస్ రమాదేవి, హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ సూరజ్ భాను, ఒడిషా గవర్నర్ ఎం.ఎం. రాజేంద్రన్, హరియాణా గవర్నర్ బాబు పరమానంద్ ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

2000 ఆగస్టు 8న ఏర్పడిన కమిటీ, 2001 ఏప్రిల్ 28న తన నివేదికను రాష్ట్రపతికి సమర్పించింది. ఈ నివేదికలో భూ పంపిణీ, విద్య, గృహ వసతి, ప్రజారోగ్యం, వృత్తి, వ్యాపార అభివృద్ధి పథకాలు, వీటన్నింటితో పాటు ఈశాన్య రాష్ట్రాల ప్రగతిపైనా ఎన్నో సిఫారసులు చేసింది. నిజానికి స్వాతంత్ర్యానంతరం ఎస్సీ, ఎస్టీల సమస్యలపై అత్యున్నతమైన స్థానంలో ఉన్న గవర్నర్లు అన్ని రాష్ట్రాలు తిరిగి, సంబంధిత మంత్రులు, అధికారులు, సామాజిక వర్గాల సంస్థలు, సంఘాలతో సమావేశం కావడం విశేషం. అయితే అప్పటి ఎన్డీయే ప్రభుత్వం ఈ నివేదికను పట్టించుకోలేదు. కానీ ఈ కమిటీ ప్రయత్నం ఊరికేపోలేదు. ఎస్సీ, ఎస్టీల సమస్య పరిష్కారం కోసం పనిచేసే సంస్థలకు ఒక ఆయుధమై నిలిచింది. ఎన్నో రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయాలను పరిగణనలోకి తీసుకున్నాయి.

కొత్త కోణం



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఈ విషయాలను ప్రస్తావించడానికి ఇప్పుడొక సందర్భం వచ్చింది. 15వ రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము బాధ్యతలు స్వీకరించి ఆరు నెలలు కావస్తోంది. దక్షిణ భారతదేశ విడిది హైదరాబాద్‌లో ప్రస్తుతం రాష్ట్రపతి మొదటిసారి ఉంటున్నారు. రాష్ట్రపతికి ప్రభుత్వాలను కాదని, మార్పులు చేయగలిగే అధికారం లేకపోయి ఉండవచ్చు. కానీ 339, 340 ఆర్టికల్స్ ప్రకారం, అదేవిధంగా 5వ షెడ్యూల్‌లో షెడ్యూల్ తెగల కమిటీల రక్షణ విషయంలో రాష్ట్రపతి అధికారాలను, చొరవను రాజ్యాంగం నిర్దేశిస్తున్నది. రాజ్యాంగ పరిధిలో, అది అందించిన అధికారాలను ఉపయోగించి ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇచ్చే అవకాశం రాష్ట్రపతికి ఉంటుంది.

దేశంలోని ఒక ప్రధాన ఆదివాసీ తెగయైన సంథాల్ సమూహానికి చెందిన మన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ విషయంలో నారాయణన్ చూపిన చొరవను చూపాలనే ఆకాంక్షతోనే వీటన్నింటినీ ప్రస్తావించాల్సి వస్తోంది. మన రాజ్యాంగంలో ఆర్టికల్ 339 ప్రకారం, క్లాజు ఒకటి చెపుతున్న ఒక చట్టబద్ధమైన కమిషన్ ఇప్పటికే అమలులో ఉంది. ఆర్టికల్ 339 క్లాజు–2 కూడా రాష్ట్రపతికి ఎస్టీల సంక్షేమ కార్యక్రమాల రూపకల్పన, సమీక్ష విషయాలలో అధికారాలను ఇచ్చింది. ''రాష్ట్రాల్లో ఎస్టీ సంక్షేమ కార్యక్రమాలను రూపొందిస్తున్న తీరును పరిశీలించి, వారికి తగు నిర్దేశకత్వం ఇవ్వవచ్చు'' అనే క్లాజు ఒక ముఖ్యమైన అంశం.

అదేవిధంగా 5వ షెడ్యూల్ కేవలం ఆదివాసీల రక్షణకు ఉద్దేశించిన హక్కుల పత్రం. ఐదవ షెడ్యూల్‌లో పేర్కొన్న హక్కుల రక్షణలో రాష్ట్రపతి పర్యవేక్షణ ప్రధానమైనది. ఐదవ షెడ్యూల్ పార్ట్ (ఎ)లో పేర్కొన్న మూడవ అంశం గురించి ప్రస్తావించుకుందాం. ఆదివాసీలు నివసించే ప్రాంతాలను షెడ్యూల్డ్ ఏరియాగా గుర్తించాలి. అక్కడ అమలు జరుగుతున్న సంక్షేమ విధానాలకు సంబంధించి ప్రతి సంవత్సరం లేదా రాష్ట్రపతి ఎప్పుడు అడిగినా, దేన్ని గురించి అడిగినా ఆయా రాష్ట్రాల గవర్నర్లు వెంటనే నివేదికలు అందజేయాలని నిర్దేశించారు. అంటే ఆదివాసీలు నివసించే ప్రాంతాలలో జరుగుతున్న ఎటువంటి కార్యక్రమాలనైనా రాష్ట్రపతి పర్యవేక్షించవచ్చు. తగు సూచనలు, సలహాలు చేయవచ్చు. అదేవిధంగా పార్ట్(బి)లో 4వ అంశం ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్(టీఏసీ)కు విస్తృతమైన అధికారాలున్నాయి. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నా, ఆదివాసీలకు సంబంధించి ఎటువంటి చట్టాలు చేయాలన్నా, ఆ ప్రాంతాల్లో ఏదైనా ప్రాజెక్టుల నిర్మాణం జరగాలన్నా, ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి. ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటుకు సంబంధించి కూడా నిర్దిష్టమైన విధానాలను రాజ్యాంగంలో పొందుపరిచారు. టీఏసీలో 20 మంది సభ్యులకు మించి ఉండకూడదనీ, వీరిలో 3/4వ వంతు ఆ రాష్ట్ర ఎస్టీ ఎమ్మెల్యేలు ఉండాలనీ నిబంధన కూడా ఉంది.

ఆదివాసుల హక్కుల కోసం అన్ని రకాల చట్టాల అమలును పర్యవేక్షించడం, రాజ్యాంగ హక్కులను కాపాడడం టీఏసీ బాధ్యత. అయితే ప్రస్తుతం చాలా రాష్ట్రాలలో ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ అస్తిత్వం నామమాత్రంగానే మిగిలిపోవడవం బాధాకరం. చాలా రాష్ట్రాల ప్రభుత్వాలు ఆ సలహా మండలిని పట్టించుకున్న పాపానపోలేదు. ప్రస్తుతం దేశంలో కొనసాగుతున్న ఆర్థిక, సామాజిక స్థితిగతులు, ముఖ్యంగా కార్పొరేట్ కంపెనీలు ఆదివాసీ ప్రాంతాల్లో చేపడుతున్న ప్రాజెక్టుల తీరుచూస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలన్నీ సలహా మండళ్లను సంప్రదిస్తున్న దాఖలాలే లేవు.

ఇటువంటి సందర్భంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాత్ర కీలకమౌతోంది. ఒక మహిళగా, ఆదివాసీ బిడ్డగా, అడవిబిడ్డల పేగు తెంచుకొని పుట్టిన ఒక నాయకురాలిగా రాజ్యాంగంలో పొందుపరిచిన రాజ్యాంగ అధికారాలను సంపూర్ణంగా వినియోగిస్తే ఆదివాసుల జీవితాల్లో కొంతైన వెలుగు రాకపోతుందా అన్న ఆశ ఆదివాసీలు, ప్రగతిశీల వాదుల్లో ఉంది. రోజు రోజుకీ పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, సామాజిక వ్యత్యాసాలు ఆదివాసీలను మరింత వెనుకబాటుతనానికి గురిచేస్తున్నాయి. ఆదివాసీల స్థితి గతులపై ఒక అధ్యయనం జరిపి, వారి సమస్యలకు ఒక సమగ్ర పరిష్కారం కనుగొనడానికి ప్రయత్నిస్తే, ద్రౌపది ముర్ములాంటి ఓ మూలవాసీ మహిళ రాష్ట్రపతిగా ఎంపికవడమనే విషయానికి ఓ ఔన్నత్యాన్ని తీసుకొస్తుంది. అణచివేతకు గురౌతున్న ఆయా వర్గాల ప్రాతినిధ్యం అక్షరాలా సరైనదని రుజువవుతుంది.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు | 81063 22077

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కావాలని మర్చిపోతారు



సామాజిక వేదికల్లో ఈ కొత్త వ్యాధి ఒకటి ఉంది. దాన్ని 'సెలక్టివ్ అమ్నీషియా' (అవసరమైనప్పుడే మతిమరుపు రావడం) అంటారు. నేననుకోవడం ద్రవిడియన్ మోడళ్ళు, కాంగ్రెస్ దానితో బాధ పడుతున్నాయి.

– ఖుష్బూ సుందర్
నటి, బీజేపీ నాయకురాలు

దేశం కంటే ఎక్కువ



ఒక్క విషయం నన్ను ఆకర్షించింది – పాకిస్తాన్ కంటే ఎక్కువ రోడ్డు మార్గాలు, హైవేలు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నాయి. దాదాపుగా 40 వేల కిలోమీటర్లు, ఇంకా ఎక్కువ. చెప్పాలంటే యూపీ మెగా మౌలిక సదుపాయాలను నిర్మించడం ఇప్పుడే మొదలుపెట్టింది. ముందు ముందు ఎన్నో అవకాశాలు ఉన్నాయి.

– హిందోల్ సేన్‌గుప్తా, చరిత్రకారుడు

ఇందుకా చురుకుదనం?



కోవిడ్ పట్ల ఇండియా కనబరుస్తున్న జాగరూకత, ముందు జాగ్రత్త చర్యలకు ఒక కారణం ఉంది. మన నాయకులకు తెలుసు ఇండియాలో ప్రమాదం ఏమీలేదని (చాలామంది నిపుణులు దీన్ని మళ్లీ చెప్పారు. కోవిడ్ కేసుల సంఖ్య కూడా స్థిరంగా ఉంది). కానీ మనం మరిచిపోతున్నది ఏమంటే, మనం ఇప్పుడు ప్రమాదంలో లేము. ఎందు కంటే లక్షల మంది ఇప్పటికే చనిపోయారు.

– సోనాలీ వైద్, మెడికల్ యాక్టివిస్ట్

ఎక్కడో తేడా!



నాలుగింటికి నిద్ర లేచి, స్నానం చేసి, బట్టలు వేసుకుని, కోల్‌కతా విమానం కోసం ఏడున్నరకు చెక్‌ఇన్ అవుతున్నప్పుడు అర్థమైనదేమంటే – డిసెంబర్ 28కి కాదు, జనవరి 28కి టికెట్ బుక్ అయ్యిందని!

– సౌగతో దత్తా, పరిశోధకుడు

భయపెడుతున్నారు



ఇదొకటి చక్కర్లు కొడుతోంది. ఈ కొత్త కోవిడ్ రకం ఎంత ప్రమాదకరమైనదంటే, అది శ్వాస కోశాలకు బదులుగా వార్తా ఛానళ్ల నుంచి వ్యాపిస్తున్నదట!

– శోభా డే, కాలమిస్ట్

సారాంశం
నరికొండ చలపతి

బాబోయ్! హ్యాండిల్ విత్ కేర్...

'లయర్ అనే పక్షి బాగా మిమిక్రీ చేస్తుందట. దానికి వినబడే అన్ని రకాల ధ్వనులను అనుకరించేస్తుందట. ఇతర పక్షుల శబ్దాలు, కుక్కల అరుపులు, కెమెరా షటర్ శబ్దం, రంపం కోస్తున్న చప్పుడు, తుపాకీ పేలిన చప్పుడు, కారు ఇంజన్ చప్పుడు, కొన్ని కొన్ని మనుషుల మాటలు కూడా అనుకరించగలదట... ఎప్పటికప్పుడు దాని అవసరాన్ని బట్టి అరుపులు ఉంటాయి కనుక **'లయర్'** అంటారట అంకుల్.'

– నైన్త్ క్లాస్ చదివే పక్కింటి కుర్రాడు రవి.

...అప్పడే టీవీలో పొలిటికల్ లీడర్ల ముచ్చట్లపై చర్చ నడుస్తోంది. నేను సీరియస్‌గా వింటున్నా. ఎవరు ఎప్పుడు ఎలా మాట మార్చారు, గతంలో ఏం చెప్పారు, ఇప్పడేం చెబుతున్నారు, ఆ పార్టీలో ఉన్నప్పుడు ఏం మాట్లాడారు. ఈ పార్టీలో ఏం మాట్లాడుతున్నారు... మాటెలా మారింది... గట్రాలు.

......

రవి చదువుకోవడానికి మా ఆవిడ దగ్గరికి వస్తుంటాడు. నేనూ ఖాళీగా ఉన్నప్పుడు వారి మధ్య ఇన్వాల్వ్ అవుతుంటాను.

ఎప్పుడూ ఆ పిల్లాడి చేతిలో ఐఫోన్ ఉంటుంది. సోషల్ మీడియా బాగా ఫాలో అవుతుంటాడనుకుంటా... రకరకాల విషయాలు చెబుతుంటాడు. సినిమాలు, నేచర్, టెక్నాలజీ... ఇలా.

......

'ఎందుకోయ్ ఆ సోషల్ మీడియా ముచ్చట్లు... హాయిగా పేపర్ చదువుకోరాదూ. జనరల్ నాలెడ్జ్ వస్తుంది' అని వాడికి చెబుతూ,

'న్యూస్ వినడానికి, పేపర్ చదవడానికి ఎంకరేజ్ చెయ్యి , పిల్లాడు షార్ప్ గా ఉన్నాడు'... అని మా ఆవిడకూ ఓ సలహా పడేశా.

మా ఆవిడ నన్ను అదోలా చూసింది. నేను ఇచ్చిన సలహాలు తరచుగా వికటిస్తాయని ఆమె ప్రగాఢ నమ్మకం. ఇందులో వికటించడానికి ఏముంది? న్యూస్ చూడమన్నా. మంచి సలహానే కదా... అన్న ధీమాతో అక్కడి నుంచి లేచిపోయా.

......

ఇది కొద్దిరోజుల క్రితం జరిగిన విషయం.

......

ఓ ఫైన్ ఈవెనింగ్ మా ఆవిడ పక్కింటి కుర్రాడి హోం వర్క్ బుక్ నాముందు పడేసింది, చూడండి మీ నిర్వాకం అన్న అర్థం స్ఫురించేలా చూస్తూ. ఏదో తేడా జరిగిందని అర్థం అయ్యింది. ఏమైందా అని చదివా. సామెతలకు అర్థం రాయమని స్కూలు టీచర్ ఇచ్చిన అసైన్‌మెంట్..

– ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ఎక్కింది... ఈ సామెతను వివరింపుము **– టీచర్ ప్రశ్న**

– తెలంగాణలో బాగా పాలన చేయని కేసీఆర్... బీఆర్ఎస్ పేరుతో జాతీయ పార్టీ పెట్టడం. **– మన వాడి సమాధానం**

– గూట్లో రాయి తీయలేని వాడు ఏట్లో రాయి తీస్తాడట... అర్థం ఏమిటి? **– మరో ప్రశ్న**

– ఆంధ్రప్రదేశ్‌లో సరిగా పరిపాలన చేయలేని చంద్రబాబు మళ్లీ తెలంగాణలో పార్టీని బలోపేతం చేస్తాననడం. **– ఇదీ జవాబు**

...ఈ సమాధానాలు చదివి అవాక్కయ్యా. అప్పటికే మా ఆవిడ నావైపు సీరియస్‌గా చూస్తోంది. పిల్లాడిని చెడగొట్టావుగా అన్నట్టు.

సీరియస్‌గా టీవీల్లో వార్తలు చూస్తున్న రవిని చూసి తక్కున టీవీ కట్టేసి పిలిచి పక్కన కూర్చోబెట్టి సామెతలు చూపించి అడిగా... ఇలా ఎవరు చెప్పారని.

'మీరు వార్తలు ఫాలో అవమని చెప్పారుగా అంకుల్... అప్పటినుంచి పేపర్ చదువుతున్నా, టీవీ న్యూస్ కూడా చూస్తున్నా. చాలా విషయాలు తెలుస్తున్నాయ్. మొన్న నడ్డా తెలంగాణ వచ్చాడుగా... మొదటి సామెత ఆయన చెప్పిందే. ఆయన స్పీచ్ మొత్తం విన్నా. అందుకే సామెత అర్థం ఈజీగా రాసేశా.

ఆ తర్వాత సామెత చంద్రబాబు మీద నిన్న హరీశ్‌రావు చెప్పింది... అంతకు ముందు చంద్రబాబు స్పీచ్ కూడా విన్నా.

'కరెక్ట్‌గానే రాశానుగా అంకుల్... టీచర్ బాగా సీరియస్ అయ్యింది. ఎవరు చెడగొడుతున్నార్రా నిన్ను.. అంటూ తలంటు పోసిందనుకోండి...'

'...అయినా అంకుల్... అశోకుడిలా చెట్లు నాటించాం.. కాకతీయుల్లా చెరువులు తవ్వించాం. ఇళ్లకూ, పొలాలకూ నీళ్లిచ్చాం. రైతులకు సాయం చేస్తున్నాం, ఉద్యోగాలు ఇస్తున్నాం... అని కేసీఆర్ చెబుతున్నారుగా. మరి నడ్డా ఎందుకలా అంటున్నాడు అంకుల్? ఇంకా మరి చంద్రబాబేమో...' ఇలా వాడు గడగడా మాట్లాడుతున్నాడు.

నేను షాక్ లోంచి తేరుకోకముందే వాడి నోరు మూసి మా ఆవిడ తీసుకెళ్లి పోయింది. పిల్లాడి జోలికి రావద్దన్నట్టుగా... కళ్లలో కాసిని నిప్పులు.

'తెలంగాణ ఆడబిడ్డ కళ్లల్లోంచి వచ్చేవి నిప్పులేగా.. కవితక్క మొన్న ఇదే చెప్పింది.. అంకుల్'... అని రవి అంటున్నట్టుగా అనిపించింది.

వార్నీ! వీడి జనరల్ నాలెడ్జ్ తగలెయ్యా. నేను అనుకున్నదానికన్నా షార్ప్‌గా ఉన్నాడే అనుకున్నా.

ఎప్పటిలాగే... మరో సలహా వికటించిందన్న మాట! ఈ సామెతలకే ఇలా నేర్చేసుకుంటే... మరి తిట్ల సంగతేమిటి? వీడు క్లాసులో, వాళ్లింట్లో మాట్లాడుతున్న భాష పరిస్థితేమిటి?

కొద్ది రోజుల్లో పక్కింటి వాళ్లు నాపై దండయాత్రకు రావడం ఖాయం.

కొంచెం గతుక్కుమన్న మాట వాస్తవం.

......

అప్పటినుంచి వాళ్ల చదువు జోలికి పోకుండా నా మానాన నేను ఉంటున్నా...

......

ఆ తర్వాత రవి ఓసారి బుక్ పట్టుకొచ్చి ఓ పద్యం చూపించాడు

'అన్న మిచ్చిన వాని
ఆలి నిచ్చిన వాని
అపహసించుట హాని
ఓ కూనలమ్మ'



– దీని అర్థం ఏమిటి అంకుల్ అంటూ.

...అప్పుడే నా ఎదురుగా టీవీలో చంద్రబాబు ఏకధాటిగా ప్రసంగిస్తున్నాడు. నా కెందుకో వాడికి అర్థం తెలిసీ నన్ను అడుగుతున్నాడేమో అనిపించింది. వాడి రాజకీయ పరిజ్ఞానాన్ని రుచి చూపించి మా ఆవిడతో చీవాట్లు పెట్టించాడుగా.

'మామా అల్లుళ్ల గురించేగా?... అల్లుడికి చెబుతున్న నీతే కదా అంకుల్?' రెట్టిస్తున్నాడు, ఓ పక్క టీవీలో చంద్రబాబు ప్రసంగం వింటూనే.

దగ్గర్లోనే మా ఆవిడ వుంది.

వాడికి అర్థం చెప్పే ధైర్యం చెయ్యలేక పోయా.

'నాకు తెలుగు పెద్దగా తెలియదు, ఆంటీని అడుగు...'

అని తప్పించుకుంటుండగా.. వాడు టీవీ నుంచి దృష్టి మరల్చకుండా బాబు ప్రసంగం వింటూనే, 'అవునకుంల్... కరోనా వైరస్ మళ్లీ కొత్త వేషం మార్చుకుని వస్తోందటగా. వాటినే కొత్త వేరియంట్లం టారట... మళ్లీ మన తెలంగాణకూ వచ్చేస్తదా.. వీటి వల్ల మళ్లీ ప్రమాదం ముంచుకు వస్తదా.'

– చంద్రబాబు ప్రసంగం వింటున్న వీడి బుర్రలో కరోనా వైరస్ ప్రశ్నలేమిటా అని ఆశ్చర్యపోతూ వినీ విననట్టుగా అక్కడి నుంచి జారుకున్నా.

ఏమైనా, ఈ కాలం పిల్లలను హ్యాండిల్ చెయ్యలేం!

మార్మిక వధూగీతం గోదాస్తుతి

పదమూడవ శతాబ్దంలో, ఒకనాటి సాయంత్రం, శ్రీవైష్ణవ కవి, తాత్వికులు వేదాంత దేశికులు తమిళనాడులో అడవుల మధ్య ఉన్న శ్రీవిల్లిపుత్తూరు మీదుగా ప్రయాణిస్తున్నారు. ఆనాడు త్రయోదశి, మహాప్రదోష సమయం. సంప్రదాయపరులైన శ్రీవైష్ణవులు నరసింహస్వామి ధ్యానంలో మౌనవ్రతాన్ని పాటించే రోజు. అందువల్ల దేశికులు నిశ్శబ్దంగా తమ విడిదిలోకి నిష్క్రమించారు. అప్పుడే ఆ వీధి నుండి పూర్వ శతాబ్దాలకు చెందిన కవయిత్రి, మార్మిక వధువు అయిన శ్రీ ఆండాళ్ ఉత్సవ విగ్రహపు ఊరేగింపు సాగింది. కనుల పండువగా, వైభవోపేతంగా పల్లకీలో సాగే ఆ ఊరేగింపు, ఆ ఊరి వేల్పు వటపత్ర శాయి ఆలయానికి సాగుతోంది. ఆ అద్భుత దృశ్యం దేశికుల మౌనవ్రతాన్ని హఠాత్తుగా భగ్నం చేసింది. వారి నోటి వెంట ఆశువుగా గోదాస్తుతి వెలువడింది. వారు రచించిన 28 స్తోత్రాలలోకి ఇది గొప్ప రచనగా పండితులు భావిస్తారు. నియమబద్ధమైన మౌనాన్ని ఛేదిస్తూ ఆశుధారగా వెలువడిన ఆ స్తోత్రం శ్రీవైష్ణవ సాహిత్యంలోకెల్లా గంభీరమైన స్తోత్రంగా సంస్కృత పండితులే కాక వేదాంతులు కూడా భావిస్తారు.



గోదాస్తుతికి గల గంభీర లక్షణాన్ని అర్థం చేసుకోవాలంటే, శ్రీ వైష్ణవ సిద్ధాంతాల పట్ల లోతైన అవగాహన, శ్రీ ఆండాళ్ కృతులలో, ఆమె పవిత్ర జీవిత గాథలో ప్రతీకాత్మకంగా చెప్పిన విషయాలను అర్థం చేసుకొనే శక్తి ఉండాలి.

1. భగవంతుని వారసులుగా తప్ప జీవాత్మలకు ఏ విధమైన గుర్తింపూ లేదు.
2. ఇహలోక యాత్రలో తమ ప్రాణేశ్వరుడైన పరమాత్మను అన్వేషించటం కంటే, అతనితో తమ జీవనాన్ని పెనవేసుకోవటం కంటే మరో ముఖ్యమైన కార్యక్రమం జీవాత్మలకు లేదు.
3. విశ్వజనీన వరుడు పరమాత్మతో కలయికకు ఎదురుచూడని జీవాత్మల గాథలు వ్యర్థాలు. శ్రీవైష్ణవ మతానుసారం, భగవానుని సంయోగం కోసం ఎదురుచూడని జీవుని జన్మ వృథా! అందువల్ల జీవాత్మ ఎప్పుడూ పరమాత్మ కోసం అన్వేషించి, తపించి, కనుగొని అతనిలో విశ్రమించాలి.

'వధూమార్మికత' అనే దృక్కోణంపై గోదాదేవి జీవితగాథ, ఆమె కవిత్వ మహత్తర సౌధం నిర్మితమైంది. ఆండాళ్ 'నాచ్చియార్ తిరుమొళి'లో తొణికిసలాడుతున్న వధూమార్మికత లేదా ప్రణయభక్తి, పరమాత్మ కొరకు జీవుని వేదన... అప్పటి శ్రీ వైష్ణవ ఆలోచనాధారను ప్రభావితం చేశాయి. శ్రీవైష్ణవ సిద్ధాంతాలకు ఆనందప్రదమైన నిరూపణగా నిలిచిపోయాయి. ఈ విషయాన్నే దేశికులు గోదాస్తుతిలోని ఎనిమిదవ చరణంలో చెప్పారు. ఆమె తండ్రి అయిన పెరియాళ్వారుతో సహా వైదిక విశ్వాసం గల పెద్దలు కూడా తమ సంప్రదాయాలను వదలి, తమ ఆధ్యాత్మిక అన్వేషణలో గోదాదేవి చూపిన ప్రణయ భక్తి మార్గాన్ని అనుసరించారు.

గోదాదేవి దాల్చి ఇచ్చిన మాలను ధరించి సంతోషించిన రంగనాథుడు, ఆమె పాశురాలకు పరవశించిన స్వామి, ఆమె జీవులను రక్షించటానికి ఏమి చేయమంటే అది చేయటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని శ్రీవైష్ణవుల విశ్వాసం.

– శ్రీదేవి మురళీధర్

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, **తిథి:** శు.సప్తమి రా.1.20 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** పూర్వాభాద్ర సా.5.57 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** రా.3.12 నుండి 4.44 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.14 నుండి 10.55 వరకు, తదుపరి ప.2.35 నుండి 3.20 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.20 నుండి 11.50 వరకు : **రాహుకాలం** : ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం** : ఉ.6.00 నుండి 7.30 వరకు : **సూర్యోదయం** 6.34 ; **సూర్యాస్తమయం** 5.31.

పేదలందరికీ అన్నం

రాష్ట్రంలో కొత్తగా 70,807 రైస్ కార్డుల మంజూరు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో ప్రతి ఆరు నెలలకోసారి నూతన బియ్యం కార్డుల మంజూరుకు శ్రీకారం చుట్టింది. తొలి అర్ధ సంవత్సరం జూన్‌లో, చివరి అర్ధ సంవత్సరం డిసెంబర్‌లో.. అప్పటి వరకు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కొత్త కార్డులను అందిస్తోంది. తాజాగా 26 జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 70,807 రైస్ కార్డులను మంజూరు చేసింది. వచ్చే ఏడాది జనవరి మొదటి వారంలో వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి వీటిని పంపిణీ చేయనుంది. ఈ మేరకు కార్డుల ముద్రణను దాదాపు పూర్తి చేసింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 1.39 కోట్ల కార్డులు మాత్రమే ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కార్డుల సంఖ్యను 1,45,43,996కు పెంచింది. వీటి కింద 4.24 కోట్ల మందికి 2.31 టన్నుల బియ్యాన్ని ప్రతి నెలా పంపిణీ చేస్తోంది. ఇప్పుడు కొత్తగా ఇచ్చేవాటితో కలిపితే మొత్తం కార్డుల సంఖ్య 1,46,14,803 అవుతుంది. అదనంగా 1.66 లక్షల మందికి ప్రతి నెలా 8.30 లక్షల టన్నుల రేషన్‌ను పంపిణీ చేయనుంది. ఇందుకుగాను ప్రభుత్వంపై నెలకు రూ.3.40 కోట్ల భారం పడుతుంది. ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ పంపిణీతో పాటు, దేశంలో ఎక్కడా లేని విధంగా నాణ్యమైన(సార్టెక్స్) బియ్యం ఇస్తోంది. అందువల్ల ప్రతి నెలా 90 శాతానికి పైగా ప్రజలు రేషన్ తీసుకుంటున్నారు.



ఆరు దశల ధ్రువీకరణ ముఖ్యం



రాష్ట్రంలో బియ్యం కార్డుల మంజూరులో ప్రభుత్వం ఆరు దశల ధ్రువీకరణ(సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్) విధానాన్ని అవలంబిస్తోంది. ఇందులో అర్హులైతేనే కొత్త కార్డులిస్తోంది. ఈ క్రమంలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల్లో వెసులుబాటు కల్పించాం. వీటిపై వచ్చే దరఖాస్తులను సచివాలయ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పునఃపరిశీలన జరిపి అర్హులని తేలితే.. ఆ మేరకు సరిచేసి కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాం.

– హెచ్.అరుణ్‌కుమార్, పౌరసరఫరాల శాఖ కమిషనర్

కొత్త కార్డుల మంజూరు ఇలా..

జిల్లా	కార్డుల సంఖ్య
అల్లూరి సీతారామ రాజు	1,701
అనకాపల్లి	2,158
అనంతపురం	4,122
అన్నమయ్య	2,465
బాపట్ల	1,441
చిత్తూరు	3,100
తూర్పుగోదావరి	2,848
ఏలూరు	2,866
గుంటూరు	2,139
వైఎస్సార్	2,565
కాకినాడ	2,692
కోనసీమ	2,452
కృష్ణా	2,481
కర్నూలు	3,858
మన్యం	1,402
నంద్యాల	2,903
నెల్లూరు	3,722
ఎన్టీఆర్	2,669
పల్నాడు	1,933
ప్రకాశం	3,699
శ్రీసత్యసాయి	3,387
శ్రీకాకుళం	3,632
తిరుపతి	2,853
విశాఖపట్నం	1,837
విజయనగరం	2,792
పశ్చిమగోదావరి	3,090
మొత్తం	70,807

క్లుప్తంగా...

ప్రశ్న పత్రం లీక్ యత్నం కేసులో సెల్‌ఫోన్లు సీజ్

పెడన: కోర్టుల్లో పోస్టుల భర్తీ కోసం నిర్వహిస్తున్న ఆన్‌లైన్ పరీక్షల్లో ప్రశ్న పత్రం లీక్ చేసేందుకు యత్నించి అరెస్టయిన ముగ్గురు నిందితుల నుంచి పోలీసులు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించడంతో మచిలీపట్నం సబ్ జైలుకు పంపించినట్టు కృష్ణాజిల్లా పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ప్రసన్నవీరయ్యగౌడ్ తెలిపారు. ఇప్పటికే వారి ఫోన్‌లో ప్రశ్న పత్రానికి సంబంధించిన ఫోటోలను వాటి జిరాక్స్ కాపీలను తీయించడంతో పాటు ఆ ఫోన్లను ఫోరెన్సిక్ (ఎఫ్‌ఎస్‌ఎల్)ల్యాబ్‌కు పంపించినట్లు చెప్పారు. నివేదిక వచ్చేందుకు నెల రోజుల సమయం పడుతుందని, రాగానే ఛార్జిషీట్ దాఖలు చేస్తామని వివరించారు.

దేశంలోనే ఏపీ అగ్రగామి

- శ్రీవారిని దర్శించుకున్న ప్రభుత్వ సలహాదారు సజ్జల

తిరుమల: దేశంలోనే ఏపీ అగ్రగామిగా నిలిచిందని.. ఆదర్శవంతమైన రాష్ట్రంగా కొనసాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. బుధవారం ఆయన తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలివ్వగా.. అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విష శక్తుల కుట్రలను ఎదుర్కొనే శక్తిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రసాదించాలని శ్రీవారిని కోరుకున్నట్లు తెలిపారు. వైఎస్ జగన్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న సంక్షేమాభివృద్ధి భవిష్యత్‌లో కూడా ఇలాగే కొనసాగాలని దేవదేవుణ్ని ప్రార్థించినట్లు చెప్పారు. సీఎం జగన్‌కు ప్రజాదరణ వెయ్యి రెట్లు పెరిగిందన్నారు. విశాఖ పరిపాలన రాజధానిగా ఎప్పుడైనా ఏర్పాటు కావచ్చన్నారు.

గిరిజన ప్రాంతాల్లో బైక్‌ల ద్వారా రేషన్ సరఫరా

- ఎండీయూ వాహనం వెళ్లలేని గ్రామాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో కొత్త రేషన్ షాపుల మంజూరు
- పౌరసరఫరాల శాఖ కమిషనర్

సాక్షి, అమరావతి: గిరిజన ప్రాంతాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థలో మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్టు పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ చెప్పారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, ఏలూరు జిల్లాల జాయింట్ కలెక్టర్లతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సరుకు రవాణాకు ఇబ్బందిగా ఉన్న ప్రాంతాల్లో కొత్త ఎంఎల్‌ఎస్ పాయింట్లు, బఫర్ గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మారుమూల, కొండ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఎండీయూ ఆపరేటర్లకు అదనపు ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు, ఎండీయూ వాహనం వెళ్లలేని గిరిజన గ్రామాలకు బైక్‌ల ద్వారా ఇంటింటికీ రేషన్ సరఫరా చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జనవరి నుంచి కంది పప్పు, పంచదార పంపిణీతో పాటు అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ల వద్దకే నిత్యావసరాలు డెలివరీ చేసేలా చూడాలన్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో అవసరాన్ని బట్టి కలెక్టర్ కొత్త రేషన్ షాపులు మంజూరు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో దాదాపు 45 శాతానికి పైగా ధాన్యం కొనుగోళ్లు పూర్తయినట్టు కమిషనర్ తెలిపారు. జనవరి చివరి నాటికి ఖరీఫ్ సేకరణ పూర్తి చేసే లక్ష్యంతో పని చేస్తున్నామని, ధాన్యం కొనుగోళ్ల సొమ్ముతో పాటు మిల్లర్ల బకాయిలనూ వేగంగా చెల్లిస్తున్నట్టు చెప్పారు. 16 రోజులు దాటిన ఎఫ్‌టీవోలకు చెల్లింపులు పూర్తి చేసినట్టు తెలిపారు. మిల్లర్లు ప్రభుత్వం చెల్లించే బకాయిల్లో కొంత మొత్తం వెచ్చించి ఆరబోత యంత్రాలు (డ్రయర్లు) ఏర్పాటు చేయాలని, లేకుంటే.. 2023 ఖరీఫ్ సీజన్ నుంచి ఆయా మిల్లులకు సీఎంఆర్ నిలిపివేస్తామని కమిషనర్ అరుణ్‌కుమార్ హెచ్చరించారు.

8వ శతాబ్దం నాటి తెలుగు శాసనం గుర్తింపు

- చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి వెల్లడి

మార్కాపురం: ప్రకాశం జిల్లా మార్కాపురం మండలంలోని వేములకోటలో 8వ శతాబ్దం నాటి తెలుగు శాసనం లభించిందని తెలంగాణ రాష్ట్రం జనగామకు చెందిన చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి బుధవారం తెలిపారు. వేములకోట గ్రామంలో వేములమ్మ గుడిలో, గుడికి అర కిలోమీటరు దూరంలో రహదారి పక్కన రోలు బండకు చెక్కిన మరో శాసనం ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. శాసనాలను గ్రామానికి చెందిన నారాయణ రెడ్డి గుర్తించి అచ్చు తీసి తనకు పంపగా..తాను ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఎపిగ్రఫిస్ట్ డాక్టర్ మునిరత్నంకు ఆ వివరాలను పంపినట్లు చెప్పారు. రోలుబండ శాసనం 8వ శతాబ్దం నాటిది అని, తెలుగు భాష అక్షరాలలో రాశారని చెప్పారు. 'గావుండే అనే వ్యక్తి వీరమరణం చెందిన కారణంగా రాచయరావులు ఒక స్మారక శిలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఆ శిలపై శాసనంలో 'రేచస'అనే వ్యక్తి ప్రస్తావన ఉంది. గుంగి అనే నది పేరు ఉందని, దానినే ప్రస్తుతం గుండ్లకమ్మ అని పిలుస్తున్నారు' అని వివరించారు. చెన్నకేశవస్వామి మేనత్త వేములమ్మగా భావించే అమ్మవారి దేవాలయం గోడలో కుడి చేతిలో కత్తి ధరించిన వీరుని శిల్పంలో ఒక ముక్క ఉందని, దీనిపై కూడా 8వ శతాబ్దం నాటి తెలుగు భాషలో రాసిన శాసనంలో 'శింగరాజుల పట్ట' అని ఉందని చెప్పారు. ఆలయానికి సింహరాజు ఇచ్చిన పలకను బహుమతిగా నమోదు చేసినట్లు తెలుస్తోందని అన్నారు. దీనిని వీరగల్లు అంటారని, రాజ్య రక్షణలో భాగంగా మరణించిన వారి జ్ఞాపకార్థంగా ఇటువంటి శిల్పాలను ప్రతిష్ఠిస్తారని తెలిపారు. రాజభక్తిని, దేశభక్తిని చాటే ఇటువంటి శిల్పాలకు రక్షణ ఇవ్వాలని కోరారు. వేములకోటలోని ఆలయంలో ఉన్న వేములమ్మ విగ్రహం చాలా ప్రత్యేకమైనదని, ఇద్దరు స్త్రీ మూర్తులు ఆశీనులై ఉన్నారని చెప్పారు. త్రిశూలం కొత్తగా ఉందని.. తలలు, చేతులు పూర్తిగా ధ్వంసమయ్యాయన్నారు. వాహనం ముంగిస, మనిషి ఉండటంతో ప్రత్యేకంగా నిలుస్తుందని తెలిపారు.



దొరికిన శాసనం

ఏపీ నిట్‌కు 2 పరిశోధనా ప్రాజెక్టులు

తాడేపల్లిగూడెం: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌కు రెండు జాతీయ పరిశోధనా ప్రాజెక్టులు మంజూరయ్యాయి. సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డు, డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (న్యూఢిల్లీ) ప్రాజెక్టుల కోసం రూ.78 లక్షలు వెచ్చించనున్నాయని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి బుధవారం తెలిపారు. 2030 నాటికి 30 శాతం ఎలక్ట్రికల్ వాహనాల వినియోగాన్ని పెంచి, నూరుశాతం బ్యాటరీ ఆధారిత బస్సులను వినియోగంలోకి తేవడానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఏపీ నిట్‌కు డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ మల్టీలెవెల్ ఇన్వర్టర్ ఫేజ్ మల్టీఫేజ్ సెన్సార్లెస్ పర్మినెంట్ మ్యాగ్నెట్ సింక్రోనెస్ మోటారు డ్రైవ్ ఫర్ హైబ్రిడ్ ఎలక్ట్రికల్ వెహికల్ అప్లికేషన్ విత్ రెడ్యూస్డ్ టర్క్యూ అండ్ ఫ్లూస్ రీప్లేస్ ప్రాజెక్టు వచ్చింది. ఈ ప్రాజెక్టు విలువ రూ.53 లక్షలు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా జల వాతావరణంలో మైక్రోప్లాస్టిక్ వ్యర్థాల నివారణకు పరిశోధనలు చేసేందుకు అండర్ స్టాండింగ్ ద ఇంటరాక్షన్ బిట్వీన్ మైక్రో ప్లాస్టిక్ అండ్ హెవీ మెటల్స్ టు వేస్ట్ వాటర్ డిస్ట్రిబ్యూషన్ అడశోరప్షన్ రిస్క్ అసెస్‌మెంట్ ప్రాజెక్టును కేటాయించింది. ఈ ప్రాజెక్టు విలువ రూ.25 లక్షలు.

ఐఎంఏ ఏపీ శాఖకు 11 జాతీయ అవార్డులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజారోగ్య పరిరక్షణ, వైద్యుల సంఘానికి అందించిన సేవలకు గాను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ శాఖకు 11 జాతీయ అవార్డులు లభించాయి. వైద్యులకు బహుముఖ సేవలు అందించినందుకు ఐఎంఏ పూర్వ (2021–22)రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సి.శ్రీనివాసరాజును డాక్టర్ ఏకేఎస్ సిన్హా జాతీయ అవార్డు, వైద్య విద్య విభాగానికి గాను డాక్టర్ డి.శ్రీహరిరావు(తిరుపతి), శాస్త్రీయ అవగాహన కార్యక్రమాలకు గాను డాక్టర్ ఎస్.సి.చక్రరావు(కాకినాడ), కోవిడ్ సమయంలో అందించిన సేవలకు డాక్టర్ నందకిషోర్(గుంటూరు), డాక్టర్ ఎం.సుభాష్‌చంద్రబోస్(విజయవాడ), కార్డియాలజీలో ఉత్తమ సేవలకు డాక్టర్ పి.నాగశ్రీహరిత(గుంటూరు)కు జాతీయ అవార్డులు దక్కాయి. వీరితో పాటు, గుంటూరు, అనంతపురం, తిరుపతి, గూడూరు, నంద్యాల శాఖలకు అవార్డులు లభించాయి. ఈ నెల 26 నుంచి 28 వరకూ ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో జరిగిన ఐఎంఏ జాతీయ సదస్సులో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సహజా నందప్రసాద్ సింగ్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నట్లు ఐఎంఏ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సి.శ్రీనివాసరాజు బుధవారం తెలిపారు.

ప్రగతి బాటలో విద్యుత్ రంగం

- చేసిన పనులు.. సాధించిన ఫలితాలే నిదర్శనం
- జాతీయ అవార్డులు రావడం రాష్ట్రానికి గర్వకారణం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న పెద్దిరెడ్డి, అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యుత్ రంగం ప్రగతి బాటలో పయనిస్తోందని ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. చేసిన పనులు, సాధించిన ఫలితాలు, అవార్డులే ఇందుకు నిదర్శనమన్నారు. ట్రాన్స్‌కో, జెన్‌కో, ఏపీసీపీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్, ఏపీఎస్‌ఈసీఎం సంస్థలకు సంబంధించిన డైరీలు, క్యాలెండర్లను మంత్రి పెద్దిరెడ్డి బుధవారం విజయవాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పురోగాభివృద్ధి విద్యుత్ రంగంపైనే ఆధారపడి ఉంటుందన్నారు. 99 శాతం మంచి చేసి, ఎక్కడో ఒక శాతం పొరపాటు జరిగితే దానినే పనిగట్టుకొని కొన్ని మీడియా సంస్థలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామని మంత్రి ఉద్ఘాటించారు. వ్యవసాయ రంగానికి పగటి పూట 9 గంటల పాటు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను ఒకటిన్నర రూపాయికే సరఫరా చేస్తున్నామని, 22.56 లక్షల మంది ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు, 18.65 లక్షల మంది రైతులకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని మంత్రి వివరించారు. విద్యుత్ సమర్థ వినియోగానికి సంబంధించి రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్‌కు రాష్ట్రపతి అవార్డుతో పాటు, ఏపీ ట్రాన్స్‌కో, డిస్కం, నెడ్‌క్యాప్‌లకు జాతీయ అవార్డులు రావడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే రాష్ట్ర వినియోగానికి పోగా.. మిగిలిన మొత్తాన్ని ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తామన్నారు. వచ్చే మార్చిలో ఆర్టీపీఎస్ 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను పరిశీలించి ప్రభుత్వం తప్పకుండా పరిష్కరిస్తుందని మంత్రి ప్రకటించారు. కార్యక్రమంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఉన్నతాధికారులు బి.శ్రీధర్, మల్లారెడ్డి, పద్మా జనార్దన్‌రెడ్డి, సంతోష్‌రావు, రమణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైయాష్ ఉత్పత్తిదారులు, వినియోగదారుల కోసం పోర్టల్

రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. విజయవాడలోని ఏపీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ(పర్యావరణ) నీరబ్‌కుమార్ ప్రసాద్, కార్పొరేషన్ ఎండీ ఖజూరియా, చైర్మన్ గుబ్బా చంద్రశేఖర్‌తో కలిసి బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. కాలుష్య కారక వ్యర్థాల నిర్వహణకు ఏర్పాటు చేసిన పోర్టల్‌ను మంత్రి ప్రారంభించారు. రాష్ట్రంలోని థర్మల్ పవర్ స్టేషన్ల నుంచి ఉత్పత్తి అవుతున్న ఫ్లైయాష్ నిర్వహణను ఏపీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలోకి తీసుకువస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. పర్యవేక్షణ కోసం ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించామన్నారు. ఇందులో ఫ్లైయాష్ ఉత్పత్తి, కొనుగోలుదారులు, రవాణాదారులకు సంబంధించిన పూర్తి సమాచారం ఉంటుందని చెప్పారు.

క్లుప్తంగా...

బెనెడిక్ట్16 ఆరోగ్యం విషమం



వాటికన్ సిటీ: పోప్ బాధ్యతల నుంచి కొన్నేళ్ల క్రితం తప్పుకున్న బెనెడిక్ట్–16 ఆరోగ్యం అత్యంత విషమంగా ఉందని వాటికన్ వర్గాలు బుధవారం వెల్లడించాయి. పరిస్థితి ప్రస్తుతం అదుపులోనే ఉందని పేర్కొన్నాయి. 95 ఏళ్ల బెనెడిక్ట్ చాలారోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వార్ధక్యం వల్ల పలు అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయని వాటికన్ అధికార ప్రతినిధి మాటియో బ్రూనీ తెలియజేశారు. బెనెడిక్ట్ కోలుకోవాలంటూ అందరూ ప్రార్థించాలని పోప్ ఫ్రాన్సిస్ విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. వాటికన్ ఆడిటోరియంలో బుధవారం పోప్ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. బెనెడిక్ట్ తీవ్ర అనారోగ్యం పాలయ్యారని ప్రకటించారు. పూర్తి వివరాలు మాత్రం బహిర్గతం చేయలేదు.

ఫిలిప్పైన్స్‌లో వర్ష బీభత్సం

మనీలా: భారీ వర్షాలు, వరదలు ఫిలిప్పైన్స్‌ను బెంబేలెత్తిస్తున్నాయి. ప్రకృతి ప్రకోపానికి ఇప్పటిదాకా కనీసం 29 మంది మరణించారని నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఏజెన్సీ బుధవారం వెల్లడించింది. మరో 25 మంది గల్లంతయ్యారని పేర్కొంది. చాలామంది నీట మునిగి ప్రాణాలు కోల్పోయారని, పడవలు బోల్తా పడి కొందరు కనిపించకుండా పోయారని తెలియజేసింది. తూర్పు, మధ్య, దక్షిణ ఫిలిప్పైన్స్‌లో పరిస్థితి దారుణంగా ఉంది. 86,000 మందికిపైగా బాధితులు శిబిరాల్లో తలదాచుకుంటున్నారు.

కశ్మీర్‌లో భీకర ఎన్‌కౌంటర్

జమ్మూ: పాకిస్తాన్ నుంచి చొరబడిన నలుగురు సాయుధ ఉగ్రవాదులు బుధవారం జమ్మూ–శ్రీనగర్ హైవేపై ఎదురు కాల్పుల్లో హతమయ్యారు. గణతంత్ర దినోత్సవాల ముందు ఇది అతిపెద్ద విజయమని జమ్మూ జోన్ అదనపు డీజీపీ ముకేశ్ సింగ్ చెప్పారు. ''ఓ వాహనంలో ఉన్న ముష్కరులకు, భద్రతా సిబ్బందికి మధ్య కాల్పులు జరిగాయని పేర్కొన్నారు. తర్వాత వాహనం నుంచి నాలుగు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాం. ఏడు ఏకే అసాల్ట్ రైఫిల్స్, ఒక ఎం4 రైఫిల్, 3 పిస్టల్స్, భారీగా మందుగుండు సామగ్రి దొరికాయి. పారిపోయిన వాహనం డ్రైవర్ కోసం గాలిస్తున్నాం. జమ్మూలోని నార్వాల్ బైపాస్ ఏరియాలో ఓ ట్రక్కు నుంచి ఇటీవలే పెద్ద సంఖ్యలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాం. ఈ నేపథ్యంలో హైఅలర్ట్‌లో భాగంగా తనిఖీలు చేస్తుండగా జమ్మూ నుంచి శ్రీనగర్ వెళ్తున్న వాహనంలో నలుగురు పాకిస్తాన్ ఉగ్రవాదులు తారసపడ్డారు'' అని తెలిపారు.

తాత్కాలిక సీవీసీగా ప్రవీణ్‌కుమార్ శ్రీవాస్తవ

న్యూఢిల్లీ: సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌గా (సీవీసీ) విజిలెన్స్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ శ్రీవాస్తవను తాత్కాలికంగా నియమించారు. అవినీతి వ్యతిరేక కార్యకలాపాలు నిఘా వేసే సంస్థ కమిషనర్ అయిన సురేష్ ఎన్ పటేల్ పదవీ కాలం డిసెంబర్ 24తో ముగియడంతో శ్రీవాస్తవను తాత్కాలిక కమిషనర్‌గా నియమించినట్టు బుధవారం కేంద్ర ప్రభుత్వ అధికారులు చెప్పారు. కేంద్ర నిఘా సంస్థకు చీఫ్‌గా సీవీసీతో పాటు ఇద్దరు సభ్యులు కమిషనర్లుగా ఉంటారు. ప్రస్తుతం శ్రీవాస్తవతో పాటు మాజీ ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ అరవింద్ కుమార్ విజిలెన్స్ కమిషనర్‌గా ఉన్నారు.

రాహుల్‌కు భద్రత కల్పించండి

కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు కాంగ్రెస్ లేఖ

న్యూఢిల్లీ: భారత్ జోడో యాత్రలో భద్రతా లోపాలున్నాయని కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. ''యాత్ర క్యాంప్‌ల్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడుతున్నారు. రాహుల్‌గాంధీ చుట్టూ జనం చేరకుండా నియంత్రించడంలో ఢిల్లీ పోలీసులు విఫలమవుతున్నారు. ఆయనకు, యాత్రలో పాల్గొంటున్నవారికి తగిన భద్రత కల్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకోండి'' అని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ ఈ మేరకు బుధవారం కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ''ప్రతీకార రాజకీయాలు చేయొద్దు. దేశ ఐక్యత కోసం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీని మా పార్టీ కోల్పోయింది'' అన్నారు.

4.12 లక్షల ప్రమాదాలు.. 1.53 లక్షల మంది బలి

న్యూఢిల్లీ: 2021లో దేశవ్యాప్తంగా 4,12,432 రోడ్డు ప్రమాదాల్లో 1,53,972 మంది మరణించారు. 3,84,448 మంది గాయపడ్డారు. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ తాజాగా ఒక నివేదికలో ఈ మేరకు వెల్లడించింది. 2019తో పోలిస్తే 2021లో ప్రమాదాలు 8.1 శాతం, బాధితుల సంఖ్య 14.8 శాతం తగ్గినట్టు చెప్పింది. ''మృతుల సంఖ్య మాత్రం 1.9 శాతం పెరిగింది. 2020 కంటే 2021లో రోడ్డు ప్రమాదాలు 12.6 శాతం, మరణాలు 16.9 శాతం, గాయపడినవారి సంఖ్య 10.39 శాతం పెరిగాయి. దేశంలో రోజూ సగటున 1,130 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. 422 మంది మరణిస్తున్నారు'' అని తెలిపింది.


- 2021లో ప్రమాదాల మృతుల్లో 67.7 శాతం 18–45 ఏళ్లలోపు వారే! 18–60 ఏళ్లలోపు వారు 84.5 శాతం మంది.
- గతేడాది 4,12,432 రోడ్డు ప్రమాదాల్లో 31.2 శాతం జాతీయ రహదారులపై, 23.4 శాతం రాష్ట్ర రహదారులపై, 45.4 శాతం ఇతర రోడ్లపై జరిగాయి.
- 2021లో తమిళనాడులో అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఉత్తర ప్రదేశ్‌లో ఎక్కువ మంది మరణించారు.
- రోడ్డు ప్రమాద మరణాలకు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, ఓవర్ స్పీడ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ ప్రధాన కారణాలు.
- ప్రమాదాల్లో ద్విచక్ర వాహనాలదే ప్రధాన వాటా. కార్లు, జీపులు తర్వాతి స్థానంలో ఉన్నాయి.



కెనడాలోని ఒంటారియాలో ఓ ఇంటిని పూర్తిగా కప్పేసిన మంచు



కాలిఫోర్నియా విమానాశ్రయంలో రోజుల తరబడి పోగుబడ్డ ప్రయాణికుల బ్యాగేజీ



పూర్తిగా మంచుమయంగా మారిన బఫెలో నగరంలోని బెడ్‌ఫోర్డ్ అవెన్యూ

ఇంకా వణుకుతూనే ఉంది

మంచు గుప్పిట్లోనే అమెరికా

- కనీవినీ ఎరగని స్థాయిలో విధ్వంసం
- యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు
- భారీగా పెరుగుతున్న మృతుల సంఖ్య
- వేలాదిగా రద్దవుతున్న విమానాలు
- ప్రయాణికులకు తీవ్ర అగచాట్లు



న్యూయార్క్ రాష్ట్రంలో బఫెలో సమీపంలో మంచుతో కప్పుకుపోయిన ఓ ఇల్లు

బఫెలో: ఈ శతాబ్దంలోకెల్లా అత్యంత తీవ్రమైన మంచు తుఫాన్ కోరల నుంచి అమెరికా ఇంకా బయట పడలేదు. గత వారం రోజులతో పోలిస్తే హిమపాతం కాస్త తగ్గినా దేశవ్యాప్తంగా అతి శీతల వాతావరణం కొనసాగుతోంది. రోడ్లపై దట్టంగా పేరుకున్న మంచును తొలగించడంతో పాటు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం వంటి పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. దాంతో తుఫాన్ విధ్వంసం తాలూకు తీవ్రత క్రమంగా వెలుగులోకి వస్తోంది. మంచులో కూరుకుపోయిన కార్లలో నిస్సహాయంగా మరణించిన వారి శవాలు ఒక్కటొక్కటిగా బయట పడుతున్నాయి. మంచు తుఫాన్ ధాటికి కనీసం 100 మందికి పైగా మృత్యువాత పడ్డట్టు భావిస్తున్నారు. దీన్ని తరానికి ఒక్కసారి మాత్రమే సంభవించే మహోత్పాతంగా వాతావరణ శాఖ అభివర్ణిస్తోంది.

మెరుగవని రవాణా వ్యవస్థ

దేశవ్యాప్తంగా వారం రోజులుగా దాదాపుగా స్తంభించిపోయిన రవాణా వ్యవస్థ ఇంకా కుదురుకోలేదు. మంగళవారం కూడా 6,000కు పైగా విమానాలు రద్దయ్యాయి. బుధవారం బయల్దేరాల్సిన 3,500 పై చిలుకు విమానాలను ముందస్తుగానే రద్దు చేశారు. దాంతో విమానాశ్రయాల్లో గందరగోళ వాతావరణం నెలకొంది. చిక్కుబడిపోయిన ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. బయటికెళ్లే పరిస్థితి లేక ప్రయాణికులంతా టెర్మినల్స్‌లోనే కాలం గడుపుతున్నారు. డిసెంబర్ 22 నుంచి రద్దయిన విమానాల సంఖ్య 25 వేలు దాటింది. సకాలంలో సేవలను పునరుద్ధరించడంలో సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ వైఫల్యం పరిస్థితిని మరింత జటిలంగా మార్చింది. సంస్థకు చెందిన వేలాది విమాన సర్వీసులు వరుసగా ఆరో రోజూ రద్దవడంపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా ఆగ్రహించారు. ఎయిర్‌లైన్స్ నుంచి భారీగా నష్టపరిహారం వసూలు చేయాలని ప్రయాణికులకు సూచించారు! కానీ పరిస్థితి చక్కబడేందుకు కనీసం ఇంకో వారం పట్టొచ్చని సౌత్‌వెస్ట్ ప్రకటించింది.

యథేచ్ఛగా లూటీలు

రవాణా వ్యవస్థ స్తంభించడంతో అమెరికాలో చాలా ప్రాంతాల్లో నిత్యావసరాలు తదితరాల సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. దాంతో చాలా రాష్ట్రాల్లో ఆకలి కేకలు విన్పిస్తున్నాయి. బయటికెళ్లే పరిస్థితి లేక జనం రోజుల తరబడి ఇళ్లకే పరిమితం కావడంతో ఆహార పదార్థాలు నిండుకున్నాయి. నాలుగైదు రోజులుగా దుకాణాలూ తెరిచుకోక సమస్య మరింతగా విషమించింది. ఫలితంగా మొన్నటిదాకా బఫెలో నగరంలోనే వెలుగు చూసిన లూటీ ఉదంతాలు ఇప్పుడు పలు రాష్ట్రాల్లోనూ నమోదవుతున్నాయి. ముఖ్యంగా నిత్యావసరాల కోసం దుకాణాల్లోకి చొరబడుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. అమెరికాలోని పలు ప్రాంతాల్లో ఉంటున్న లక్షలాది మంది తెలుగువాళ్లు కూడా నానా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కెనడాలోనూ పరిస్థితి దారుణంగా ఉంది. ఉష్ణోగ్రతలు మైనస్ 50 డిగ్రీల కంటే తక్కువ నమోదవుతున్నాయి!

వరద ముప్పు

క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో అమెరికా ఇప్పుడు వరద ముప్పును ఎదుర్కొంటోంది. మంచు శరవేగంగా కరగడం వల్ల ఊహాతీత వేగంతో ఆకస్మిక వరదలు ముంచెత్తవచ్చని పలు రాష్ట్రాలను వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించింది. పూర్తిగా మంచులో కూరుకుపోయిన బఫెలో వంటి ప్రాంతాలకు ఈ ప్రమాదం ఎక్కువగా ఉందని పేర్కొంది.

బఫెలో.. దయనీయం!

పశ్చిమ న్యూయార్క్‌లోని బఫెలో నగరంలో ఇంకా పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. చాలాచోట్ల ఇంకా 8 అడుగుల ఎత్తున మంచు పేరుకుపోయింది. దాంతో అవసరాల్లో ఉన్నవారిని ఆదుకునేందుకు అత్యవసర సర్వీసులు కూడా సకాలంలో చేరుకోలేని పరిస్థితి! నగరంలోకి వెళ్తుంటే యుద్ధరంగంలోకి ప్రవేశిస్తున్నట్టుగా ఉందని న్యూయార్క్ గవర్నర్ కేథీ హోచల్ వాపోయారు. నగరం, పరిసరాల్లో రోడ్డు ప్రయాణాలపై నిషేధం ఇంకా అమల్లోనే ఉంది. దాని అమలుకు మిలిటరీ పోలీసులు రంగంలోకి దిగారు. పొరుగు రాష్ట్రం న్యూజెర్సీ నుంచి ఎమర్జెన్సీ సేవల సిబ్బంది న్యూయార్క్‌కు తరలుతున్నారు. చాలామంది కార్లలోనే చిక్కుకుపోయి ఉన్నారు. 30కి పైగా మృతదేహాలను వెలికితీసినట్టు చెబుతున్నారు. ఇంతటి ప్రతికూల వాతావరణాన్ని తమ సర్వీసులోనే ఎన్నడూ చూడలేదని వాతావరణ విభాగం అధికారులు చెబుతున్నారు. సహాయక చర్యల్లో భాగంగా సిబ్బంది ఇంటింటికీ తిరుగుతున్నారు.

చావు అంచుల దాకా వెళ్లాం

మంచు తుఫాను బారిన పడి అదృష్టవశాత్తూ బతికి బయటపడ్డవాళ్లు తామెదుర్కొన్న కష్టాలను కథలుగా చెబుతున్నారు. మేరీలాండ్‌కు చెందిన డిట్జక్ ఇలుంగా అనే వ్యక్తి తన ఆరు, పదహారేళ్ల కూతుళ్లతో కలిసి కార్లో హామిల్టన్ వెళ్తూ బఫెలో వద్ద తుఫానులో చిక్కాడు. చూస్తుండగానే కారు చుట్టూ మంచు పేరుకుపోవడంతో గంటల తరబడి కారు ఇంజన్ ఆన్‌లో ఉంచి బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. ''చివరికి ప్రాణాలకు తెగించాం. ధైర్యం చేసి కష్టమ్మీద కారు దిగాం. చిన్న కూతుర్ని వీపున వేసుకుని, పెద్దమ్మాయీ నేనూ భయానక వాతావరణంలో అతికష్టమ్మీద షెల్టర్ హోమ్ దాకా వెళ్లాం. లోపలికి అడుగు పెడుతూ నేనూ నా పిల్లలూ ఒక్కసారిగా ఏడ్చేశాం. ఇంతటి భయానక అనుభవం జీవితంలో ఎన్నడూ ఎదుర్కోలేదు. ఒక్క అడుగూ వేయడానికి ప్రాణాలన్నీ కూడదీసుకోవాల్సి వచ్చింది. కానీ సాహసం చేయకపోతే కార్లోనే నిస్సహాయంగా మరణించేవాళ్లం'' అంటూ డిట్జక్ గుర్తు చేసుకున్నాడు.



బఫెలో నగరంలో ఇంటి ముందు అడుగుల ఎత్తులో పేరుకుపోయిన మంచును తొలిచి దారి చేసుకుంటున్న ఓ వ్యక్తి



కాలిఫ్‌లోని ఓక్లండ్ వద్ద వరద ముంపుకు గురైన హైవే 13పై మరమ్మతులు



న్యూయార్క్ రాష్ట్రంలో తుఫాను గాలుల ధాటికి కూలిపోయిన పెట్రోల్ బంక్ పై కప్పు

జనవరిలో కేసులు పెరగొచ్చు

- ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్న కేంద్రం
- మరో 40 రోజులు అత్యంత కీలకం



న్యూఢిల్లీ: దేశంలో కరోనాని ఎదుర్కోవడానికి రాబోయే 40 రోజులు అత్యంత కీలకమని, వచ్చే జనవరిలో కరోనా కేసుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని కేంద్ర ఆరోగ్య శాఖ అంచనా వేస్తోంది. ప్రజలందరూ కరోనా జాగ్రత్తలు పాటిస్తే ఫోర్త్ వేవ్ ముప్పుని ఎదుర్కోవచ్చునని కేంద్ర ఆరోగ్య శాఖ భావిస్తోంది. వచ్చే నెలలో కేసుల సంఖ్య పెరిగినప్పటికీ ఆస్పత్రి పాలవడం, మరణాలు వంటివి సంభవించకపోవచ్చునని తెలిపింది. ''తూర్పు ఆసియా దేశాలను కరోనా వణికించిన తర్వాత 30–35 రోజుల పాటు భారత్‌ను ఈ ఏడాది జనవరిలో థర్డ్ వేవ్ వణికించింది. ఇదొక ట్రెండ్. అందుకే అందరూ జాగ్రత్తలు పాటిస్తే వచ్చే జనవరిలో ముప్పును దాటొచ్చు'' అని ప్రభుత్వ అధికారి ఒకరు చెప్పారు. గత రెండు రోజుల్లో వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రయాణికుల్లో ఎంపిక చేసిన 6 వేల మందికి కరోనా పరీక్షలు నిర్వహిస్తే 39 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది. చైనా నుంచి వచ్చిన ప్రయాణికులందరికీ కరోనా పరీక్షలు తప్పనిసరి చేసే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉంది. చైనా నుంచి భారత్ రావాలంటే నెగిటివ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్న నిబంధన వచ్చే వారం నుంచి అమలు చేసే ఆలోచనలో ఉంది. చైనాతో పాటు జపాన్, దక్షిణ కొరియా, హాంగ్‌కాంగ్, థాయ్‌లాండ్, సింగపూర్‌ల నుంచి వచ్చే వారికి కరోనా నెగిటివ్ సర్టిఫికెట్ మంజూరు చేయడం తప్పనిసరి చేయనుంది. మరోవైపు చైనాలో కరోనా వాస్తవ పరిస్థితుల్ని ప్రభుత్వం బయటకు వెల్లడించకపోవడంతో అక్కడ నుంచి వచ్చే ప్రయాణికులపై ఆంక్షలు విధించాలని అమెరికా యోచిస్తోంది. కరోనాలో కొత్త వేరియెంట్లు పుట్టుకొచ్చి పలు దేశాలు మూడు, నాలుగు కోవిడ్–19 వ్యాక్సిన్ డోసులు అందిస్తున్న వేళ మన దేశంలో నాలుగో డోసు అవసరంపై చర్చ మొదలైంది. భారత్‌లో ఫ్రంట్‌లైన్, ఆరోగ్య సిబ్బందికి నాలుగో డోసు ఇవ్వాలని కేంద్ర ఆరోగ్య శాఖ యోచిస్తోంది. అయితే వైద్య నిపుణులు నాలుగో డోసు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నారు.

2 కోట్ల కోవిషీల్డ్ డోసులు ఉచితంగా ఇస్తాం

సీరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రకటన

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో కోవిడ్–19 పాజిటివ్ కేసులు మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో పుణేలోని వ్యాక్సిన్ల తయారీ సంస్థ సీరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా దాతృత్వం చాటుకుంది. 2 కోట్ల కోవిషీల్డ్ టీకా డోసులను భారత ప్రభుత్వానికి ఉచితంగా అందజేస్తామని ప్రకటించింది. ఈ విషయాన్ని ప్రభుత్వ అధికార వర్గాలు తెలియజేశాయి. రూ.410 కోట్ల విలువైన 2 కోట్ల కోవిషీల్డ్ టీకా డోసులను ఉచితంగా అందజేస్తామంటూ సీరం సంస్థ ప్రతినిధి ప్రకాశ్‌కుమార్ సింగ్ కేంద్ర ఆరోగ్య శాఖకు లేఖ రాశారని వెల్లడించాయి. ఈ డోసులు ఎలా అందజేయాలో చెప్పాలంటూ ఆయన కోరారని పేర్కొన్నాయి. సీరం సంస్థ ఇప్పటికే 170 కోట్లకు పైగాడోసులను కేంద్ర ప్రభుత్వానికి అందించింది.

ఆస్పత్రిలో హీరాబెన్

తల్లిని పరామర్శించిన ప్రధాని మోదీ



అహ్మదాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాతృమూర్తి, ఇటీవల వందో ఏట అడుగుపెట్టిన హీరాబెన్ అస్వస్థతకు గురయ్యారు. ఆమె ఆరోగ్య పరిస్థితి బాగులేకపోవడంతో అహ్మదాబాద్‌లోని యూ ఎన్ మెహతా ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం హీరాబెన్ ఆరోగ్యం నిలకడగా ఉందని చికిత్స అందిస్తున్న వైద్యులు చెప్పారు. కన్నతల్లి అనారోగ్యం విషయం తెలిసిన వెంటనే ప్రధాని మోదీ హుటాహుటిన అహ్మదాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. దాదాపుగా గంటన్నర సేపు ఆస్పత్రిలోనే గడిపారు. ఆమెని చూసిన తర్వాత ఆస్పత్రి వైద్యులతో తల్లి ఆరోగ్య పరిస్థితి గురించి ప్రధాని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రధాని మోదీ ఆస్పత్రికి వచ్చినప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఆస్పత్రి దగ్గరే ఉన్నారు. ఒకట్రెండు రోజుల్లో హీరాబెన్‌ను డిశ్చార్జ్ చేస్తారని బీజేపీ ఎంపీ జుగాజీ ఠాకూర్ వెల్లడించారు. మరోవైపు హీరాబెన్ త్వరగా కోలుకోవాలని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆకాంక్షించారు. ''తల్లి కొడుకుల మధ్య సంబంధం వెలకట్టలేనిది. మోదీజీ ఇలాంటి కష్టసమయంలో మీకు నా మద్దతు, ప్రేమ ఉంటాయి. మీ అమ్మగారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను'' అని ట్వీట్ చేశారు.

ఇక ప్రపంచంపైకి చైనీయుల వరద!

- ఆంక్షల ఎత్తివేతతో ఉత్సాహం
- భారీగా విదేశీ యాత్రలకు ప్లాన్లు
- ప్రపంచ దేశాల్లో గుబులు
- టెస్టులు తప్పనిసరి చేసిన భారత్

బీజింగ్: చైనాలో ఒకవైపు కరోనా కల్లోలం విచ్చలవిడిగా కొనసాగుతూనే ఉన్నా సరిహద్దులను తెరవాలన్న ప్రభుత్వ నిర్ణయం ప్రజల్లో కొత్త జోష్ నింపుతోంది. కరోనా వెలుగు చూసిన మూడేళ్ల తర్వాత తొలిసారిగా విదేశీ ప్రయాణాలకు వీలు చిక్కేలా కనిపిస్తుండటంతో వారు సంబరపడుతున్నారు. జనవరి చివర్లో వచ్చే చైనా న్యూ ఇయర్ సంబరాల కోసం విదేశాలకు వెళ్లేందుకు ఇప్పట్నుంచే ప్లాన్ చేసుకుంటున్నారు. చైనా బుకింగ్ వెబ్‌సైట్ ట్రిప్.కామ్ తదితర సైట్లలో పలు దేశాల్లోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు మామూలు కంటే ఏకంగా పది రెట్లు ఎక్కువగా బుకింగ్‌లు జరుగుతున్నాయి! విదేశాల నుంచి వచ్చేవారికి జనవరి 8 నుంచి క్వారంటైన్ నిబంధనను చైనా ఎత్తేస్తుండటంతో పలు దేశాల్లోని చైనీయులు కూడా స్వదేశానికి వెళ్లడానికి సిద్ధపడుతున్నారు. మరోవైపు ఈ పరిణామం ప్రపంచ దేశాలకు గుబులు పుట్టిస్తోంది. చైనా పర్యాటకులతో పాటు కరోనా కూడా మరోసారి వచ్చిపడుతుందేమోనని బెంబేలెత్తుతున్నాయి. దాంతో చైనా నుంచి ప్రయాణికుల రాకపై నిషేధం విధించే అంశాన్ని అమెరికా, భారత్‌తో పాటు పలు దేశాలు చురుగ్గా పరిశీలిస్తున్నాయి. భారత్‌తో పాటు జపాన్, దక్షిణ కొరియా, తైవాన్ ఇప్పటికే చైనా ప్రయాణికులకు కరోనా పరీక్షలను తప్పనిసరి చేశాయి. కరోనాకు ముందు వరకూ అమెరికాతో పాటు పలు ఆసియా, యూరప్ దేశాలను సందర్శించే విదేశీ పర్యాటకుల్లో చైనీయుల సంఖ్యే ఎక్కువగా ఉండేది.

అంతమయ్యే లక్షణాలే!

చైనాలో కరోనా విలయం తాండవం చేస్తున్నా వైరస్ అంతమయ్యే ముందు అలాగే విధ్వంసం సృష్టిస్తుందని అక్కడి వైద్య నిపుణులంటున్నారు. ఇక కరోనా ముగిసిపోయే దశకు వచ్చేసినట్టేనని చెబుతున్నారు. దేశంలో కరోనా పరీక్షలను బాగా తగ్గించేశారని చైనా జెజాంగ్ ప్రావిన్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న భారతీయ డాక్టర్ అభిషేక్ కుందు చెప్పారు. ఆస్పత్రికి వెళ్లే పరిస్థితి వచ్చిన వారు, ఇళ్లల్లో కోవిడ్–19 కిట్ కొనుక్కొని చేసుకుంటున్నవారే తప్ప ప్రభుత్వం చేసే పరీక్షలు తగ్గిపోయాయని అన్నారు. కరోనా పాజిటివ్ వచ్చిన వారిలో అత్యధికులు కోలుకుంటున్నారని, ఇతరత్రా అనారోగ్య సమస్యలున్నవారు, వృద్ధులు మాత్రమే ప్రాణాలు కోల్పోతున్నారని డాక్టర్ కుందు వివరించారు.

నాన్నమ్మ, అమ్మ గుణగణాలు కలబోసిన అమ్మాయి కావాలి

జీవిత భాగస్వామిపై రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ● తనను ఎవరూ దూషించినా లెక్కచేయనని వెల్లడి



కాంగ్రెస్ 138వ వ్యవస్థాపక దినం సందర్భంగా బుధవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తల్లి సోనియాగాంధీతో రాహుల్ సరదా సన్నివేశం

న్యూఢిల్లీ: నాన్నమ్మ ఇందిరా గాంధీ, అమ్మ సోనియా గాంధీ గుణగణాలు కలబోసిన అమ్మాయిని తన జీవిత భాగస్వామిగా కోరుకుంటానని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ చెప్పారు. భారత్ జోడో యాత్రలో ఆయన ఓ యూట్యూబ్ చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఇంటర్వ్యూను ట్విట్టర్‌లో రాహుల్ షేర్ చేశారు. నాన్నమ్మ ఇందిరా గాంధీ తనకు రెండో తల్లి అని చెప్పారు. తనకు భార్యగా రాబోయే యువతికి మంచి లక్షణాలు ఉండాలని పేర్కొన్నారు. నాన్నమ్మ, అమ్మ లక్షణాలు కలబోసిన లక్షణాలు ఉన్న యువతిని ఇష్టపడతానని స్పష్టం చేశారు. తనను ఎవరు ఎన్ని పేర్లతో ఎగతాళి చేసినా పట్టించుకోనని తేల్చిచెప్పారు. తనను తిట్టినవారిని, కొట్టినవారిని ద్వేషించబోనని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ వేసిన పునాదుల వల్లే దేశంలో ప్రగతి: ఖర్గే

న్యూఢిల్లీ/ముంబై: దేశ మూలాలపై కేంద్ర ప్రభుత్వం తరచుగా దాడి చేస్తోందని, ద్వేషంతో సమాజాన్ని చీలుస్తోందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. బుధవారం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. నేడు దేశం అభివృద్ధి పథంలో సాగడానికి గతంలో కాంగ్రెస్ పాలనలో వేసిన పునాదులే కారణమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు కాపాడకపోతే ప్రధాని మోదీ, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు మన దేశాన్ని నియంతృత్వం వైపు నడిపిస్తాయని ఖర్గే అన్నారు. సత్యం, అహింస అనే మార్గాన్ని ఎంచుకున్న పార్టీలో ఉన్నందుకు తాను గర్వపడుతున్నానని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు.

సాక్షి
విజయనగరం
గురువారం । 29 । డిసెంబర్ । 2022



సర్కారు వారి పెళ్లి కానుక
రాష్ట్ర ప్రభుత్వం మరో హామీ అమలుకు శ్రీకారం చుట్టింది. - 8లో



హోరాహోరీగా రంజీ మ్యాచ్
విజయనగరం జిల్లా వేదికగా జరుగుతున్న ఆంధ్రా–మహారాష్ట్రల మధ్య రంజీ మ్యాచ్ హోరా..హోరీగా సాగుతోంది - 8లో



జిల్లా జట్టు పయనం
రాష్ట్రస్థాయిలో కడప జిల్లా ప్రొద్దుటూరులో జరగనున్న స్కూల్ గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా క్రీడాకారులు బుధవారం పయనమయ్యారు. - 8లో

న్యూస్‌రీల్

నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు రేపు

విజయనగరం: అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ నెట్‌బాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 30న నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ బుధవారం తెలిపారు. అండర్ - 14, 17 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి గంట్యాడ మండలం పెదమజ్జిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అర్హత గల క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆ రోజు జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

డీఐఓగా బాధ్యతలు స్వీకరించిన జగదీష్



విజయనగరం ఫోర్ట్: జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి(డీఐఓ)గా డాక్టర్ జగదీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఐఓగా పని చేసిన డాక్టర్ నారాయణ ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టించారనే అభియోగంపై ప్రభుత్వం సస్పెండ్ చేసింది. దీంతో ఆయన స్థానంలో జగదీష్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ శతశాతం వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.

31లోగా అఫిలియేషన్ పూర్తి చేయాలి

విజయనగరం ఫూల్‌బాగ్: 2023 - 24 విద్యా సంవత్సరానికి సంబంధించి అఫిలియేషన్ అప్లికేషన్‌ను ఆన్‌లైన్‌లో ఈ నెల 31లోగా సమర్పించాలని ఆర్‌ఐఓ మజ్జి సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా 117 కళాశాలలకు గాను 22 కళాశాలలు అఫిలియేషన్ అప్లికేషన్‌ను మొదలు పెట్టలేదని తెలిపారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆలస్యం చేయకుండా వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే 2023 - 24 విద్యా సంవత్సరానికి ఆయా కళాశాలల అఫిలియేషన్ పూర్తిగా నిలిపివేయబడుతుందని హెచ్చరించారు.

30న కౌన్సెలింగ్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వేతర నర్సింగ్ స్కూల్స్ నందు జనరల్ నర్సింగ్, మిడ్వైఫరి, స్టాఫ్‌నర్స్ ట్రెనింగ్ స్కూల్స్‌లో 3 సంవత్సరాల శిక్షణ కోర్సులో చేరేందుకు ఈ నెల 30వ తేదీన ఉదయం 10.30 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వీ రమణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

సఖితో సేఫ్

సఖి..ఈ పేరు వింటేనే బాలికలు, యువతులకు ఓ ధైర్యం... ఓ భరోసా... జిల్లాలో కలెక్టర్ ఆలోచనతో అమలవుతున్న సఖి కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. అనుకున్న లక్ష్యాలను సాధిస్తూ ముందుకు దూసుకుపోతోంది.



బాలికలకు అవగాహన కల్పిస్తున్న వైద్య శాఖ సిబ్బంది

- బాలికలకు అభయం సఖి
- విద్య, ఆరోగ్యం, ఆర్థిక స్వావలంబనే లక్ష్యాలు
- జిల్లాలో మొత్తం 3,272 సఖి గ్రూపుల ఏర్పాటు
- 89 వేల మంది బాలికలు, యువతులు సభ్యులుగా చేరిక
- కలెక్టరు సూర్యకుమారి చొరవతో సత్ఫలితాలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

సఖి గ్రూపులు... బాలికలకు విద్య, ఆరోగ్యాన్ని అందించడమేగాక వారు ఆత్మవిశ్వాసంతో ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా అడుగులు వేయించడమే వాటి ప్రధాన లక్ష్యం. అత్యంత కీలకమైన కౌమార దశలో వచ్చే శారీరక, మానసిక మార్పుల పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడం, సమాజంలో ఎదురయ్యే సవాళ్లను తట్టుకొనే విధంగా వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడం కూడా ముఖ్య ఉద్దేశం. ఇది మన జిల్లాకే ప్రత్యేకమైన కార్యక్రమం. కలెక్టరు ఎ. సూర్యకుమారి చొరవతో సత్ఫలితాలను ఇస్తోంది. ప్రతీ గ్రామంలో తొమ్మిది నుంచి 21 ఏళ్ల మధ్య వయసు ఉన్న బాలికలు, యువతులతో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి గ్రూపులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ గ్రూపుల్లో 89,091 మంది సభ్యులుగా ఉన్నారు. ఆయా గ్రామంలో ఉన్న ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్త, ఆశా కార్యకర్త, మహిళా రక్షణ పోలీసు, మహిళా ఉపాధ్యాయులు, ఏవైనా వలంటీర్లు పర్యవేక్షిస్తున్నారు. ప్రతీ నెలా ఈ గ్రూపు సమావేశమవుతోంది. నైపుణ్యాల పెంపు, పౌష్టికాహారం, తల్లిపాల ఆవశ్యకత, రక్తహీనత నివారణ, బాల్య వివాహాల నిర్మూలన, స్వీయ రక్షణ, ప్రభుత్వ సేవలు, భవిష్యత్తు ప్రణాళికలు తదితర విషయాలపై చర్చిస్తున్నారు. కౌమార దశలో బాలికల సమస్యలపై కూడా దృష్టి సారిస్తున్నారు. బాలికల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడం, ప్రభుత్వం నిర్ణయించిన వివాహ కనిష్ఠ వయసును పాటించేలా చూడటం, లింగ సమానత్వం, ఈవ్ టీజింగ్ నిరోధం, వ్యక్తిగత స్వేచ్ఛ, పోక్సో, గృహ హింస నిరోధం తదితర చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. బాలికలు తమ తల్లితండ్రులకు సైతం చెప్పుకోలేని ఎన్నో వ్యక్తిగత సమస్యలను సైతం తమ గ్రూపు సభ్యులతో పంచుకోవడం సానుకూల పరిణామం. తద్వారా ఆయా సమస్యల పరిష్కారానికి తోటి సభ్యుల ద్వారా కృషి చేయడానికి వీలు ఏర్పడుతోంది. బాల్య వివాహాలను గుర్తించి, వాటిని అరికట్టేందుకు సఖి గ్రూపులు చర్యలు తీసుకుంటున్నాయి. ఇలా ఇప్పటివరకు జిల్లాలో 108 బాల్య వివాహాలను ఈ గ్రూపు సభ్యులు అడ్డుకున్నారు.

జిల్లాలో సఖి గ్రూపులు ఇలా....	
మొత్తం గ్రూపులు	3,272
గ్రూపుల్లో సభ్యుల సంఖ్య	89,091
9-10 ఏళ్ల మధ్య వయస్సు వారు	14,843
11-14 ఏళ్ల మధ్య వయస్సు వారు	29,768
15-18 ఏళ్ల మధ్య వయస్సు వారు	29,377
19-21 ఏళ్ల మధ్య వయస్సు వారు	15,103
సఖి గ్రూపులు సాధించిన విజయాలు	
అడ్డుకున్న బాల్య వివాహాలు	108
బడుల్లో చేర్పించినవారి సంఖ్య	613
ఇప్పటివరకు నిర్వహించిన సమావేశాలు	37,114
సభ్యులకు నిర్వహించిన ఆరోగ్య పరీక్షలు	74,760

సఖి గ్రూపు సభ్యులకు శిక్షణ

సఖి గ్రూపు సభ్యులను శారీరకంగా, ముఖ్యంగా కిశోర బాలికలను మానసికంగా తీర్చిదిద్దడానికి యోగా తప్పనిసరి చేశారు. దీనికోసం శిక్షణ ఇచ్చారు. ఈవ్ టీజింగ్ లాంటి అనుచిత సంఘటనలను ఎదుర్కొనడానికి, ఆత్మ రక్షణ కోసం కరాటే తదితర మార్షల్ ఆర్ట్స్ కూడా కొన్ని చోట్ల నేర్పిస్తున్నారు. ఇప్పటివరకు 74,760 మంది గ్రూపు సభ్యులకు ఆరోగ్య పరిస్థితిని పరీక్షించారు. మరోవైపు వారంతా ఆర్థిక సాధికారత సాధించేలా డీఆర్‌డీఏ, మెప్మా ఆధ్వర్యంలో వివిధ వృత్తి విద్యల్లో శిక్షణ ఇస్తున్నారు. ఆదర్శవంతమైన సమాజమే లక్ష్యంగా ఏర్పాటైన సఖి గ్రూపుల నిర్వహణ, సభ్యులకు వివిధ అంశాల పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, వైద్యారోగ్య శాఖ, విద్యాశాఖ, పోలీసు శాఖలతో పాటు యునిసెఫ్ కీలక పాత్ర పోషిస్తోంది.

ప్రతి నెలా సమావేశాలు తప్పనిసరి

వివిధ స్థాయిల్లో నెలవారీ సమావేశాలను సఖి గ్రూపులు తప్పనిసరిగా నిర్వహిస్తున్నారు. ప్రతీ నెలా మొదటి శనివారం మండల స్థాయిలో, మూడో శనివారం జిల్లా స్థాయిలో, 4వ శనివారం గ్రామ, వార్డు స్థాయిలో నిర్వహించాలి. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 37,114 సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో సభ్యులకు నైతిక విలువలను పాటించడం, గర్భిణులు, పిల్లలు, నవజాత శిశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, 'దిశ' యాప్‌ను ఉపయోగించడం, ఒన్ స్టాప్ సెంటర్, ప్రభుత్వ టోల్ ఫ్రీ నంబర్లు, పథకాలపై అవగాహన కల్పించడం ప్రధాన అజెండా. ముఖ్యంగా ప్రతీ ఒక్కరికీ విద్య అందించాలన్న బృహత్తర లక్ష్యాన్ని సాధించేందుకు ఈ గ్రూపులు కృషి చేస్తున్నాయి. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి తిరిగి బడిలో చేర్పించడంపై దృష్టి కేంద్రీకరించారు. అలా 613 మందిని బడుల్లో చేర్పించారు.

సఖి సభ్యులకు సంపూర్ణ సహకారం



సఖి గ్రూపుల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తున్నాం. మహిళా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలను గ్రూపు సమావేశాలకు ఆహ్వానిస్తున్నాం. ఆయా గ్రామాల్లో కొత్తగా వివాహమైన యువతులతో కూడా ప్రత్యేకంగా సఖి గ్రూపులను ఏర్పాటు చేయిస్తున్నాం. వారికి వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం తీసుకోవడం, గర్భం దాల్చే సమయం, మాతా శిశు సంరక్షణ, హెచ్‌ఐవీ, ఇతర లైంగిక వ్యాధులు తదితర విషయాలపట్ల అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ఈ గ్రూపులను మరింత సమర్థంగా నిర్వహించేందుకు, సమగ్ర పర్యవేక్షణ కోసం మండల స్థాయిలో ఎంపీడీవోలను, మున్సిపాల్టీల్లో కమిషనర్లను కన్వీనర్లుగా నియమించాం. సభ్యులకు సంపూర్ణ సహకారం అందిస్తున్నాం. ఉత్తమ సఖి గ్రూపులకు బహుమతులతో ప్రోత్సహిస్తున్నాం.

– ఎ.సూర్యకుమారి, జిల్లా కలెక్టర్



సఖి గ్రూపు సభ్యులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ సమీర్‌శర్మ (ఫైల్)



ప్రతిభ చూపిన సఖి సభ్యులకు బహుమతులు అందిస్తున్న కలెక్టరు ఎ.సూర్యకుమారి (ఫైల్)

అర్హులందరికీ పింఛన్

- పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వివేది



డెంకాడ: పెదతాడివాడ గ్రామ సచివాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ గోపాలకృష్ణ ద్వివేది

పూసపాటిరేగ: అర్హత వున్న ప్రతి ఒక్కరికి ఫింఛన్ మంజూరు చేస్తున్నామని, కొంత మంది పింఛన్లను ప్రభుత్వం తొలిగిస్తుందని చేస్తున్న పుకార్లు నమ్మవద్దని పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలెప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది అన్నారు. మండలంలోని కొప్పెర్ల సచివాలయాలను ఆయన బుధవారం సందర్శించారు. ఆయా సచివాలయాల్లో అందుతున్న సేవలపై ఆరా తీశారు. సచివాలయంలో ప్రజలకు అందుతున్న సేవలపై అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. బరువు తక్కువ వున్న చిన్నారుల ఆరోగ్యంపై ఆరా తీశారు. రక్తహీనత వున్న చిన్నారులు, మహిళలను గుర్తించి ప్రత్యేక వైద్యసేవలు అందించాలని సూచించారు. వ్యవసాయ రంగానికి సంబంధించి భూసార పరీక్షలు చేసి, ఎరువులు వాడకం తగ్గించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. పాత కొప్పెర్లలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం విషయం తెలుసుకొని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్వరలో సచివాలయం సిబ్బంది జాబ్‌చార్ట్ మారుతోందన్నారు. గ్రేడ్-5 కార్యదర్శులకు పదోన్నతులు ఇస్తామన్నారు. సఖి గ్రూపులను బలోపేతం చేసి సేవలను మరింత విస్తృతం చేయాలని మహిళా పోలీసులను ఆదేశించారు. జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు పోస్టులు ఖాళీలు వివరాలు పంపించాలని డీపీఓ నిర్మలాదేవిని ఆదేశించారు.

పాత పద్ధతిలోనే ధ్రువపత్రాలు

గ్రామాల్లో గ్రామకంఠాల భూములకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు పాత పద్ధతుల్లోనే ధ్రువపత్రం మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి విధి విధానాలు వచ్చే వరకు పాత పద్ధతిలోనే గ్రామకంఠాల భూములకు విచారణ చేసి ధ్రువపత్రాలు ఇవ్వాలన్నారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి, జిల్లా పంచాయతీ అధికారి జి.ఎస్.నిర్మలాదేవి, డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఈఓపీఆర్‌డీ శ్రీనువాసరావు, వైద్యాధికారి రాజేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

డెంకాడ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో ఎలాంటి జాప్యం జరగకూడదని రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ గోపాలకృష్ణ ద్వివేది అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పెద్ద తాడివాడ గ్రామ సచివాలయాన్ని ఆయన సందర్శించారు. గ్రామ సచివాలయ ఉద్యోగులతో ద్వివేది మాట్లాడారు. గ్రామ సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు జగదీశ్వరరావు, బంగారు రాజు ఆధ్వర్యంలో గోపాలకృష్ణ ద్వివేదిని సత్కరించారు. ఆయన వెంట జేసీ మయూర్ అశోక్, పలువురు జిల్లా అధికారులు, ఎంపీడీఓ స్వరూపారాణి పాల్గొన్నారు.

నిర్ణీత వ్యవధిలోగా రీసర్వే



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

- రోజుకు 200 ఎకరాలు సర్వే జరగాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: ప్రతీ గ్రామానికి నిర్ణీత కాలవ్యవధిని నిర్ణయించుకొని రీసర్వే ప్రక్రియను పూర్తిగా చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. సర్వే ప్రక్రియ అత్యంత పకడ్బందీగా పారదర్శకంగా కచ్చితమైన లెక్కలతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రీ సర్వే ప్రక్రియను సంబంధించి ఆర్‌డీఓలు, వివిధ మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లతో బుధవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల వారీగా సర్వే ప్రక్రియను సమీక్షించారు. గ్రౌండ్ ట్రూతింగ్, రికార్డు వర్కు, మిస్సింగ్ డేటా, రోవర్ పనులు, బృందాల వారీగా పనితీరుపై ఆరా తీశారు. ప్రతి మండలంలో ఒక్కో బృందం రోజుకు ఎన్ని ఎకరాలను సర్వే చేస్తుందో తెలుసుకున్నారు. పని నెమ్మదిగా జరుగుతున్న మండలాల అధికారులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సర్వే ప్రక్రియలో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు. రీసర్వే ప్రక్రియ ప్రభుత్వం చేపట్టిన అత్యంత ప్రతిష్ఠాత్మక, కీలక కార్యక్రమమని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరి రోజువారీ ప్రగతి అంతా ఆన్‌లైన్‌లో కనిపిస్తుందని చెప్పారు. తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ వహించి, తమ పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా, సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ కోరారు. జేసీ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఒక్కో మండలంలో రోజుకు కనీసం 200 ఎకరాలు పూర్తయ్యే విధంగా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, సర్వే శాఖ ఏడీ త్రివిక్రమరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

- రాష్ట్రంలో 5 కోట్ల మందికి సంక్షేమ పథకాలు అవసరం
- రానున్న ఎన్నికల్లో పథకాలే ప్రభుత్వాన్ని నిలబెడతాయి
- ప్రభుత్వంపై చంద్రబాబు కుట్రలను తిప్పికొట్టాలి
- మంత్రి బొత్స సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ, పక్కన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

నెల్లిమర్ల/డెంకాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీకి శ్రీరామరక్ష అని, రానున్న ఎన్నికల్లో పథకాలే పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాయని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. డెంకాడ మండలంలోని మోపాడ గ్రామంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన నెల్లిమర్ల నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న బొత్స పార్టీ కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలోని 5 కోట్ల మందికి సంక్షేమ పథకాలు అవసరమన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకునే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. గత మూడున్నరేళ్లలో జిల్లా ప్రజలకు రూ. 9 వేల కోట్లు సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అందజేసిందన్నారు. కేవలం నెల్లిమర్ల నియోజకవర్గానికే రూ.1000 కోట్లు వివిధ పథకాల ద్వారా అందజేశామన్నారు. జగన్‌ను మళ్లీ సీఎంగా చెయ్యడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. ఆ దిశగా పార్టీని మరింత బలోపేతం చేయడానికి సచివాలయాల పరిధిలో కన్వీనర్ల నియామకం చేపట్టామన్నారు. వచ్చే నెలలో గృహ సారథులను నియమించడం జరుగుతుందని చెప్పారు. ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు వృద్ధులు, వితంతువులకు అందజేసే సామాజిక పింఛను మొత్తాన్ని రూ.2750కి పెంచినట్లు తెలిపారు. పెంచిన మొత్తాన్ని వచ్చే నెలలో వలంటీర్లు అందజేస్తారని తెలిపారు. వలంటీర్లతో పాటు పార్టీ కన్వీనర్లు పింఛను లబ్ధిదారులను కలిసి, సీఎం సందేశంతో కూడిన లేఖలను అందజేయాలని మంత్రి సూచించారు. వచ్చే నెల 29న వైఎస్సార్ ఆసరా పథకం కింద డ్వాక్రా మహిళల రుణమాఫీ మొత్తాన్ని ప్రభుత్వం ఖాతాల్లో జమ చేస్తుందని చెప్పారు. 29వ తేదీలోగా పార్టీ గృహ సారథులుగా ఇద్దరు చురుకైన కార్యకర్తలను నియమించాలని సూచించారు.

చంద్రబాబు మెమరీ చిప్ పోయింది

టీడీపీ అధినేత చంద్రబాబు బ్రెయిన్‌లోని మెమరీ చిప్ పోయిందని, అందుకే పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని మంత్రి బొత్స సత్యనారాయణ ఎద్దేవా చేశారు. జిల్లా పర్యటనలో ఆయన మాట్లాడిన మాటలే ఇందుకు నిదర్శనమన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని ఆరుగురు బీసీ ఎమ్మెల్యేలను పక్కనబెట్టి అశోక్ జగపతిరాజుకు, బొబ్బిలి రాజుకు మంత్రి పదవులు కట్టబెట్టడం బీసీల పట్ల ఆయనకు ఎంత ప్రేమ ఉందో తెలియజేస్తోందని విమర్శించారు. బీసీలకు ప్రాధాన్యం ఇవ్వబట్టే రాజకీయ పదవుల్లో 50 శాతం పదవులను సీఎం జగన్ మోహన్‌రెడ్డి బీసీలకు కేటాయించారని చెప్పారు. సమావేశంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, సౌత్ సెంట్రల్ రైల్వే సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, నాలుగు మండలాల ఎంపీపీలు బంటుపల్లి వాసుదేవరావు, అంబళ్ల సుధారాణి, మహంతి కళ్యాణి, ఉప్పాడ అనూషరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు గదల సన్యాసినాయుడు, బడుకొండ లక్ష్మి, మహంతి సీతాలక్ష్మి, పార్టీ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, చనమల్లు వెంకటరమణ, పతివాడ అప్పలనాయుడు, ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనక సింహాచలం, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలది అధికార దాహం



టీడీపీ నేతలకు అధికార దాహం పట్టుకుంది. అందుకే పిచ్చిపిచ్చి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తే ఖర్చు అని అంటున్నారు. టీడీపీ నేతల మాటలను ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలి. ప్రభుత్వం అన్నివర్గాల వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది.

– బడ్డుకొండ అప్పలనాయుడు, నెల్లిమర్ల ఎమ్మెల్యే

చంద్రబాబు వస్తే సంక్షేమ పథకాలు ఉండవు



టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు పూర్తిగా ఎత్తేస్తారు. అధికార దాహంతోనే ప్రభుత్వంపై చంద్రబాబు లేనిపోని నిందలు, అపవాదులు వేస్తున్నారు. ఆయనకు మతిమరుపు రాబట్టే సైకిల్ పోవాలని బహిరంగ సభలో పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో బడ్డుకొండను ఎమ్మెల్యేగా, జగన్ మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించడానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలి.

– డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు, ఎమ్మెల్సీ

టీడీపీ నేతలవి అబద్ధాలు



అధికారంలోకి రావాలనే ఉద్దేశంతో టీడీపీ నేతలు లేనిపోని అబద్ధాలు ఆడుతున్నారు. 2014 ఎన్నికల్లో 600 హామీలిచ్చిన చంద్రబాబు ఒక్కటి కూడా నెరవేర్చలేదు. వచ్చే నెల 29న డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం కింద రుణమాఫీ మొత్తం జమవుతుంది. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోంది. భూ సర్వేను దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ అమలు చేయాలని నీతి ఆయోగ్ యోచిస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటింటికీ వైద్యం అందుతోంది. రూ.400 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోంది. త్వరలోనే భోగాపురం విమానాశ్రయం నిర్మాణానికి శంకుస్థాపన కూడా జరుగుతుంది.

– బెల్లాన చంద్రశేఖర్, పార్లమెంట్ సభ్యుడు

సీఎం సందేశాన్ని ప్రతి ఇంటికీ చేరవేయాలి



సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సందేశాన్ని నియోజకవర్గంలోని 79 సచివాలయాల పరిధిలో నియమించిన పార్టీ కన్వీనర్లు ప్రతి ఇంటికీ చేరవేయాలి. పార్టీ అభివృద్ధికి నాయకులు, కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయంతో పని చేయాలి. భోగాపురం విమానాశ్రయానికి సంబంధించి కోర్టు కేసులు తొలగిపోవడంతో త్వరలోనే శంకుస్థాపన చేస్తాం. అలాగే రామతీర్థసాగర్ సాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం తాజాగా రూ.198 కోట్ల మంజూరు చేసింది. దీంతో ప్రాజెక్టు నిర్మాణం చురుగ్గా సాగుతోంది. మరోవైపు తోటపల్లి అదనపు ఆయకట్టుకు నీరందించడానికి ప్రభుత్వం రూ 122కోట్లు మంజూరుచేయగా నెల్లిమర్ల నియోజకవర్గంలో రూ.60 కోట్లతో కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన కూడా చేశాం. జిల్లాలో ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటిని అందించడానికి రూ 200 కోట్లతో పనులు చేపడుతున్నాం.

– మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

ఏఓబీలో మావోయిస్టుల ప్రాబల్యం తగ్గింది

- విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ



వన్‌టౌన్, సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లను పరిశీలిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ, ఎస్పీ

విజయనగరం క్రైమ్: పోలీసు శాఖ చేపడుతున్న పటిష్ట చర్యల వలన ఏఓబీలో మావోయిస్టుల ప్రాబల్యం తగ్గిందని విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌ను ఆయన జిల్లా ఎస్పీ ఎం.దీపికతో కలిసి బుధవారం రాత్రి సందర్శించారు. రికార్డులు, స్టేషన్ ప్రాంగణం, లాకప్, సీడీ ఫైల్స్‌ను పరిశీలించారు. పెండింగులో ఉన్న కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని సకాలంలో కోర్టులో అభియోగపత్రాలను దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాలు, మహిళల భద్రత, లోన్‌యాప్‌ల మోసాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, నేరాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రా – ఒడిశా సరిహద్దుల్లో పోలీసులు చేపడుతున్న అవగాహన, సంక్షేమ కార్యక్రమాలు, నిరంతరం పోలీస్ పర్యవేక్షణతో చాలామంది జనజీవన స్రవంతిలోకి కలిశారన్నారు. జిల్లా పోలీస్‌శాఖలో ఉన్న ఖాళీలను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. వార్షిక తనిఖీల్లో డీఐజీ వెంట ఎస్పీ ఎం.దీపిక, ఇన్‌చార్జి డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

5 పశువుల శాలలు దగ్ధం


అగ్నికి ఆహుతైన పశువులశాలలు

బాడంగి: మండలంలోని రేజేరు గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన అగ్నిప్రమాదంలో గ్రామంలోని 5 పశువులశాలలు కాలిపోగా గేదె, గేదె పెయ్యికి తీవ్రగాయాలయ్యాయి. అర్ధరాత్రి అందరూ ఆదమరచి నిద్రించిన సమయంలో జరిగిన ఈ ప్రమాదానికి కారణాలు స్పష్టంగా తెలియరాలేదు. రెడ్డి లక్ష్మం, వెంకటరమణ, సత్యనారాయణ, బొమ్మిసింహాచలం, లక్ష్మణరావులకు చెందిన పశువులశాలలు కాలిబూడిదయ్యాయి. పశువుల శాలల్లో ఎద్దులు, గేదెలు , దూడలున్నాయని వాటిలో ఓ గేదె, దూడల చర్మం బాగా కాలిపోయిందని బాధితులు చెప్పారు. బొబ్బిలినుంచి అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో ఆస్తినష్టం సుమారు రూ.50 వేలు ఉంటుందని రెవెన్యూ అధికారుల అంచనా. గాయపాలైన పశువులకు వాడాడ పశువైద్యాధికారి రాధిక, సంచార పశువైద్యసేవ డాక్టర్ మన్మథరావు సిబ్బంది చికిత్స చేశారు.

హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవం

మెంటాడ: మండలంలోని ఆగూరు గ్రామ పంచాయతీ మధురగ్రామమైన సంగం గుడ్డివలసలో ఆగస్టు 28, 2017వ సంవత్సరంలో గుమ్మల పొట్టయ్య హత్య కేసులో ముద్దాయికి కోర్టు యావజ్జీవ జైలు శిక్ష విధించింది. ఈ కేసు విచారణ అనంతరం కొర్రా చిన్నయ్యను ముద్దాయిగా నిర్ధారించి విజయనగరం జిల్లా కోర్టు న్యాయమూర్తి సాయికల్యాణ చక్రవర్తి గురువారం తీర్పునిచ్చినట్లు సీఐ ఎల్.లీలారావు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్యా యత్నం

● రక్షించిన ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది


సత్తెమ్మకు టీ ఇస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

గంట్యాడ: మండలంలోని బోనంగి గ్రామానికి చెందిన వృద్ధురాలు మునపాక సత్తెమ్మ (80) కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. కృష్ణాజిల్లాలో కృష్ణా నది దుర్గా ఘాట్ వద్ద నీటిలో మునిగి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించగా అక్కడే ఉన్న ఎస్‌డీఆర్‌ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ మురళీ కృష్ణ, కానిస్టేబుల్ శివయ్యలు ఆమెను రక్షించి ఒడ్డుకు చేర్చి సపర్యలు చేసి వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

పార్వతీపురం: మండలంలోని చినబొండపల్లి గ్రామ శివారున బుధవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. ఈ మేరకు చికిత్స కోసం 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించగా ఆ వ్యక్తి అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పార్వతీపురం రూరల్ ఎస్సై వై.సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఫోన్ 9121109468 నంబర్‌కు తెలియజేయాలని ఎస్సై కోరారు.

కల్వర్టులో మృతదేహం

సీతానగరం: మండలంలోని జోగింపేట సమీపంలో రాష్ట్ర రహదారిని ఆనుకుని ఉన్న కల్వర్టులో ఓ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మండలంలోని నీలకంఠాపురం గ్రామానికి చెందిన నిడగంటి గౌరు(40) మూడు రోజుల క్రితం గ్రామం నుంచి మద్యం మత్తులో బయటకు వెళ్లి ఇంటికి చేరలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ తెలియరాలేదు. ఇదిలా ఉండగా పోలీసులు విధి నిర్వహణలో భాగంగా బుధవారం జోగింపేట వెళ్లి కల్వర్టు వద్ద మృతదేహం ఉన్నట్లు గమనించారు. మృతదేహాన్ని చూసి షర్టు జేబ్‌లో ఉన్న ఆధార్‌కార్డు, బ్యాంక్ బుక్ పరిశీలించగా నీలకంఠాపురం గ్రామానికి చెందిన నిడగంటి గౌరుగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమివ్వగా వచ్చి గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.నీలకంఠం తెలిపారు.

సర్కారు వారి పెళ్లి కానుక

- పేదల వివాహానికి నగదు సాయం
- వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా అమలుకు చర్యలు
- అక్టోబర్ నుంచి డిసెంబర్ నెలల మధ్య జరిగిన వివాహాల నమోదు
- ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అర్జీల పరిశీలన


వివాహ వేడుకలో వధూవరులు (ఫైల్)

పాలకొండ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మరో హామీ అమలుకు శ్రీకారం చుట్టింది. పేద, బడుగు బలహీన, మైనారిటీ వర్గాలకు చెందిన యువతుల వివాహాలకు ప్రభుత్వం వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా ద్వారా ఆర్థిక సహాయం అందచేయడానికి చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి గ్రామ సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించగా ఇప్పటి వరకు జిల్లాలో 8 దరఖాస్తులు అందాయని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వాటి పరిశీలన జరుగుతోంది. అన్ని స్థాయిల్లో సమగ్ర పరిశీలన పూర్తయిన తరువాత ఆధికారిక ఆమోదం కోసం కలెక్టర్ వద్దకు దరఖాస్తులు చేరుతాయి.

దరఖాస్తు చేయడం ఇలా..

వివాహం జరిగిన 60 రోజుల లోపు ఆయా గ్రామ సచివాలయాల్లో నమోదు చేయించుకోవాలి. ఇందుకు వివాహ ధ్రువపత్రాలు నిబంధనల మేరకు దరఖాస్తులో పొందుపర్చాలి. ముఖ్యంగా పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెల పెళ్లి పత్రికలు, పెళ్లి సమయంలో తీయించిన ఫొటోలు, మ్యారేజ్ సర్టిఫికెట్, ఆధార్, కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రంతో పాటు పెళ్లి కూతురు బ్యాంక్ ఖాతా జిరాక్స్ అందించాల్సి ఉంటుంది. అలాగే వధూవరుల చదువుకు సంబంధించి పదవ తరగతి ఉత్తీర్ణత ధ్రువపత్రాలు దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది. భవన నిర్మాణ కార్మికులు సభ్యత్వ ధ్రువీకరణ పత్రం కూడా సమర్పించాలి. ఇప్పటికే వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది తమ పరిధిలో సంఘాల సభ్యుల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

కులాలు	ఆర్థిక సాయం
ఎస్సీ	రూ.లక్ష
కులాంతర వివాహం	రూ.లక్షా 20 వేలు
ఎస్టీలు	రూ.లక్ష
బీసీలు	రూ.50 వేలు
బీసీ కులాంతర	రూ.75వేలు
దివ్యాంగ	రూ.లక్షా 50 వేలు
భవన నిర్మాణ కార్మికులు	రూ.40 వేలు

సద్వినియోగం చేసుకోండి



పేదల వివాహాలకు ఆర్థిక సాయం అందజేయడానికి వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. కులాల వారీగా ఆర్థిక సహాయం అందజేస్తుంది. కులాంతర వివాహాల ప్రోత్సాహానికి కూడా అదనపు ఆర్థిక సాయం అందుతుంది. వివాహాలు అయిన వెంటనే దంపతులు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ముందుగా వివాహ సర్టిఫికెట్ సచివాలయాల ద్వారా పొందాలి.

వై.సత్యంనాయుడు, ఏపీడీ డీఆర్‌డీఏ,
పార్వతీపురం మన్యం జిల్లా

‘శ్రేష్ట’పై అవగాహన కల్పించండి

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశాలు


మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం పరిధిలో అమలయ్యే శ్రేష్ట పథకం గురించి, అందులో చేరేందుకు నిర్వహించే జాతీయ అర్హత గురించి విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించాలని వివిధ విభాగాల అధికారులను కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ ఆదేశాలను అనుసరించి సీబీఎస్‌ఈ సిలబస్ బోధించే పాఠశాలలు, జూనియర్ కళాశాలలను ఎంపిక చేయాలని పేర్కొన్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు విద్యాభ్యాసం చేసేందుకుగాను ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన బాల,బాలికల ప్రయోజనార్థం అమలు చేస్తున్న ఈ పథకం ఫలాలు వారికి దక్కేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. 2023–24 విద్యా సంవత్సరంలో చేరేందుకుగాను వచ్చే ఏప్రిల్ మాసంలోగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జాతీయ అర్హత పరీక్ష ఉంటుందని సంబంధిత పరీక్షకు ఆయా పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులను గుర్తించి తర్ఫీదు ఇవ్వాలని ఆదేశించారు. శ్రేష్ట పథకంలో భాగంగా 9వ తరగతి విద్యార్థులకు 2,500 సీట్లు, ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 500 సీట్లు మొత్తం 3 వేల సీట్లు జాతీయ స్థాయిలో అందుబాటులో ఉంటాయని వాటిలో అత్యధికంగా జిల్లా విద్యార్థులు సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్‌తో పాటు ఇతర ఆర్థిక సహాయం లభిస్తుందని వాటన్నింటిపైనా విద్యార్థులు, సంబంధిత విద్యా సంస్థల నిర్వాహకులకు వివరించాలని ఇంటర్మీడియట్, పాఠశాల విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఈ మేరకు సంబంధిత ఉత్తర్వులను జారీ చేశారు.

హోరాహోరీగా రంజీ మ్యాచ్

విజయనగరం: జిల్లా వేదికగా జరుగుతున్న ఆంధ్రా–మహారాష్ట్రల మధ్య రంజీ మ్యాచ్ హోరా..హోరీగా సాగుతోంది. డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో జరుగుతున్న మ్యాచ్‌లో ఇరు జట్ల క్రీడాకారులు పోటీపోటీగా తలపడుతున్నారు. 23 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 58 పరుగుల ఓవర్ నైట్ స్కోరు వద్ద రెండవ రోజు మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు మొత్తం 79 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌటైంది. బ్యాటింగ్‌లో కరణ్ షిండే 151 బంతుల్లో 52 పరుగులు, కెప్టెన్ హనుమవిహారి 102 బంతుల్లో 49 పరుగులతో రాణించారు. బౌలింగ్‌లో మహారాష్ట్ర క్రీడాకారులు ఎస్ఎస్ బచ్చావ్ 3 వికెట్లు, పీసీ దాదే 3 వికెట్లు దక్కించుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన మహారాష్ట్ర జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 27 ఓవర్లలో వికెట్ నష్టపోయి 89 పరుగులు చేసింది. మహారాష్ట్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 200 పరుగులు చేసిన విషయం విదితమే.

ఒకే రోజు ట్రాక్టర్, రోటోవేటర్ చోరీ

రణస్థలం: ఒకేరోజు రాత్రి వేర్వేరు ప్రాంతాల్లో ట్రాక్టర్, రోటోవేటర్ చోరీకి గురయ్యాయి. దీనిపై అందిన ఫిర్యాదులతో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. జె.ఆర్.పురం పంచాయతీ సీతంవలస గ్రామంలో కోల జనార్దనరావు తన కల్లంలో ఉంచిన పొలం దుక్కిదున్నే రోటోవేటర్ (శక్తిమాన్)ను ఈ నెల 24వ తేదీ రాత్రి సమయంలో దొంగలు అపహరించుకుపోయారు. తెల్లవారుజామున చూసేసరికి రూ. 1.30 లక్షల విలువైన రోటోవేటర్ కనిపించకపోవడంతో రైతు ఆందోళన చెందాడు. చుట్టు పక్కల వారిని అడిగినా ఫలితం లేకుండా పోయింది. జె.ఆర్.పురం మండల కేంద్రంలో జాతీయ రహదారి పక్కన ఉన్న స్నేహితుల దుకాణంలో సీసీ ఫుటేజీలు పరిశీలించగా దొంగలు ట్రాక్టర్‌తో వచ్చి రోటోవేటర్ శనివారం రాత్రి ఒంటి గంట సమయంలో దొంగలించి లావేరు వైపు వెళ్లినట్లు నిర్ధారణకు వచ్చారు. దీంతో లావేరు మండల కేంద్రం, వెంకటాపురం, ఇజ్జాడ పాలెం పరిసర ప్రాంతాల్లోని పెట్రోల్ బంకుల్లోని సీసీ కెమెరాల్లో పరిశీలించగా..రోటోవేటర్‌ను ఏపీ–39టీ 2945 నంబర్‌తో ఉన్న ట్రాక్టర్‌తో తీసుకొని వెళ్లిపోయినట్టు గుర్తించారు. దీంతో ట్రాక్టర్ నంబర్ వివరాలు నెట్‌లో చూసి సంబంధిత వ్యక్తికి పోలీసులు ఫోన్ చేశారు. అయితే వారు ఆశ్చర్యపోయే సమాధానం అటునుంచి వచ్చింది. అదే శనివారం రాత్రి 9 గంటల సమయంలో తన ట్రాక్టర్ చోరీకి గురైందని విజయనగరం జిల్లా భోగాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు పోలిపల్లి సర్పంచ్ కర్రోతు వెంకటరమణ తెలియజేశారు. రూ. 7.30 లక్షల విలువైన ట్రాక్టర్‌ను ఏడాది క్రితమే కొనుగోలు చేసినట్టు చెప్పి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ తెలిపారు.

శంబరలో చురుగ్గా పారిశుద్ధ్య పనులు


మినీ జేసీబీ సహాయంతో కాలువల్లో మురుగును తొలగిస్తున్న దృశ్యం


అమ్మవారి ఘటాలకు పూజలు చేస్తున్న భక్తురాలు

మక్కువ: మండలంలోని శంబర గ్రామంలో పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో పారిశుద్ధ్యపనులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. వచ్చేఏడాది జనవరి, 23,24,25వ తేదీలలో ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతర జరగనున్నందున ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలోని అన్ని కాలువల్లో మురుగును జేసీబీ సహాయంతో తొలగిస్తున్నారు. జాతరకు వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా, ఎంపీడీవో పి.దేవకుమార్ పర్యవేక్షణలో పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య పనులు జరిపిస్తున్నారు.

పెదపోలమాంబ ఘటాలకు తిరువీధి

ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబరపోలమాంబ మేనత్త పెదపోలమాంబ అమ్మవారిని ఈనెల 26వతేదిన గ్రామంలోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. మంగళవారం కాళ్లనొప్పుల కారణంగా అమ్మవారు విశ్రాంతి తీసుకున్నారు. బుధవారం సాయంత్రం అమ్మవారి ఘటాలను గ్రామంలోని అన్ని పురవీధుల్లో తిప్పగా, భక్తులు అమ్మవారి ఘటాలకు పూజలు చేశారు. మేళతాళాల నడుమ అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగించారు. అలాగే పాలధార గ్రామంలో తిరువీధి చేయగా, భక్తులు పాలధారలో బియ్యం, నగదు వేసి నమస్కరించారు. పాలధార పట్టుకున్న పూజారి భక్తులు నుదుట ముద్రాట అద్దారు.

పక్కాగా సమగ్ర భూసర్వే

- ఆర్డీఓ సూర్యకళ


రోళ్లవాకలో భూసర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

బొండపల్లి: వందేళ్ల తర్వాత రాష్ట్రంలో పక్కాగా సమగ్ర భూసర్వే జరుగుతోందని ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ పేర్కొన్నారు. మండలంలోని రోళ్లవాక గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న శాశ్వత భూహక్కు సమగ్ర భూసర్వేకు సంబంధించి సర్వే ప్రక్రియను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో గ్రామంలో ఎంతవరకు సమగ్ర భూసర్వే పూర్తయిందని, అలాగే ఇంతవరకు ఎంత మంది రైతులకు సంబంధించిన భూములు సర్వే చేశారో స్థానిక సచివాలయం అధికారులు, రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పక్కాగా సర్వే నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అందుకు సంబంధించి గ్రామాల్లో పక్కాగా అన్ని భూములను అత్యంత పారదర్శకంగా సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఏన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలన్నీ ఈ సర్వే ద్వారా పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్టు పయనం


బ్యాడ్మింటన్ పోటీలకు పయనమవుతున్న జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో కడప జిల్లా ప్రొద్దుటూరులో జరగనున్న స్కూల్ గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారులు బుధవారం పయనమయ్యారు. ఈనెల 29 నుంచి మూడు రోజుల పాటు జరిగే అండర్–14 బాల, బాలికల పోటీలకు సంబంధించి 20 మంది క్రీడాకారులు ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికల్లో అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవడంతో పాటు జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, జట్టు కోచ్ అండ్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు


బాలలకు చెక్కులు అందజేస్తున్న కేసలి అప్పారావు

విజయనగరం ఫోర్ట్: బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు పేర్కొన్నారు. స్థానిక తోటపాలెంలో తల్లిదండ్రులను కోల్పోయి నిరాదరణకు గురై చదువుకు దూరమవుతున్న 24 మంది బాలలకు భీమిలికి చెందిన ఎస్‌ఓఎస్ సంస్థ ఒక్కొక్కరికి రూ.18 వేలు చొప్పన ఆర్థిక సాయం చేసింది. ఈ సందర్భంగా బుధవారం పిల్లలకు చెక్కులు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ బాలలకు 21 సంవత్సరాలు వచ్చే వరకు ఆర్థిక సాయం అందిస్తామని ఆ సంస్థ చెప్పినట్లు తెలిపారు. అనాథలకు చేయూత నివ్వడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ జి.హిమబిందు, సభ్యులు భవాని, సుధారాణి,, జిల్లా న్యాయ మండలి సభ్యుడు వావిలాపల్లి లక్ష్మణరావు, జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి యాళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిపోయిన సమతా ఎక్స్‌ప్రెస్

బొబ్బిలి రూరల్: ఇంజిన్‌లో తలెత్తిన సాంకేతిక లోపాలతో నిజాముద్దీన్ నుంచి విశాఖ పట్నం వెళ్లే సమతా ఎక్స్‌ప్రెస్ బొబ్బిలి రైల్వే స్టేషన్ వెలుపల నిలిచిపోయింది. సుమారు 17 నిమిషాల పాటు రైలు నిలిచిపోయినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. సిబ్బంది వెంటనే అప్రమత్తమై సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు.

పరీక్ష పే చర్చలో పాల్గొనండి

- ప్రధానమంత్రితో మాట్లాడే అవకాశం పొందండి
- ఇన్‌చార్జ్ డీఈఓ కె.వాసుదేవరావు



పరీక్షా పే చర్చా వేధిక బ్రోచర్


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఈఓ కె.వాసుదేవరావు

విజయనగరం పూల్‌బాగ్/వీరఘట్టం: పరీక్ష పే చర్చ కార్యక్రమంలో పాల్గొని ప్రధానమంత్రితో మాట్లాడే మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ డీఈఓ కె వాసుదేవరావు సూచించారు. స్థానిక కంటోన్మెంట్‌లోని గురజాడ స్కూల్‌లో ప్రైవేట్ పాఠశాలల సిబ్బందితో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నుంచి 12 తరగతుల విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని, తమ ప్రశ్నను ప్రధాన మంత్రిని అడగవచ్చని తెలిపారు.. ప్రశ్న గరిష్ఠంగా 500 అక్షరాల లోపు ఉండాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని చెప్పారు. వారి ఎంట్రీలను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చునన్నారు. హెచ్‌టిటిపిఎస్//ఎయుటిహెచ్.యంవైజిఓవి.ఐఎన్ ద్వారా యూజర్ లాగిన్‌ను లింకుల్ని క్లిక్ చేసి, మొబైల్ నంబర్ లేదా జీమెయిల్ అడ్రస్ ఎంటర్ చేయాలి. ఓటీపీతో లాగిన్ అయి క్లిక్ చేయాలి. ఓటీపీ రాగానే మళ్లీ లాగిన్ చేయాలి. విద్యార్థులు/ ఉపాధ్యాయులు/తల్లిదండ్రులు ప్రాథమిక వివరాలు ఇవ్వాలి. కార్యాచరణ వివరాలు పూర్తి చేసిన తర్వాత థీమ్ ఎంచుకుని 1,500 అక్షరాల లోపు వివరించాలి. ఈ కార్యక్రమం నిర్వహణకు జిల్లా స్థాయిలో సైన్స్ అధికారులు జిల్లా కో–ఆర్డినేటర్లుగా వ్యవహరిస్తారు.

విద్యార్థుల కోసం చర్చించే అంశాలు

- మీ స్వాతంత్య్ర సమరయోధులను తెలుసుకోండి
- మన సంస్కృతి మనకు గర్వకారణం
- నా పుస్తకం నా ప్రేరణ
- భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని కాపాడండి

- నా జీవితం, నా ఆరోగ్యం
- నా స్టార్టప్ కల
- హద్దులు లేని విద్య
- పాఠశాలల్లో నేర్చుకోవడానికి బొమ్మలు, ఆటలు

ఉపాధ్యాయుల కోసం

- మన వారసత్వం
- అభ్యాస పర్యావరణాన్ని ప్రారంభించడం
- నైపుణ్యం కోసం విద్య
- తక్కువ కరిక్యులర్ లోడ్, పరీక్షలకు భయలేని వాతావరణం
- భవిష్యత్తు విద్య సవాళ్లు .

తల్లిదండ్రుల కోసం

- నా బిడ్డ, నా గురువు
- వయోజన విద్య/చైతన్య పరచడం
- కలిసి నేర్చుకోవడం, పెరగడం

కార్యక్రమంలో జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి టి సన్యాసిరాజు, గురజాడ స్కూల్ కరస్పాండెంట్ ఎం.స్వరూప,ఉపాధ్యాయులు శేఖర్, ప్రైవేట్ పాఠశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంపై విజయనగరం విజయం

- నార్త్‌జోన్ క్రికెట్ టోర్నీలో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో గెలుపు


విజయనగరం- శ్రీకాకుళం జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

విజయనగరం/విజయనగరం రూరల్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ (అండర్- 14 బాలుర విభాగం)లో శ్రీకాకుళం జట్టుపై విజయనగరం జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో విజయం సాధించింది. డెంకాడ మండలం చింతలవలసలోని ఎంఈజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల క్రికెట్ మైదానంలో మంగళవారం ఆరంభమైన రెండు రోజుల మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో శ్రీకాకుళం జట్టు 151 పరుగులు చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విజయనగరం జట్టు 255 పరుగులకు ఆలౌటైంది. దీంతో విజయనగరం జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో 104 పరుగుల ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో శ్రీకాకుళం జట్టు బుధవారం ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 149 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఆట డ్రాగా ముగిసిందని అంపైర్లు ప్రకటించారు. దీంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కారణంగా విజయనగరం జట్టుకు 3 పాయింట్లు, శ్రీకాకుళం జట్టుకు 1 పాయింట్ లభించింది. ఈ సందర్భంగా విజయనగరం జట్టు ఆటగాళ్లను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు, ట్రెజరర్ సీతారామరాజు, సెలెక్టర్లు బంగార్రాజు, వర్మ, సర్వరాజ్‌లు అభినందించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	54,490–00
బంగారం(22సి. 10గ్రా.)	49,950–00
వెండి (కిలో)	73,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240

క్లుప్తంగా

ఆర్‌బీకేల పరిశీలన



ధాన్యం కొనుగోళ్లపై సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

భోగాపురం: మండలంలోని నందిగాం, భోగాపురం పంచాయతీల్లోని రైతుభరోసా కేంద్రాలను తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఎంపీడీఓ దాసరి బంగారయ్య బుధవారం పరిశీలించారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి ఇంతవరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యాం కొనుగోలు చేశారు, తదితర వివరాలపై ఆరా తీశారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ మురళి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'వాజీ' విజేతలకు బహుమతులు



విజేతలతో వాజీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: వాజీ చానల్ కొత్తగా ప్రారంభించిన యూటూబ్ చానెల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకున్నవారికి బుధవారం స్థానిక చానల్ కార్యాలయంలో లక్కీడ్రా నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా క్రీడల అధికారి, చీఫ్ కోచ్ అప్పలనాయుడు, వాజీ ఆపరేటర్ తాండవ భువనేశ్వరరాజు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వాజీ ప్రతినిధి కేఆర్‌కే రాజు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

విజయనగరం: రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కొత్తపేట కుమ్మరివీధిలో ఉన్న స్వామి వివేకానంద ప్రాథమిక పాఠశాలలో పేద మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను బుధవారం నిర్వహించారు. విశాఖ మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి సహకారంతో సుమారు వంద మందికి పరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజేష్, రోటరీ క్లబ్ అధ్యక్షురాలు ఉమా బాలాజీ, కార్యదర్శి భోగరాజు సూర్యలక్ష్మి, కమ్యూనిటీ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రాధికారాణి, మురళీకృష్ణ మంజుల ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు లత, శిరీష, ఐశ్వర్య, సంధ్యా రమ, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వంశీధీర, తదితరులు

విజయనగరం ఫోర్ట్: గ్రామీణ ప్రాంత ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలని విశాఖపట్టణానికి చెందిన విండ్రా ఆస్పత్రి సర్జికల్ అంకాలజిస్టు వంశీధీర పట్రీవు అన్నారు. బుధవారం స్థానిక శిల్పారామంలోని నల్లచెరువు వద్ద ఆర్‌ఎంపీల ఆత్మీయి కలయిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్య నియమాల పట్ల ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అనంతరం 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భీశెట్టి బాబ్జి గ్రామీణ వైద్యుల సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగం జోషి, జిల్లా అధ్యక్షుడు గద్దె చిరంజీవి, కార్యదర్శి కోట్ల పైడిరాజు, ఉపాధ్యక్షుడు ముత్యాలరావు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ సిలబస్ మేలు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఈఓ వాసుదేవరావు

విజయనగరం పూల్‌బాగ్: సీబీఎస్‌ఈ సిలబస్‌తో విద్యార్థులకు ఎంతో ఉపయోగమని ఇన్‌చార్జ్ డీఈఓ కె. వాసుదేవరావు అన్నారు. బుధవారం స్థానిక ఫోర్ట్‌సిటీ స్కూల్‌లో సీబీఎస్‌ఈ సిలబస్‌పై ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీబీఎస్‌ఈ విధానం వల్ల దేశంలో ఎక్కడైనా, ఏ కోర్సులోనైనా రాణించవచ్చన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ భవనాలు ప్రారంభం

దత్తిరాజేరు: వంగర గ్రామంలో రూ.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే అప్పలనరసయ్య గురువారం ప్రారంభించనున్నారని పీఆర్ జేఈ టి.రమ బుధవారం తెలిపారు. అలాగే భూరీసర్వే పూర్తయిన తాడేందొరవలస, డి.వెంకటాపురం, నీలకంఠరాజపురం, లింగరాజపురం, విశ్వేశ్వరరాజపురం, లక్ష్మీపురం గ్రామాల రైతులకు ఎమ్మెల్యే భూహక్కు పత్రాలు పంపిణీ చేయనున్నారని తహసీల్దార్ రమేష్ చెప్పారు.

విద్యారంగంలో నూతన ఒరవడి

● విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ..



విజయనగరం రూరల్: విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు



నెల్లిమర్ల రూరల్: తంగుడుబిల్లిలో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ చిన అప్పలనాయుడు, తదితరులు



భోగాపురం: విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబు

విజయనగరం రూరల్: మారుతున్న విద్యా వ్యవస్థకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. విద్యార్థులకు డిజిటల్ విధానంలో విద్యను అందించాలనే లక్ష్యంతో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్నారు. దీనిలో భాగంగా విజయనగరం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1979 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందించారు. విజయనగరం మండల పరిధిలో 423 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందించగా, కార్పొరేషన్ పరిధిలో 1556 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించడం జరిగిందని ఎంఈఓ పీబీవీ రామచంద్రరాజు తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని జొన్నవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు బుధవారం ట్యాబ్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ కంది రమాదేవి, హెచ్‌ఎం ఈపు విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

భోగాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబు తెలిపారు. మండలంలోని రావాడ, సవరవిల్లి, పోలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన ట్యాబ్‌లను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఉప్పాడ విజయభాస్కరరెడ్డి, అపురభక్త పైడినాయుడు, కర్రోతు వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు పట్నాల తాతయ్యలు, పోలిపల్లి మాజీ సర్పంచ్ పతివాడ రామకృష్ణ ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి, బొప్పడాం ఉన్నత పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు వెంకట చిన అప్పలనాయుడు, కిరణ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. విద్యార్థులు సద్వినియోగపరుచుకుని ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నగేష్, ఎంపీటీసీ సభ్యులు పురుషోత్తమరావు, చిన్నంనాయుడు, వార్డు మెంబర్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి లేని పాలనే సీఎం ధ్యేయం



గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అవినీతి, లంచగొండితనం లేని సుపరిపాలన అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్ పెద్దపల్లివీధిలో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలగట్ల, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. పథకాలు పొందే సమయంలో ఎవరికైనా లంచాలు ఇస్తున్నారా అని ప్రశ్నించగా... లేదని ప్రజలు బదులిచ్చారు. తమ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు లేవని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోలగట్ల ఆదేశించారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, దేశంలోనే తొలిసారిగా సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి తద్వారా ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. స్థానిక కార్పొరేటర్ రేగాన రూపాదేవి మాట్లాడుతూ, రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జోరుగా జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, 15 డివిజన్ కార్పొరేటర్ అల్లు చాణక్య, పైడితలమ్మ దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మెంబర్ వెత్సా శ్రీనివాసరావు, బొంగ భానుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మాస్కులు తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్బీసీసీ జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ, హెచ్‌ఎం ఎం.కాంచన

విజయనగరం అర్బన్: కరోనా వైరస్ సోకకుండా ముందస్తుగా ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించడం ఎంతోమేలని జిల్లా సామాజిక పరివర్తన సమాచార వ్యవస్థ (ఎస్బీసీసీ) జిల్లా కోఆర్డినేటర్ బి.రామకృష్ణ అన్నారు. చైనాలో నాలుగు రకాల వైరస్‌లు బీఎఫ్-7, బీఎన్, బీక్యూ, ఎస్వీబీ వేరియంట్లతో ఆ దేశం విలవిల్లాడుతోందన్నారు. అందువల్ల మనం కూడా జాగ్రత్తలు పాటించాలన్నారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశాల మేరకు పట్టణంలోని కంటోన్మెంట్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కరోనా జాగ్రత్తలు, రక్తహీనత, పౌష్టికాహారం, బాల్యవివాహాల నిర్మూలన, జంక్ ఫుడ్ వల్ల కలిగే ప్రమాదాలు, ఉన్నత లక్ష్యాలు, తదితర అంశాలపై వివరించారు. రక్తహీనతను అధిగమించేందుకు ప్రతి రోజూ మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం అవగాహన పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు ఎం.కాంచన, జీఆర్‌సీ మూర్తి, ఎస్.శంకరరావు ఎం.నిర్మలాదేవి, ఎం.విజయలక్ష్మి పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరితగతిన రీ సర్వే పనులు



సర్వే పనులు పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్

చీపురుపల్లి: భూములు రీసర్వే పనులు త్వరితగతిన చేపట్టాలని సిబ్బందికి తహసీల్దార్ ఎం.సురేష్ ఆదేశించారు. మండలంలోని విశ్వనాథపురం రెవెన్యూ గ్రామంలో బుధవారం ప్రారంభమైన గ్రౌండ్ ట్రూతింగ్ సర్వే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వనాథపురంలో రీసర్వే పనుల కోసం విలేజ్ సర్వేయర్లు, వీఆర్‌ఓలను మూడు బృందాలుగా నియమించినట్లు చెప్పారు. గ్రౌండ్ ట్రూతింగ్ సర్వే పనుల్లో భాగంగా గ్రామంలో ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాల్సి ఉంటుందన్నారు. తరువాత రీ సర్వే పనులు ప్రారంభించాలన్నారు. సర్వే చేసే సమయంలో రైతులు పొలాల దగ్గర ఉండాలని సూచించారు. సర్వే పనుల్లో సిబ్బంది ఎలాంటి అలసత్వం వహించవద్దని అన్నారు. రీ సర్వే పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని సూచించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



మహిళలకు పెరటి కోళ్లు, మునగ మొక్కలు అందజేస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, సూర్యనారాయణరాజు

గుర్ల: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం వద్ద డ్వాక్రా సంఘాల మహిళలకు పెరటి కోళ్లు, మునగ మొక్కలు బుధవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను, స్త్రీనిధి, ఇతర రుణాలను సద్వినియోగించుకోవాలని, చిరువ్యాపారాలు, జీవనోపాధి కల్పించుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, ఏపీఎం నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాల్సిందే..

విజయనగరం పూల్‌బాగ్: ఆర్టీసీ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు ఎ. జగన్‌మోహనరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో కాంట్రాక్ట్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ సంస్థ ద్వారానే జీతాలు చెల్లించాలని లేదా ఆప్కోస్‌లో చేర్చాలని కోరుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి 2, 3, 4 తేదీల్లో భీమవరంలో సీఐటీయూ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 29 ఉదయం 10 గంటలకు కార్మిక చైతన్య బస్సుయాత్ర విజయనగరం చేరుకుంటుందని, కాంట్రాక్ట్ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తిరుపతిరావు, జగదీష్ అశోక్, శ్రీను, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ సిద్ధం

నెల్లిమర్ల: పట్టణ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను బుధవారం రూపొందించారు. విజయనగరం, పార్వతీపురం - మన్యం జిల్లాల్లోని ఇంటర్ కళాశాలల్లో తెలుగు, ఇంగ్లిష్, ఎకనామిక్స్, కామర్స్, సివిక్స్, హిస్టరీ బోధిస్తున్న అధ్యాపకులు మార్చిలో జరిగే పరీక్షలకు సిద్ధం కావడానికి విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ తయారుచేశారు. మెరుగైన ఉత్తీర్ణత సాధించడానికి అవసరమైన మెలకువలను రూపొందించారు. గురుకులాల సమన్వయకర్త బి. చంద్రావతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

బోరు ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

చీపురుపల్లి: మండల పరిషత్ నిధులు రూ.లక్షతో జి.అగ్రహారంలో ఏర్పాటు చేసిన చేతి పంపు బోరును ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష బుధ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికుల విజ్ఞప్తి మేరకు బోరు ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, కొసిరెడ్డి రమణ, రౌతు పైడిరాజు, ముల్లు పైడిరాజు, పతివాడ రాజారావు, మజ్జి శంకర్, కోరుకొండ దాలయ్య పాల్గొన్నారు.

కొత్తబగ్గాంలో 'ఫ్యామిలీ డాక్టర్'

గజపతినగరం: మండలంలోని కొత్తబగ్గాం గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఏర్పాటు చేసిన శిబిరంలో 43 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంత రం ఇంటింటికీ వెళ్లి బాలింతలు, గర్భిణులు, వృద్ధులకు వైద్యసేవలందించారు.

మిమిక్రీ సృజనాత్మక కళ



మిమిక్రీ కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం: మిమిక్రీ సృజనాత్మక కళ అని ప్రముఖ మిమిక్రీ కళాకారుడు, వెంట్రిలాక్విస్ట్ శ్రీనివాస పండిట్ అన్నారు. నేరెళ్ల వేణుమాధవ్ జయంతిని పురస్కరించుకుని అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ -105 పూర్వ గవర్నర్ సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో కొత్త అగ్రహారంలోని గీతాంజలి పాఠశాలలో బుధవారం ప్రపంచ మిమిక్రీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మిమిక్రీ కళకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు తీసుకువచ్చిన ఘనత వేణుమాధవ్‌దేనని చెప్పారు. ఈ సందర్భంగా అనకాపల్లికి చెందిన మిమిక్రీ కళాకారుడు కృష్ణ, పాలకొండకు చెందిన మిమిక్రీ కళాకారుడు రాంబాబు తమ కళతో అలరించారు. అనంతరం మిమిక్రీ కళాకారులను తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, సుభద్రాదేవి, గీతాంజలి విద్యాసంస్థల కరస్పాండెంట్ శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు.

పింఛన్ల విషయంలో ఆందోళన వద్దు



నందిగాంలో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది

● రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది

భోగాపురం: సామాజిక పింఛన్ల తొలగింపు విషయంలో లబ్ధిదారులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాకృష్ణ ద్వివేది తెలిపారు. మండలంలో నందిగాం పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీలో ఎన్ని గృహాలున్నాయి.. గృహాల నుంచి రోజుకు ఎంతమేర తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారు.. వాటి ద్వారా ఒక నెలలో ఎన్ని టన్నుల సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారన్న విషయాలపై ఆరా తీశారు. సంపద కేంద్రం ద్వారా చెత్త నుంచి ఎరువును తయారు చేస్తున్న తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ, సర్పంచ్ గరే మురళీమోహనరావుతో పాటు సిబ్బందిని అభినందించారు. పంచాయతీలోని ప్రజలు వారి అవసరాల నిమిత్తం ఉప్పుగెడ్డ వంతెన దాటి గ్రామానికి సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో రామచంద్రపేట పంచాయతీలోని సచివాలయానికి వెళ్లాల్సి వస్తోందని, తమ గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ సమస్యను సీఎం జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే పరిష్కరించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా సామాజిక పింఛన్ల విషయంలో ప్రజల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని, పింఛన్లపై లబ్ధిదారుల సమస్యలు అప్పటికప్పుడే పరిష్కరించేలా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర అశోక్, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి, డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి, డీపీఓ నిర్మలాదేవి, డీఎల్‌డీఓ మోహనరావు, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ 40 వసంతాల వేడుక



జెండా ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: ఎస్‌ఎఫ్‌ఐ విజయనగరం శాఖ 40వ వసంతోత్సవం సందర్భంగా స్థానిక మెసానిక్ టెంపుల్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అంతకుముందు ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించి, 40 వసంతోత్సవాల లోగో ఆవిష్కరించారు. అనంతరం రక్తదాన శిబిరం వద్ద ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ నాయకుడు శివానంద్ మాట్లాడుతూ, 1983లో జిల్లాలోని రాజా కాలేజీలో ఏర్పడిన ఎస్‌ఎఫ్‌ఐ 40 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం అభినందనీయమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహనరావు మాట్లాడుతూ, విద్యార్థి ఉద్యమాల్లో అమరులైన వారి స్ఫూర్తితో ఎస్‌ఎఫ్‌ఐ పోరాడుతోందన్నారు. కార్యక్రమంలో రోటరీ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు రవి, శ్రీకాంత్, వైష్ణవి, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, హర్ష, సౌమ్య, రవి, నగర అధ్యక్ష కార్యదర్శులు రాజు, రమేష్, నాయకులు కిరణ్, బాలాజీ, ఎర్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పట్టాల పంపిణీకి సర్వం సిద్ధం




పంపిణీకి సిద్ధమైన జగనన్న లే అవుట్

● 4,177 మందికి నేడు పంపిణీ

విజయనగరం రూరల్: నియోజకవర్గంలో మరో విడత పట్టణ, గ్రామీణ పేద లబ్ధిదారులకు ఇంటి పట్టాల పంపిణీకి అధికారులు సర్వం సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన నవరత్నాల పథకంలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని అర్హులైన 4,177 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాల పట్టాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గురువారం అందజేయనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోనే అతిపెద్ద లేఅవుట్లలో ఒకటైన గుంకలాం జగనన్న కాలనీలో 350 ఎకరాల విస్తీర్ణంలో పట్టణ పేదలకు 12 వేలకు పైగా ఇంటి స్థలాలను పంపిణీ చేయడం జరిగింది. అలాగే రెండో విడత పంపిణీలో భాగంగా సారిక రెవెన్యూలో రెండో అతి పెద్దదైన లే అవుట్‌లో 93.84 ఎకరాల్లో 4,815 ప్లాట్లు పంపిణీకి సిద్ధం చేయగా, ఈ లే అవుట్‌లో పట్టణ పేదలకు 3,545 ఇంటి స్థలాలు, రూరల్ పరిధిలో 632 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేయనున్నారు. అర్హత కలిగి ఉండి, ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు, ఇంటిని మంజూరు చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి..



మండలంలోని సారిక సచివాలయం పరిధిలో 94 ఎకరాల్లో జగనన్న లేఅవుట్‌ను సిద్ధం చేయడం జరిగింది. పట్టణ పరిధిలోని 3,545 మంది పేదలకు, అలాగే రూరల్ పరిధిలోని 632 మందికి పట్టాలు అందజేస్తాం.

– సీహెచ్. బంగార్రాజు, తహసీల్దార్, విజయనగరం

క్లుప్తంగా...

ఐటీలో పెట్టుబడుల ఆకర్షణకు అమెరికాలో రోడ్ షో

- ఫిబ్రవరి 2 నుంచి వారం రోజుల పాటు నిర్వహణ
- పాల్గొననున్న మంత్రి అమర్‌నాథ్, అధికారుల బృందం

సాక్షి, అమరావతి: ఏపీలో ఐటీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంలో భాగంగా అమెరికాలో రోడ్‌షోకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ఫిబ్రవరి 2 నుంచి వారం రోజుల పాటు దీన్ని నిర్వహించనుంది. ఇందుకుగాను రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ నేతృత్వంలోని అధికారుల బృందంఅమెరికాకు బయలుదేరనుంది. విశాఖను బీచ్ ఐటీ డెస్టినీగా తీర్చిదిద్దే విధంగా జనవరి 20–21 తేదీల్లో ఇన్ఫినిటీ వైజాగ్, ఫిబ్రవరి 16,17 తేదీల్లో గ్లోబల్ ఐటీ సమ్మిట్‌లను నిర్వహిస్తున్నట్లు ఐటీ శాఖాధికారులు తెలిపారు. విశాఖలో మార్చి 3,4 తేదీల్లో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ ప్రచారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జీఐఎస్‌కు విస్తృత ప్రచారం కల్పించడానికి ఆసక్తి గల సంస్థల నుంచి టెండర్లను ఏపీ ఎకనమిక్ బోర్డు పిలిచింది. ప్రధాన ఈవెంట్ నిర్వహణను సీఐఐ చూడనుండగా, ప్రచారం కల్పించే బాధ్యతలను ఎంపికైన సంస్థ పర్యవేక్షిస్తుంది.

పింఛన్ లబ్ధిదారులను తగ్గించాలని చూస్తున్నారు

జనసేన అధినేత పవన్ ఆరోపణ

సాక్షి, అమరావతి: ప్రతి నెలా ఇచ్చే సామాజిక పింఛన్ల లబ్ధిదారులను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆరోపించారు. ఈ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం సీఎం జగన్ పేరుతో ఒక లేఖను తన ట్విట్టర్ అకౌంట్ నుంచి విడుదల చేశారు. పేదలకు పింఛన్లను దూరం చేయడం కోసమే నోటీసులిస్తున్నారని విమర్శించారు. ధ్రువపత్రాలు చూపించాలని దివ్యాంగులను ఒత్తిడి చేయడంలో ఉద్దేశమేమిటని ప్రశ్నించారు.

కాపుల రిజర్వేషన్ అంశం రాష్ట్ర ప్రభుత్వానిదే

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్‌లో కాపులకు రిజర్వేషన్ ఇవ్వాలనే అంశం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని, అది కేంద్ర ప్రభుత్వానికి సంబంధంలేని విషయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు స్పష్టం చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. కాపుల రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలని కొందరు తప్పుగా ప్రచారం చేస్తున్నారన్నారు. రాజశేఖరరెడ్డి ముస్లింలకు ఇచ్చిన రిజర్వేషన్‌ను చంద్రబాబు అమలు చేశారని తెలిపారు. దీంతో బీసీలకు రాజకీయంగా అన్యాయం జరిగిందన్నారు. కడప, చిలకలూరి పేట తదితర ప్రాంతాల్లో బీసీలకు కేటాయించిన రిజర్వేషన్లలో ముస్లింలు పోటీ చేయడంతో బీసీలు ప్రాతినిధ్యం కోల్పోయారని చెప్పారు. కడపలో 20 మంది బీసీలకు చెందిన కార్పొరేట్ స్థానాల్లో ముస్లింలు పాగా వేశారని వివరించారు.



పార్వతీపురం మండలం బుదురవాడలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు



పశ్చిమగోదావరి జిల్లా పసలదీవిలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

గడప గడపకు మన ప్రభుత్వం



ఎన్టీఆర్‌జిల్లా గొల్లమండల తండాలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

2022లో పారిశ్రామిక ప్రగతిలో పరుగులు

రూ.1,66,919.71 కోట్ల పెట్టుబడులకు ఎస్‌ఐపీబీ ఆమోదం

- దావోస్‌లో రూ.1.26 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు
- గ్రాసిం క్లోర్ ఆల్కాలిక్, నోవా ఎయిర్, ఐటీసీ స్పైసెస్‌పార్క్, ఐటీసీ వెల్కం హోటల్ ప్రారంభం
- టీసీఎల్, ఫాక్స్‌లింక్, సన్నీఆప్‌టెక్, డిక్సన్ వంటి ఎలక్ట్రానిక్ యూనిట్ల ప్రారంభం
- రామాయపట్నంపోర్టు, అపాచీ పుట్ వేర్ పార్క్, అస్సాగో బయో ఇథనాల్ వంటి పలు యూనిట్లకు శంకుస్థాపన
- అనంతపురం, విశాఖల్లో రెండు మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి ఒప్పందం
- లాజిస్టిక్ రంగంలో పెట్టుబడులు ఆకర్షించే విధంగా 2022–27 లాజిస్టిక్ పాలసీ విడుదల
- వచ్చే ఏడాది గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ లోగో ఆవిష్కరణ
- 50వ వసంతంలోకి అడుగుపెట్టిన ఏపీఐఐసీ ప్రత్యేక లోగో ఆవిష్కరించిన సీఎం
- రాష్ట్రంలో పెట్టుబడులపై సీఎంని కలిసిన టాటా, బిర్లా, ఎన్‌టీపీసీ, నాల్కో, మిథానీ మల్క్‌హోల్డింగ్స్ వంటి దిగ్గజ సంస్థలు
- వరుసగా మూడో ఏడాది సులభతర వాణిజ్య ర్యాంకుల్లో మొదటిస్థానంలో నిలిచిన ఏపీ



సాక్షి, అమరావతి: రాష్ట్ర పారిశ్రామిక రంగ ప్రగతి 2022 సంవత్సరంలో ఊపందుకుంది. ముఖ్యంగా మే 22 నుంచి 26వ తేదీ వరకు సీఎం వైఎస్ జగన్ దావోస్ పర్యటన రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించింది. ఈ ఏడాది రికార్డు స్థాయిలో కొత్త పెట్టుబడులకు ఆమోదం తెలపడంతో పాటు లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. టాటా, బిర్లా, ఐటీసీ, నాల్కో, ఎన్‌టీపీసీ, మిథాని, టెక్ మహీంద్రా వంటి దిగ్గజ కార్పొరేట్ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తిని వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశాయి. సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్‌ఐపీబీ) ఈ ఏడాది నాలుగుసార్లు సమావేశమై రూ.1,66,919.71 కోట్ల విలువైన పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. ఇందులో రామాయపట్నం వద్ద ఇండోసోల్ సోలార్ రూ.43,143 కోట్లతో సోలార్ ప్యానల్స్ తయారీ, కాకినాడ సెజ్‌లో రూ.1,900 కోట్లతో లైఫిజ్ ఫార్మా యూనిట్, వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో రూ.386.23 కోట్లతో కాసిస్ ఎలక్ట్రిక్ బస్సుల తయారీ యూనిట్, రూ.8,800 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ఫ్యాక్టరీ, రూ.560 కోట్లతో నెల్లూరులో క్రిభ్‌కో బయో ఇథనాల్, రాష్ట్రంలో వివిధ చోట్ల అదానీ, షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్స్ వంటివి ఉన్నాయి. మే నెలలో సీఎం జగన్ దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం పర్యటన సందర్భంగా గ్రీన్ ఎనర్జీలో రూ.1.26 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించారు. దీంతో గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. అలాగే ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన గ్రాసిం ఇండస్ట్రీస్ తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో రూ.2,700 కోట్లతో ఏర్పాటు చేసిన క్లోర్ ఆల్కాలిక్ (కాస్టిక్ సోడా) తయారీ యూనిట్‌ను కుమారమంగళం బిర్లాతో కలిసి ముఖ్యమంత్రి ఏప్రిల్ 21న ప్రారంభించారు. జనవరి 12న గుంటూరులో ఐటీసీ వెల్‌కమ్ ఫైవ్‌స్టార్ హోటల్, నవంబర్ 11న ఐటీసీకి చెందిన స్పైసెస్ పార్కును సీఎం ప్రారంభించారు. జూన్ 23న తిరుపతిలో టీసీఎల్, ఫాక్స్‌లింక్, సన్నీఆప్‌టెక్, డిక్సన్ వంటి కంపెనీలను సీఎం ప్రారంభించడం ద్వారా వేలాదిమందికి ఉపాధి కల్పించారు. ఆగస్టు 16న జపాన్ టైర్ల దిగ్గజ సంస్థ యకహోమా అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో రూ.2,200 కోట్లతో ఏర్పాటు చేసిన హాఫ్ హైవే టైర్ల తయారీ యూనిట్‌ను సీఎం ప్రారంభించారు. పూర్తిగా పారిశ్రామికవేత్తల అభిప్రాయాల ఆధారంగా ప్రకటించిన సులభతర వాణిజ్య ర్యాంకుల్లో ఆంధ్రప్రదేశ్ వరుసగా మూడో ఏడాది మొదటిస్థానంలో నిలిచింది.



విషాద సంఘటన

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి దుబాయ్ పర్యటనలో రూ.5,100 కోట్ల విలువైన పెట్టుబడులు కుదుర్చుకు వచ్చిన కొద్దిరోజులకే ఫిబ్రవరి 21న హఠాన్మరణం పొందడం రాష్ట్ర పారిశ్రామికరంగాన్ని కుదిపేసింది. అనంతరం మంత్రివర్గ విస్తరణలో పరిశ్రమలశాఖ మంత్రిగా గుడివాడ అమర్‌నాథ్ పదవీ బాధ్యతలు చేపట్టారు.

2022లో జరిగిన కొన్ని పారిశ్రామిక కీలక ఘటనలు

జనవరి 12: సీఎం చేతుల మీదుగా గుంటూరులో ఐటీసీ వెల్‌కమ్ ఫైవ్‌స్టార్ హోటల్ ప్రారంభం.

జనవరి 27: రాష్ట్రంలో ఆక్సిజన్ కొరతను తీర్చేవిధంగా శ్రీ సిటీలోని నోవా ఎయిర్‌ను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు.

ఫిబ్రవరి 17: విశాఖపట్నం, అనంతపురాల్లో మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కుల ఏర్పాటుకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, సీఎం జగన్ సమక్షంలో ఒప్పందం.

ఫిబ్రవరి 21: పరిశ్రమలశాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి హైదరాబాద్‌లోని స్వగృహంలో హఠాన్మరణం.

మార్చి 29: మల్క్ హోల్డింగ్స్ ప్రతినిధులు వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో పెట్టుబడులపై సీఎం జగన్‌ని కలిసి చర్చించారు.

ఏప్రిల్ 21: బలభద్రపురంలో రూ.2,700 కోట్లతో ఏర్పాటు చేసిన కాస్టిక్ సోడా తయారీ కేంద్రాన్ని సీఎం ప్రారంభించారు.

మే 22–26: వరల్డ్ ఎకనమిక్ ఫోరం సమావేశాల్లో పాల్గొనడానికి సీఎం దావోస్ పర్యటన. ఈ సందర్భంగా రూ.1.26 లక్షల కోట్ల ఒప్పందాలు.

జూన్ 23: శ్రీకాళహస్తి ఇనగలూరులో అపాచీ (హిల్‌టాప్ సెజ్) పాదరక్షల తయారీ యూనిట్‌కు శంకుస్థాపన. టీసీఎల్, ఫాక్స్‌లింక్, డిక్సన్ వంటి ఎలక్ట్రానిక్ కంపెనీల ప్రారంభం.

జూలై 5: సులభతర వాణిజ్యంలో మొదటిస్థానంలో నిలవడానికి కృషిచేసిన పరిశ్రమలశాఖ అధికారులను అభినందించిన సీఎం.

జూలై 20: రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన.

ఆగస్టు 16: అచ్యుతాపురంలో జపాన్‌కు చెందిన యకహోమా గ్రూపు ఏటీసీ టైర్ల తయారీ యూనిట్ మొదటిదశను ప్రారంభించిన సీఎం.

సెప్టెంబర్ 26: ఏపీఐఐసీ ఏర్పాటై 50 సంవత్సరాలు అయిన సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన ఏపీఐఐసీ లోగోను సీఎం ఆవిష్కరించారు.

సెప్టెంబర్ 28: మారిటైమ్ రంగంలో ఎకనామిక్ టైమ్స్ అవార్డు లభించడంపై అధికారులను అభినందించిన సీఎం.

నవంబర్ 4: రాజమండ్రి వద్ద అస్సాగో గ్రూపు బయో ఇథనాల్ ప్రాజెక్టుకు సీఎం శంకుస్థాపన.

నవంబర్ 11: పల్నాడు జిల్లా యడ్లపాడు వద్ద ఐటీసీ ఏర్పాటు చేసిన స్పైసెస్ పార్కును ప్రారంభించిన సీఎం.

నవంబర్ 21: జియ్యపుతిప్ప వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి సీఎం భూమిపూజ.

డిసెంబర్ 23: కొప్పర్తి పారిశ్రామిక పార్కుకు సంబంధించి నీటివసతి, రైల్వేలైన్, ఎగ్జిక్యూటివ్ సెంటర్ నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన.

ఆర్టీసీ కార్గో రికార్డు రాబడి 2022-23లో ఇప్పటికే రూ.123 కోట్లు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజా రవాణా విభాగం (ఆర్టీసీ) కార్గో రవాణా సేవలకు విశేష ఆదరణ లభిస్తోంది. సత్వరం డోర్ డెలివరీ సౌలభ్యంతో ప్రవేశపెట్టిన కార్గో రవాణా సేవల ద్వారా ఆర్టీసీ రికార్డుస్థాయిలో రాబడి సాధిస్తోంది. 2022లో ఏకంగా రూ.122.33 కోట్ల రాబడి సాధించి రికార్డు సృష్టించింది. 2021 కంటే ఇది 30 శాతం అధికం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆర్టీసీ 2021–22లో కార్గో రవాణా ద్వారా రూ.122.19 కోట్ల రాబడి సాధించింది. 2022–23లో డిసెంబర్ 25 నాటికే రూ.122.33 కోట్ల రాబడి సాధించడం విశేషం. ఆర్థిక సంవత్సరం ఇంకా మూడునెలలు ఉండటంతో ఈ రాబడి రూ.150 కోట్లు దాటుతుందని అంచనా వేస్తున్నారు. 2022లో కార్గో రవాణా రాబడిలో తిరుపతి కేంద్రంగా ఉన్న జోన్–4 అత్యధికంగా రూ.34.28 కోట్లు సాధించింది. రాష్ట్రంలో ఆర్టీసీ నిర్వహిస్తున్న 329 బస్‌స్టేషన్లలో.. 249 బస్‌స్టేషన్ల నుంచి కార్గో సేవలను అందిస్తోంది. బస్‌స్టేషన్ల వద్ద కాకుండా ఇతర ప్రదేశాల్లో ఆర్టీసీకి 525 మంది పార్సిల్ బుకింగ్ ఏజెంట్లను నియమించింది. మరోవైపు డోర్ డెలివరీ సౌలభ్యాన్ని కూడా అందిస్తోంది. దీంతో ఆర్టీసీ కార్గో రవాణా సేవలకు సానుకూల స్పందన లభిస్తోంది.

2022-23లో ఈనెల 25 నాటికి జోన్ల వారీగా ఆర్టీసీ కార్గో రవాణా సేవల రాబడి ఇలా..

జోన్	రాబడి (రూ.కోట్లలో)
జోన్-1:	15.06
జోన్-2:	33.19
జోన్-3:	21.50
జోన్-4:	34.28
అంతర్‌రాష్ట్ర సర్వీసులు:	18.30
మొత్తం	122.33

బ్రాండింగ్ 'చేప'ట్టిన సర్కారు

- ఆక్వా రైతులు, మత్స్యకారుల కోసం 'ఫిష్ ఆంధ్ర'కు ప్రమోషన్
- కన్సల్టెంట్ నియామకానికి నోటిఫికేషన్ జారీ

సాక్షి, అమరావతి: 'ఫిష్ ఆంధ్ర' బ్రాండింగ్‌ను మరింతగా ప్రోత్సహించేందుకు మత్స్య శాఖ చర్యలు చేపట్టింది. అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న ఒడిదుడుకులతో ఆక్వా రంగంలో తరచూ తలెత్తుతున్న సంక్షోభం దృష్ట్యా కేవలం ఎగుమతులపైనే ఆధారపడకుండా స్థానిక వినియోగంపైనా దృష్టి సారించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు అనుగుణంగా మత్స్య ఉత్పత్తుల తలసరి వినియోగం పెంచడం.. తద్వారా ఆక్వా రైతులు, మత్స్యకారులకు అండగా నిలబడటమే లక్ష్యంగా ముందుకెళుతోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో లభించే సముద్ర, రైతులు పండించే మత్స్య ఉత్పత్తులను 'ఫిష్ ఆంధ్ర' పేరిట హబ్‌లు, అవుట్‌లెట్స్, కియోస్క్‌ల ద్వారా మత్స్య శాఖ విక్రయిస్తోంది. వీటిని బ్రాండింగ్ చేసేందుకు ప్రత్యేకంగా యూట్యూబ్ చానల్‌తో పాటు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్, ట్విట్టర్ లాంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రమోట్ చేయనుంది. డోర్ డెలివరీ కోసం ప్రత్యేకంగా యాప్‌ను డిజైన్ చేయనున్నారు. కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ (సీఆర్ఎంఎస్) ద్వారా వినియోగదారులు ఎలాంటి ఉత్పత్తులను ఎక్కువగా ఇష్టపడుతున్నారనే దానిపై ప్రతిరోజూ ఫీడ్ బ్యాక్ తీసుకుంటూ మార్కెటింగ్ సౌకర్యాలను కల్పించనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కన్సల్టెంట్ నియమించనున్నారు. ఆసక్తి కల్గిన ఏజెన్సీల నుంచి రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ (ఆర్ఎఫ్‌పీ) కోరుతూ బుధవారం మత్స్యశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆసక్తి గల ఏజెన్సీలు www.fisheries.ap.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా టెండర్ డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ చేసుకుని వచ్చే నెలాఖరులోగా apfisheriestender@gmail.comలో దరఖాస్తు చేసుకోవాలని మత్స్యశాఖ కమిషనర్ కె.కన్నబాబు కోరారు.

ఐటీ పాలసీతో కంపెనీల ఏర్పాటు సులభతరం



లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

- యాంకర్ ఐటీ కంపెనీలను విశాఖకు తీసుకువస్తాం
- త్వరలో ఐటీ ఇన్సెంటివ్‌ల విడుదలకు చర్యలు
- వచ్చే మూడు నెలల్లో విశాఖ వేదికగా అంతర్జాతీయ సదస్సులు
- రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి అమర్‌నాథ్ వెల్లడి

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త ఐటీ పాలసీతో కంపెనీల స్థాపన మరింత సులభతరం కానుందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 16, 17 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న గ్లోబల్ టెక్ సమ్మిట్ ఏర్పాట్లు తదితర అంశాలపై పల్సస్ గ్రూప్ లిమిటెడ్ సీఈవో గేదెల శ్రీనుబాబు నేతృత్వంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడారు. వచ్చే ఏడాది కాలంలో విశాఖకి పలు ఐటీ దిగ్గజ కంపెనీలు రానున్నాయని చెప్పారు. విశాఖను బీచ్ ఐటీ డెస్టినీగా అభివృద్ధి చేయాలని సీఎం వైఎస్ జగన్ కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐటీ కంపెనీలకు తెలియజేసే ఉద్దేశంతోనే జనవరి నుంచి ఏప్రిల్ వరకు పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులతో పాటు గ్లోబల్ టెక్ సదస్సును విశాఖలో నిర్వహిస్తున్నామని వివరించారు. జనవరి 6,7,8 తేదీల్లో విశాఖలో హెల్త్ సమ్మిట్ జరగబోతుందని, అదే నెల 20, 21 తేదీల్లో ఇన్ఫినిటీ ఐటీ సదస్సు జరుగుతుందని చెప్పారు. ఫిబ్రవరి 3, 4 తేదీల్లో జీ 20 సదస్సు, మార్చి 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు విశాఖలోనే నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు, గ్లోబల్ టెక్ సమ్మిట్ ద్వారా పెద్ద ఎత్తున ఐటీ పరిశ్రమలు, భారీ పరిశ్రమలు విశాఖకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఒకటి, రెండు నెలల్లో ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్ కార్యకలాపాలు ప్రారంభిస్తుందని, అమెజాన్ త్వరలోనే విశాఖలో అడుగుపెట్టబోతుందని, హెచ్‌సీఎల్ విశాఖ, తిరుపతి, కాకినాడ, గుంటూరులో ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించిందని గుర్తుచేశారు. ఐటీ రంగానికి చెందిన యాంకర్ యూనిట్లు విశాఖకు వస్తే, ఐటీ హబ్‌గా పేరొందిన పలు నగరాల సరసన విశాఖ కూడా నిలుస్తుందన్నారు. విశాఖలో వాతావరణం కూడా ఐటీ ఉద్యోగులకు అనుకూలంగా ఉంటుందన్నారు. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సులో కూడా ఫుడ్ ప్రాసెసింగ్, టూరిజం, ఏరోస్పేస్, డిఫెన్స్ తదితర పది రంగాలకు చెందిన పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి విశాఖలో ఉన్న అవకాశాలను పారిశ్రామికవేత్తలకు తెలియజేస్తామన్నారు. త్వరలో ఎంఎస్‌ఎంఈలతోపాటు ఐటీ ఇన్సెంటివ్‌లను కూడా విడుదల చేస్తామని చెప్పారు. గేదెల శ్రీనుబాబు మాట్లాడుతూ గ్లోబల్ టెక్ సమ్మిట్‌కు 1,000 మంది ప్రతినిధులు హాజరయ్యే అవకాశముందన్నారు. ఈ సమ్మిట్‌కు సంబంధించి ఇప్పటికే భువనేశ్వర్, ఢిల్లీ, హైదరాబాద్‌లో రోడ్ షోలు నిర్వహించామని చెప్పారు. జీ 20 దేశాలలో కూడా ఈ సదస్సు ప్రాధాన్యత వివరించి ఐటీ రంగానికి చెందిన పారిశ్రామికవేత్తలను సదస్సుకు ఆహ్వానించనున్నామని తెలిపారు.

జీవీఎల్‌కు విభజన హామీల మీద చర్చించే ధైర్యం ఉందా..

రాష్ట్ర విభజన హామీల అమలుపై చర్చించే ధైర్యం బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావుకు ఉందా? అని మంత్రి అమర్‌నాథ్ ప్రశ్నించారు. కేంద్రం ఇవ్వాల్సిన ప్రాజెక్టులు, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వంటి అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధమని దానికి జీవీఎల్ సిద్ధమా అని సవాల్ విసిరారు. జీవీఎల్‌ను నాయకుడిగా బీజేపీ వాళ్లే గుర్తించడం లేదన్నారు. 2024 నాటికి జీవీఎల్ ఏ పార్టీలో ఉంటాడో ఆయనకే తెలియదని మంత్రి వ్యాఖ్యానించారు.

పింఛన్ల పైనా 'పిచ్చి' ఏడుపు

- చంద్రబాబు పాలనలో పింఛన్లు ఇచ్చింది 39 లక్షల మందికే
- జగన్ సీఎం అయ్యాక రికార్డు స్థాయిలో 64.45 లక్షలకు చేరిన పింఛన్లు
- వృద్ధాప్య పింఛన్ల కనీస వయసు 60 ఏళ్లకు తగ్గింపు
- ఈ నెలలోనే కొత్తగా 2,31,989 మందికి మంజూరు
- ఈ మూడున్నరేళ్లలో 22.31 లక్షల మందికి కొత్తగా మంజూరు
- కొత్తగా పింఛన్లు మంజూరు చేసినప్పుడల్లా ప్రతిపక్షాల తప్పుడు ప్రచారం
- లక్షల్లో కొత్త పింఛన్లు ఇస్తుంటే, రద్దు చేస్తున్నారంటూ అసత్య ప్రచారం



ఫ్యాక్ట్ చెక్

బాబుగారి ఘనకార్యం

2014 జూన్‌లో రాష్ట్ర విభజన జరిగిన నాటికి రాష్ట్రంలో మొత్తం పింఛన్‌దారుల సంఖ్య: 43.11 లక్షలు. 2018 ఫిబ్రవరి నెలలో కూడా అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కేవలం 44.44 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేసి, అందులో కేవలం 39.38 లక్షల మందికి రూ. 447.26 కోట్లను మాత్రమే పంపిణీ చేసింది. 2019 ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ జారీకి కేవలం నెల ముందు 2019 జనవరిలో కూడా చంద్రబాబు ప్రభుత్వం పంపిణీ చేసిన పింఛన్ల మొత్తం రూ. 514 కోట్లు మాత్రమే.

సీఎం జగన్ ఘనత

2019లో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కేవలం ఏడాది లోపే రాష్ట్రంలో పింఛన్‌దారుల సంఖ్య ఏకంగా 61 లక్షలకు పైగా పెరిగిపోయింది. మూడున్నరేళ్లుగా ప్రభుత్వం ప్రతి నెలా 61 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు పింఛన్లు ఇస్తోంది. ఈ నెలలో 62.69 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేసి, అందులో 62.02 లక్షల మందికి రూ.1,577.07 కోట్లు పంపిణీ చేసింది. కొత్తగా మరో 2,31,989 మందికి పింఛన్లు మంజూరు చేసింది. వీరిలో 83 వేల మందికి పైగా వృద్ధులు, 75 వేల మంది వితంతువులు, 37 వేల మందికి పైగా దివ్యాంగులు, 20 వేల మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులతో పాటు మరికొన్ని కేటగిరీల్లో మరికొందరు ఉన్నారు. వీటితో కలిపి జనవరి ఒకటో తేదీ నుంచి పింఛన్లు అందుకొనే వారి సంఖ్య ఏకంగా 64,45,226కు పెరిగిపోయింది. ఈ పింఛన్లకు ప్రభుత్వం చేసే నెలవారీ ఖర్చు రూ. 1,775.85 కోట్లు.

జగన్ ప్రభుత్వం రికార్డు

జగన్ సీఎం అయిన నాటి నుంచి అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తదితరులకు ఇచ్చే సామాజిక పింఛన్లు రికార్డు స్థాయికి పెరిగాయి. పార్టీలు, ప్రాంతాలు, కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంతృప్త స్థాయిలో ఎప్పటికప్పుడు ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేస్తూనే ఉంది. తాజాగా మంజూరు చేసిన వారితో కలిపి ఈ మూడున్నరేళ్లలో మొత్తం 22.31 లక్షల మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేసిందని సెర్ప్ అధికారులు వెల్లడించారు. జగన్ సీఎం అయ్యాక వృద్ధాప్య పింఛన్లకు కనీస వయస్సు 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గించారు. తద్వారా కొత్తగా అర్హత సాధించిన వారితో కలిపి 2020 జనవరి నెలలో ఒకేసారి 6.12 లక్షల మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేశారు. ఆ మరుసటి నెలలో మరో 1.31 లక్షల మందికి, 2020 జూన్‌లో మరో విడత 1.16 లక్షలు, 2020 జూలైలో ఇంకొకసారి 2.42 లక్షల మంది, 2021 సెప్టెంబరులో మరొకసారి 2.20 లక్షల మంది.. ఇలా ఎప్పటికప్పుడు ప్రభుత్వం అర్హులకు పింఛన్లు మంజూరు చేస్తూనే ఉంది. పింఛనుదారుల్లో ఎక్కువ మంది వృద్ధులే కావడం వల్ల మరణాలూ ఉంటాయి. గత 8, 10 సంవత్సరాల సరాసరి చూసినా మరణాల కారణంగా ప్రతి నెలా పింఛనుదారుల సంఖ్య తగ్గుతుంది. మరోపక్క అర్హత లేని వాళ్లు పింఛన్లు పొందుతున్నారా అన్న దానిపైన కూడా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రతి ఆరు నెలలకు సోషల్ ఆడిట్ చేపడుతోంది. ఏన్నో ఏళ్లుగా ఉన్న నిబంధనల ప్రకారమే.. అనర్హులుగా గుర్తించిన వారికి నేరుగా పింఛన్లు రద్దు చేయకుండా, నోటీసు ఇస్తోంది. వారి అర్హతను నిరూపించుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. 64 లక్షల మంది లబ్ధిదారుల్లో అతి కొద్ది మంది అనర్హులా కాదా అన్న విషయాన్ని తెలుసుకొనేందుకు అధికారులు చేపట్టే చర్యలను, మరణాలను సాకుగా చూపి ప్రభుత్వం లక్షల సంఖ్యలో పింఛన్లను రద్దు చేస్తుందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు.

ఇది వారి ఏడుపు

అయినా తెలుగుదేశంతో పాటు జనసేన పార్టీ, వాటికి మద్దతిచ్చే కొన్ని పత్రికలు ప్రభుత్వం పింఛన్లు రద్దు చేస్తోందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. అందులోనూ కొత్తగా పింఛన్లు మంజూరు చేసినప్పుడల్లా వాటి ఏడుపు మరింత తీవ్రంగా ఉంటుంది. చంద్రబాబు సీఎం కావాలన్న 'పిచ్చే' వారి ఏడుపుకు కారణం.

–సాక్షి, అమరావతి

తెలంగాణ

అశ్రునయనాల మధ్య చలపతిరావు అంత్యక్రియలు

రాయదుర్గం(హైదరాబాద్): సినీ నటుడు చలపతి రావు అంత్యక్రియలను బుధవారం ఇక్కడి రాయదుర్గంలోని వైకుంఠ మహాప్రస్థానంలో నిర్వహించారు. చలపతిరావు కూతుళ్లు అమెరికాలో ఉండడంతో వారు వచ్చేవరకు ఆయన పార్థివదేహాన్ని మహాప్రస్థానంలోని ఫ్రీజర్‌లో ఉంచారు. బుధవారం ఉదయం చలపతిరావు కుమారుడు రవిబాబు, ఆయన కూతుళ్లు, కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య మహాప్రస్థానంలోని విద్యుత్ దహన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.



ఎనిమిది దక్షిణాసియా దేశాలూ, అభివృద్ధికి నోచుకోని అనేక ఆఫ్రికాలోని వెనకబడిన దేశాల పల్లెల్లోని అట్టడుగు వర్గాలు, మారుమూల గిరిజనులకు, నగరాల్లోని మురికివాడల్లో రక్షిత మంచినీరు, పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం కోసం పనిచేస్తున్న వందలాది సంస్థల్ని సమన్వయం చేసే బాధ్యతలు...

చాలా దేశాల్లోని పేదలూ, అణగారిన ప్రజలు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్స్‌లాంటి వారి అవసరాలను అంతర్జాతీయ వేదికలపై వినిపించడంతో పాటు వారికి అందాల్సిన సేవలూ, సౌకర్యాల విధాన రూపకల్పనలకు కృషి..
తమ పరిశోధనల్ని అంతర్జాతీయ సంస్థలకూ, వివిధ దేశాల్లోని ప్రభుత్వాలకూ, అక్కడి నేతలకు తెలియజెప్పే పని...

అర్ధరాత్రి, అపరాత్రుల్లేకుండా దాదాపు 35 పైగా దేశాల్లో పర్యటనలు...
ఇవన్నీ నిర్విరామంగా నిర్వర్తిస్తున్న సార్క్ దేశాల, అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థల సమన్వయకర్త 'స్నేహలత మేకల'తో మాటా మంతీ...

స్నేహలత మేకల

అట్టడుగు వర్గాల కోసం అంతర్జాతీయ వేదికలపై...

■ **వ్యక్తిగత వివరాలు...**

స్నేహలత : మాది పాత మహబూబ్‌నగర్ జిల్లా, గద్వాల (ఇప్పుడు ఇదే జిల్లా) కు దగ్గర్లోని పర్‌మాల అనే ఓ పల్లెటూరు. మా నాన్న వ్యవసాయ శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్. ఆడపిల్లలు చదువుకుని తమ కాళ్లపై నిలబడాలన్న సంకల్పం నాన్నది. అప్పటి సామాజిక పరిస్థితులూ, కుటుంబ నేపథ్యం ఆడపిల్లల పై చదువులకు అనుకూలం కాదు. అప్పట్లో దాదాపుగా మా ప్రాంతపు పల్లెల్లోని ఆడపిల్లల్లో హైదరాబాద్‌కు వచ్చి, హాస్టల్‌లో ఉండి చదువుకున్న మొదటి అమ్మాయిని నేనే. గ్రాడ్యుయేషన్‌లో హోమ్‌సైన్స్ తీసుకున్నా. ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ నుంచి పీజీ, పీహెచ్‌డీ చేశాను. హోమ్‌సైన్స్‌లో దాదాపు అమ్మాయిలందరూ ఫీల్డ్ జాబ్‌కు దూరంగా ఉండే న్యూట్రిషన్ వంటివి సబ్జెక్టులు ఎంచుకునేవారు. కానీ విధి నన్ను మళ్లీ ఫీల్డ్ జాబ్‌కు ఆస్కారం ఉండే పనులవైపే తీసుకెళ్లింది. నా భర్తదీ వ్యవసాయ కుటుంబమే. ఆయనది కర్నూల్ జిలా పాణ్యం. లెక్చరర్‌గా పనిచేస్తూనే పదెకరాలు కొని అందులో ఆర్గానిక్ ఫార్మింగ్ చేస్తున్నారు.

■ **ప్రస్తుతం మీరు నిర్వహిస్తున్న బాధ్యతల గురించి...**

స్నేహలత : మన దేశంలోనే కాకుండా... మరెన్నో దేశాలలోని కుగ్రామాల్లో, గిరిజన ఆవాసాల్లో, పేదరికం తాండవిస్తున్న కొన్ని దేశాల్లోని మారుమూల పల్లెల్లో, పట్టణ మురికివాడల్లో మంచినీరు, పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం కల్పనకు అవసరమైన విధాన రూపకల్పనలతో పాటు అనేక సేవా కార్యకలాపాల రంగంలో పాలుపంచుకుంటున్నాను. మనదేశంతో పాటు బాంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, భూటాన్, పాకిస్తాన్, మాల్దీవ్స్, శ్రీలంక, నేపాల్ దేశాల్లోని 500 పైగా ఉన్న అనేక స్వచ్ఛంద సంస్థలను సమన్వయపరుస్తూ... అవి తమ అవసరాలను, అభిప్రాయాలను అంతర్జాతీయ వేదికలపైన తెలియజెప్పే బాధ్యతలను, ప్రభుత్వ సహాయాలు అందేందుకు లోపరహితమైన విధాన రూపకల్పనలో పాలుపంచుకునే 'సౌత్ ఏషియన్ కాన్ఫరెన్స్ ఆన్ శానిటేషన్ ఫర్ ఆల్' (సాకోశాన్) ప్రాజెక్టులో పనిచేస్తున్నాను. అట్టడుగువర్గాలు, గిరిజనలతో పాటు వికలాంగులు, ట్రాన్స్‌జెండర్స్ లాంటివారి వెతలను అంతర్జాతీయ వేదికలపై వినిపించడమే కాకుండా... ఆ సేవలన్నీ వారికి ఎలా అందాలన్న విధాన రూపకల్పనపై ప్రభుత్వాలతో కలిపి పనిచేస్తుంటాం. ఈ కార్యక్రమాల కోసం బాగా వెనకబడిన ఆఫ్రికా దేశాలు మొదలుకొని... యూఎస్, ఫ్రాన్స్, బెల్జియమ్, కెనడా, స్విట్జర్లాండ్, స్వీడన్ వంటి దేశాల్లోని స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేస్తాం.

■ **మహిళగా వివక్షగానీ, ఇబ్బందులుగానీ ఎదుర్కొన్నారా?**

స్నేహలత : వివక్ష కాదుగానీ... ఇబ్బందులు చాలానే ఎదుర్కొన్నా. మారుమూల పల్లెలకూ, దట్టమైన అడవుల్లోని చాలా గిరిజన గ్రామాలకు వెళ్లాల్సి రావడంతో నన్ను తీసుకెళ్లడానికి తోటివాళ్లు ఇబ్బంది పడేవారు. పట్నంలో చదువుకున్న ఓ అమ్మాయి ఇలా గ్రామాలు పట్టుకు తిరగడం నాకంటే... నాతోటివాళ్లనీ, గ్రామస్తుల్ని ఇబ్బంది పెట్టేది. వాళ్లతో మమేకం కావడానికీ, వయసుకంటే పెద్దగా కనిపించడానికీ చీరకట్టుతో వెళ్తుండే దాన్ని. అడవిబాటల్లో చీరకట్టుతో ప్రయాణం అదో ఇబ్బంది. కాన్ఫరెన్స్‌ల కోసం ఇంగ్లిష్ తెలియని ఆఫ్రికా ఖండంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటనలు ఓ సవాల్. అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడాలేకుండా ఆఫ్రికాలోని బుర్కినాఫాస్ లాంటి చోట్లకు వెళ్లినప్పుడు కేవలం సైగలతో నెట్టుకురావడం లాంటివి ఇబ్బంది కలిగించేవే. ఒంటరిగా దాదాపు 35 దేశాలు తిరుగుతున్నప్పుడు కొన్ని అటవీ ప్రయాణాలు, అర్ధరాత్రి పయనాలు సాహసయాత్రకు తీసిపోనివిగా ఉండేవి. మహిళలకు ఫీల్డ్ జాబ్ అనువు కాదని ఈ రోజుల్లో అనుకోడానికి ఎంతమాత్రమూ వీల్లేదు. మూడు దశాబ్దాల కిందటే నేనూ, అలాగే మా తరంలోని అనేక మంది చేయగలిగినప్పుడు... ఇప్పుడిది ఓ అంశమే కాదు.

■ **ఈ సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్ కార్యకలాపాలూ, వాటిల్లో మీ భాగస్వామ్యం...**

ఇది రెండు విధాలుగా జరుగుతుంది. వివిధ దేశాల్లోని 500 స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో పాటు, బడుగువర్గాలు, నగర మురికివాడల్లోని పేద ప్రజల వెతలు తీర్చడానికి వివిధ దేశాల్లోని హైలెవల్ పొలిటికల్ కమిటీలు, ప్రభుత్వంలోని నేతలు, బాధ్యులందరూ తీసుకోవాల్సిన చర్యలు, అవి జరగడానికి అవసరమైన విధాన నిర్ణయాల రూపకల్పనలో తోడ్పాటు అందిస్తుంటాను. అలాగే అట్టడుగు వర్గాలు, గిరిజనుల గొంతుకను అంతర్జాతీయ వేదికలపై వినిపించడం... ఇదంతా ఒకవైపు కార్యక్రమం. ఇక మరోవైపున మా ప్రతిపాదనలు సాకారమయ్యాక... వీటి నిర్వహణకు కావలసిన పాలనాపరమైన ఆవశ్యకతలు, నిధులు... ఇవన్నీ అనేక దేశాల్లోని బడుగువర్గాలు, నగర మురికివాడల ప్రజలకు చేరేందుకు అవసరమైన సేవలందిస్తుంటాం.

■ **ఇన్ని దేశాల్లోని ఇన్నిన్ని మారుమూల ప్రాంతాల్లో కార్యకలాపాలకు నిధులెలా?**

మాకు యునిసెఫ్, శానిటేషన్ అండ్ వాటర్ ఫర్ ఆల్, వాటర్ ఎయిడ్, జీడబ్ల్యూపీ వంటివాటితో పాటు ఇంకా అనేక అంతర్జాతీయ సంస్థలు నిధుల్ని అందిస్తాయి.

■ **అంతర్జాతీయ కార్యకలాపాల్లోకి మీ ప్రవేశం... ఇందుకు దోహదపడ్డ నేపథ్యం...**

నా కెరియర్ కర్నూలులో మొదలైంది. వాన నీటిని ఒడిసిపట్టి, చెక్‌డ్యామ్స్ వంటివి నిర్మించి, భూగర్భజలాల వృద్ధికి తోడ్పడే 'వాటర్‌షెడ్' కార్యక్రమంలో చాలా చిన్నస్థాయి 'సోషల్ ఆర్గనైజర్'గా కెరియర్ ప్రారంభించా. ఈ కార్యక్రమంలో ఓ వ్యవసాయ అధికారి, ఓ ఇంజనీర్, ఓ ఫారెస్టు అధికారితోపాటు కలిసి ఫీల్డ్‌లో పనిచేయాలి. మారుమూల ప్రాంతాలతోపాటు కొన్నిసార్లు గిరిజన, అటవీ ప్రాంతాల్లోనూ పనిచేయాల్సి వచ్చేది. క్రమక్రమంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలూ, వేదికలపై కార్యకలాపాలతో పాటు ప్రపంచబ్యాంకుకూ, ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి సంస్థలకు కన్సల్టెన్సీ బాధ్యతలనూ నిర్వర్తించా. ప్రస్తుతం తాజాగా 'ఫాన్సా' లో ముఖ్యంగా సమన్వయ బాధ్యతలు. ఈ కార్యక్రమంలోనే భాగంగా హైదరాబాద్‌లోని మెట్రో వాటర్ బోర్డుతో కలిసి ఇక్కడ కూడా నీటి వృథా నివారించడం, వర్షపు నీటిని కాపాడుకోవడం కోసం ఓ ప్రాజెక్టులో భాగం పంచుకున్నా.

■ **భవిష్యత్తు కార్యకలాపాల గురించి ఏమైనా ప్రణాళికలు?**

ప్రస్తుతం ఈ సేవలతో పాటు కొంపల్లి ప్రాంతంలో 'నిశ్చింత' అనే వృద్ధాశ్రమం నడుపుతున్నా. అది నాకెంతో ఇష్టమైన సేవా కార్యక్రమం. చేయగలిగినంత కాలం చేశాక... నేనూ, నా భర్త... పూర్తిగా ఆర్గానిక్ ఫార్మింగ్‌నే ఎంచుకుని, ఎలాంటి లాభాపేక్ష లేకుండా వీలైనంతమందికి ఆరోగ్యాన్నివ్వాలన్నదే నా సంకల్పం.

ఆమె సంకల్పం నెరవేరాలని ఆశిద్దాం.

– యాసీన్
ఫొటో: రాజేశ్

ఒక్క క్లిక్‌తో ప్రపంచం మన గుప్పిట్లోకి వచ్చేసింది.
ఇంటర్నెట్ ఎన్నో అద్భుతాలను పరిచయం చేయడమే కాదు మరెన్నో అననుకూలతలనూ కలిగిస్తోంది.
స్మార్ట్ స్క్రీన్ కంటికి, మెదడుకు హాని కలిగించడమే కాదు డిజిటల్ మోసాలతో జేబుకు చిల్లు పడేస్తుంది.
కొత్త పరిచయాలతో స్నేహాలు వర్ధిల్లుతాయనుకుంటే ఏమరుపాటులో పరువు నెట్టింటికి చేరుతుంది.
రాబోయే కొత్త సంవత్సరం, కొత్త జోష్‌లో డిజిటల్ ప్రపంచానికి సంబంధించి కొన్ని కచ్చితమైన తీర్మానాలు తీసుకోవాల్సిందే!

సైబర్ టాక్

కొత్త సంవత్సరంలో కొత్త డిజిటల్ తీర్మానాలు

చదువు, పని లేదా వ్యాపారంలో రాణించడమే మీ ప్రాథమిక లక్ష్యాలలో ఒకటి అయితే, మీ వాస్తవ తీర్మానాలపై దృష్టి కేంద్రీకరించడానికి డిజిటల్, సోషల్ మీడియా డిటాక్స్‌కి ఇది సరైన సమయం. అంతేకాదు లోన్ యాప్‌లంటూ దోపిడీ, కస్టమర్ కేర్ అంటూ ఎర, ఓటీపీ చెప్పమనో, స్క్రీన్ షేర్ చేయమనో, క్యూ ఆర్ కోడ్ తోనో, వీడియో గేమ్స్, వర్క్ ఫ్రమ్ హోమ్ అంటూనో.. డిజిటల్ మోసగాళ్ల ఎత్తులకు అడ్డుకట్ట వేయాలన్నా, ఆన్‌లైన్‌లో సురక్షితంగా ఉండాలన్నాఎంతో సమాచారం మీ కోసం సిద్ధంగా ఉంది.



- మీ హోమ్ స్క్రీన్‌ను నియంత్రించండి. స్టోరేజ్ స్పేస్‌ను సెట్ చేయడంతో పాటు హోమ్ స్క్రీన్‌పై ముఖ్యమైన యాప్‌లు మాత్రమే ఉండేలా చూసుకోండి. అంతగా అవసరం లేనివి, ఇతర యాప్‌లను ఫోల్డర్‌లలో సెట్ చేయండి.
- కుటుంబసభ్యులు, బంధు, మిత్రులతో డిజిటల్ పరికరాలు లేని చర్చల్లో పాల్గొనండి.
- స్మార్ట్ ఫోన్ స్క్రీన్ రంగురంగులతో కాకుండా గ్రేస్కేల్ మోడ్‌ని ఉపయోగించండి.
- ఆండ్రాయిడ్‌లో డిజిటల్ వెల్‌బీయింగ్ యాప్, ఐఓఎస్‌లో స్క్రీన్ టైమ్ యాప్‌తో ప్రతిరోజూ స్క్రీన్‌ల ముందు ఎన్ని గంటలు గడుపుతున్నారో ట్రాక్ చేయచ్చు.
- కొత్త సంవత్సరంలో కొత్త లక్ష్యాలను ఏర్పరచుకున్న తర్వాత, మీరు మీ స్క్రీన్ సమయాన్ని, డిజిటల్ శ్రేయస్సును కూడా పరిమితం చేయాలి. మీరు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఇతర సోషల్‌మీడియా యాప్‌లను స్క్రోల్ చేయడానికి ప్రయత్నించినప్పుడు, ఈ సెట్టింగ్ మీకు తెలియజేస్తుంది.
- 20 నిమిషాల పాటు ఎలక్ట్రానిక్ పరికరాల నుండి విరామం తీసుకోండి. ప్రతి 20 నిమిషాలకు, 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలో ఉన్నదాన్ని చూడండి. లేదంటే.. (ఎ) నొప్పి, అసౌకర్యం పెరుగుతాయి. (బి) కళ్ళు మంట, దురద మొదలవుతాయి. (సి) కంటి చూపు తగ్గుతుంది. (డి) కంటి అలసట (ఇ) కంటి ఒత్తిడి తల నొప్పికి కారణమవుతుంది.

డిజిటల్ బ్రేక్...

స్మార్ట్‌ఫోన్ వచ్చాక దాని వల్ల పొందే సౌలభ్యం కారణంగా మన జీవితాలు, ఆసక్తులపై అది ఆధిపత్యం చలాయిస్తోంది. స్మార్ట్‌ఫోన్ వాడకంలోని ప్రతికూల అంశాలు మనస్తత్వవేత్తలు, వైద్యులు, సామాజిక సంస్థల దృష్టికి వచ్చాయి. వ్యక్తులలో మూడింట రెండు వంతుల మంది స్మార్ట్‌ఫోన్‌లు చేతిలో లేకుండా ఇంటి నుంచి బయటకు రావడం లేదని వివిధ దేశాల నుండి ఇప్పటికే ఉన్న నివేదికలు తెలియజేస్తున్నాయి. డిజిటల్ బ్రేక్ తీసుకున్నప్పుడు చాలామందిలో మంచి ప్రయోజనాలు కనిపించాయి. ఒత్తిడిని తగ్గిస్తుంది, తప్పిపోతామేమో అనే భయాన్ని తగ్గిస్తుంది, నిద్ర అలవాట్లను మెరుగుపరుస్తుంది, పని, జీవన సమతుల్యతను కాపాడుకోవడంలో సహాయపడుతుంది. మరింత సానుకూల ప్రభావాన్ని తీసుకువస్తుంది.

డిజిటల్ డీటాక్స్ కోసం...

- మీ స్మార్ట్‌ఫోన్‌లో నోటిఫికేషన్‌లను నిలిపివేయండి. దీని వల్ల మీకు ఏ నోటిఫికేషన్ అవసరమో, ఏది అనవసరమో తెలిసి వస్తుంది.
- మీ పడకగది, భోజనాల గదిని స్మార్ట్‌ఫోన్ రహిత జోన్‌గా మార్చండి. మీరు బెడ్‌రూమ్ బయట మీ స్మార్ట్‌ఫోన్‌ను ఛార్జ్ చేయాలనే నిర్ణయాన్ని కచ్చితంగా పాటించండి.
- స్మార్ట్‌ఫోన్‌కు బదులుగా ల్యాప్‌టాప్ లేదా డెస్క్‌టాప్ కంప్యూటర్ నుండి సోషల్ మీడియాను యాక్సెస్ చేయండి. దీని వల్ల మీరు సోషల్ మీడియా షెడ్యూల్‌ను సెట్ చేసుకోవచ్చు.

డిజిటల్ భద్రత...

- మీ పెంపుడు జంతువుల పేర్లు, ఇంటిపేర్లు పాస్‌వర్డ్‌లుగా పెట్టుకోవద్దు. పాస్‌వర్డ్‌లు ఎప్పుడూ కనీసం ఒక పెద్ద అక్షరం, ఒక అంకె, ఒక ప్రత్యేక అక్షరాన్ని కలిగి ఉండాలి. దీని వల్ల డిజిటల్ ఫ్రాడ్స్‌కి పాస్‌వర్డ్ అంచనా కష్టమవుతుంది.
- సోషల్ మీడియా వాయిస్ లేని వారికి వాయిస్ ఇస్తుండగా, ఒక నిఘా సమాజం కూడా ఉంటుంది. దీనిలో వాయిస్‌లెస్‌గా మారడం మనుగడకు తెలివైన మార్గం.
- సురక్షిత వెబ్‌సైట్‌లకు యాక్సెస్ పరిమితి (htt-ps://) URL మొదట్లో HTTPS అని ఉంటే, మీరు సురక్షితంగా ఉన్నారని అర్థం.
- కంపెనీలు తమ వ్యాపార ప్రకటనల ప్రచారాలు, ఉత్పత్తులు, సేవలకు తగిన సమాచారాన్ని అందించడానికి మన అలవాట్లు, ప్రాధాన్యతలు, ఎంపికలు, ప్లేస్.. వీటన్నింటినీ మన ఫోన్, ఇతర డిజిటల్ పరికరాల నుండి GPS ద్వారా ట్రాక్ చేస్తాయి. చివరికి భాగస్వామ్యం చేస్తాయి. దీని వల్ల మన అనుమతి లేకుండానే థర్డ్ పార్టీకి ఈ సమాచారం చేరుతుంది.
- మీ ముఖ్యమైన డేటా సాధారణ బ్యాకప్ ఏ నెట్‌వర్క్‌కు కనెక్ట్ చేయలేదని నిర్ధారించుకోండి.
- ఫిషింగ్, విషింగ్, స్మిషింగ్ టెక్స్ట్ మెసేజ్‌లు లింక్‌పై క్లిక్ చేయడం లేదా అటాచ్‌మెంట్‌ను తెరవడం కోసం మిమ్మల్ని మోసగించడానికి తరచుగా ఏదో ఒక స్టోరీ చెబుతాయి. ఇమెయిల్/ సోషల్ మీడియా, వాట్సప్ లేదా ఎసెమ్మెస్ ద్వారా వచ్చిన చిన్న లింక్‌లపై ఎప్పుడూ క్లిక్ చేయవద్దు. వాటిని క్లిక్ చేయడానికి ముందు ఫిషింగ్ (https://isitphishing.org/) కోసం తనిఖీ చేయండి.
- మీ డిజిటల్ పరికరంలో డేటాను రక్షించడంలో ఫైర్‌వాల్ సహాయం చేసినట్లే, ఆన్‌లైన్ నెట్‌వర్క్‌లలో VPN రక్షిస్తుంది.
- రెండు కారకాల ప్రమాణీకరణను ఉపయోగించడం మంచిది. మన గుర్తింపుకు రెండు పద్ధతుల ద్వారా యాక్సెస్ ఉండేలా చూసుకుంటే భద్రత బలోపేతమవుతుంది.



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,**
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

బుధవారం ఒక వీడియో వైరల్ అయ్యింది.
ఢిల్లీ నోయిడాలోని ఒక సొసైటీలో 20 ఏళ్ల పనిమనిషిని ఆమె యజమాని బలవంతంగా లాక్కుని పోయే వీడియో అందరూ చూశారు.
'పని చేయను మొర్రో' అంటున్నా వినకుండా ఆ పనిమనిషిని తన ఇంటికి తీసుకెళ్లి హింసించింది ఆ యజమాని.
ఇటీవల మనిమనుషులను హింసించి వార్తలకెక్కుతున్న యజమానులు ఎక్కువగా ఉన్నారు.
పని మనుషులు స్త్రీలు.
ఇంట్లో పని చేయించునేది స్త్రీలే.
సమ దృష్టితో పని చేయించుకోకపోతే కేసుల్లో చిక్కుకోవాల్సి వస్తుంది.
అశాంతితో గడపాల్సి వస్తుంది.
పని మనుషులతో పని విధానం ఎలా ఉండాలి?

సమ దృష్టి

పని మనుషులూ మనుషులే

లోకంలో పని మనుషుల మీద ఉన్నన్ని జోకులు మరెవరి మీదా ఉండవు. పని మనుషులు 'డిమాండ్స్' పెట్టడం గురించి ఈ జోకులన్నీ ఉంటాయి. వారి పని పద్ధతి గురించి కూడా జోకులుంటాయి. 'పని మనుషులు' కూడా 'ఇంత పని మాత్రమే చేస్తాం'... 'ఇంత జీతానికే చేస్తాం' అని డిమాండ్ చేయడం 'యజమానులకు' వింతగా, నవ్వులాటగా, సహించలేని వ్యవహారంగా అనిపిస్తుంది. కాని ఈ యజమానులు లేదా వారి పిల్లలు ఉద్యోగాల్లో చేరేటప్పుడు తప్పనిసరిగా పని స్వభావం, పని గంటలు, జీతం తెలుసుకుని అందుకు అంగీకారమైతేనే చేరుతారు. పని మనుషులు మాత్రం తమ వద్ద అలా ఉండటాన్ని భరించలేరు.

■ **తాజా ఘటన**

పని మనుషులు 'అతీగతీ' లేని వారు అనే భావనతో వారితో ఎలాగైనా వ్యవహరించవచ్చని యజమానులు అనుకుంటే వారు పోలీసు కేసుల వరకూ వెళ్లాల్సి ఉంటుందని నోయిడాలో జరిగిన తాజా ఘటన తెలియచేస్తోంది. నోయిడా సెక్టర్ 120లో షెఫాలీ కౌల్ అనే మహిళ తన వద్ద పని చేసే 20 ఏళ్ల అనిత అనే అమ్మాయిని లిఫ్ట్‌లో నుంచి తన ఫ్లాట్‌కు ఈడ్చుకుంటూ వెళ్లే వీడియో వైరల్ అయ్యింది. ఆమె వద్ద పని చేసే ఒప్పందం అక్టోబర్‌తో ముగిసినా ఇంకా పని చేయవలసిందేనని ఆమె బలవంతం చేస్తున్నదని, ఇంట్లో నిర్బంధిస్తోందని, తిడుతోందని, కొడుతోందని అనిత తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వీడియో ఇందుకు సాక్ష్యం పలుకుతోంది. నేరం రుజువైతే షెఫాలీ కౌల్‌కు శిక్ష తప్పదు. దేశంలో ఇటీవల ఇలాంటి ఘటనలు ఎక్కువయ్యాయి. మనకు సేవ చేసేవారు మనకంటే తక్కువ అనే భావన పాతుకుపోవడం వల్లే ఇలా జరుగుతుంది.



బుధవారం వైరల్ అయిన వీడియో దృశ్యం



ఇవి చేయండి

- మీకు ఎన్ని పని గంటలు కావాలో ముందే స్పష్టంగా చెప్పండి
- ఏమేమి పనులు చేయాలో తప్పనిసరిగా ముందే చెప్పండి
- వారానికి ఒకరోజు సెలవు (ఒక పూటైనా) ఇవ్వండి
- అనారోగ్యం ఉంటే బలవంతంగా పని చేయించకండి
- పండగలకు బక్షీసు ఇవ్వండి
- చీటికి మాటికి జీతం కోయకండి
- పరుష పదజాలం ఉపయోగించకండి
- పని చేస్తుంటే వెంట ఉంటూ అజమాయిషీ చేయకండి
- మీరు తినలేనివి పెట్టకండి

■ **పని మనుషులు నిస్సహాయులు**

పనికి సంబంధించిన ఎటువంటి గ్యారంటీ లేని నిస్సహాయులుగానే పని మనుషులు వున్నారు. యజమానులు వారిని ఎప్పుడైనా తీసుకోవచ్చు. ఎప్పుడైనా తీసేయొచ్చు. వారికి కనీస వేతన చట్టం వర్తించదు. సెలవులు ఉండవు. ప్రసూతి సెలవులు చాలా పెద్ద మాట. రోజూ వచ్చిపోతూ పని చేసే పని మనుషుల కంటే ఇంట్లోనే ఉంటూ పని చేసే వారికి యజమానులు చెడ్డవాళ్లయితే నరకం కనిపిస్తున్న దాఖలాలు ఉన్నాయి. తమ వద్దే గతి లేకుండా ఉన్నారన్న ఉద్దేశంతో వీరి చేత చాకిరి విపరీతంగా చేయించడమే కాదు... ఏదైనా తప్పు జరిగినా/మాట వినకపోయినా దండన కూడా ఉంటుంది. ఆ దండన–

- జీతం ఆపడం
- ఆకలికి మాడ్చడం
- నిద్ర లేకుండా పని చేయించడం
- కొట్టడం
- హింసించడం
- దొంగతనం నిందలు వేయడం

కొన్ని సంఘటనల్లో లైంగిక దాడులు కూడా జరపడం. ఇవన్నీ శిక్షార్హమైన నేరాలని యజమానులు గుర్తుంచుకుంటే మంచిది. కాని యజమానుల ధోరణి అహంతో నిండి ఉంటోంది. కొంత కాలం క్రితం ముంబైలోని ఒక సొసైటీలో పని మనుషులందరూ తమకు జీతాలు తక్కువ ఉన్నాయని పనిలోకి రాబోమని ఈ సొసైటీ ఎదుట ధర్నా చేశారు. అప్పుడు యజమానులు తగ్గి జీతం పెంచారు. కాని కొన్ని నెలల్లోనే ఎవరైతే ఆ 'విప్లవం' లేవదీశారో వారందరి పని పోయింది. మెల్ల మెల్లగా తీసేశారు. మళ్లీ తక్కువ జీతానికి పని చేసే వాళ్లే పనిలో కుదరాల్సి వచ్చింది.

■ **పని మనుషులూ మనుషులే**

పని మనుషులూ మనుషులే. పని మనుషులుగా ఇళ్లల్లో పని చేసేది, చేయాల్సింది స్త్రీలే. వీరంతా నిరుపేద వర్గం నుంచి వచ్చినవారే అయి ఉంటారు. వారికి కుటుంబాలు ఉంటాయి... పిల్లలు ఉంటారు... బాధ్యతలు ఉంటాయి... అనారోగ్యాలు ఉంటాయి... భర్తల నుంచి ఏదో ఒక మేరకు వొత్తిళ్లు ఉంటాయి... సమస్యలు ఉంటాయి... అని గుర్తుంచుకోవాలి. ఎన్నో ఇబ్బందులు ఉండి ఆ ఇబ్బందుల్లో బతుకు గడవడానికి వారు పనిలో చేరుతారు. ఇంటికి సంబంధించిన 'మురికి'ని శుభ్రం చేస్తారు. వారి సహాయం, శ్రమ లేకుండా ఇళ్లు శుభ్రపడవు. యజమానులు సౌకర్యంగా తమ పనులు చేసుకోలేరు. అందువలన వారితో స్నేహంగా, సమదృష్టితో వ్యవహరించడం అవసరం. వారి అవసరాలు అన్నీ తీర్చాల్సిన పని లేదు కాని ఒక్కోసారి వారి బాధను పట్టించుకోవడం కూడా అవసరమే. కుటుంబంలో ఒకరిగా మారి దశాబ్దాల పాటు పని చేసిన మనుషులు, పని మనిషిని కుటుంబ సభ్యులతో సమానంగా చూసుకునే యజమానులు ఎందరో ఉన్నారు. కాని అలా కాకుండా 'మనం అనేవాళ్లం... వాళ్లు పడేవాళ్లు' అనే భావన ఉంటేగనక అలాంటి భావనను మార్చుకోక తప్పదు. కొందరి ఇళ్లల్లో పని మనుషులు నెలకు మించి నిలువరు. పని మనుషులను మార్చుతూ వెళతారు కాని తాము మారరు.

ముగ్గు - ముచ్చట




32 చుక్కలు
6 వరుసలు:
6 వచ్చేవరకు



ప్రతిభ, నవాబ్‌పేట, మహబూబ్‌నగర్



జాస్తి భాగ్యలక్ష్మి, బంటుమిల్లి, కృష్ణా జిల్లా



15–8
మధ్య చుక్కలు



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు–ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com



నాలుగో స్థానానికి అశ్విన్

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తాజా ర్యాంకింగ్స్‌లో భారత అగ్రశ్రేణి స్పిన్నర్ ఒక స్థానం మెరుగుపర్చుకొని నాలుగో ర్యాంక్‌కు చేరుకున్నాడు. బంగ్లాదేశ్‌తో రెండో టెస్టులో 6 వికెట్లు తీసిన అశ్విన్ భారత్ గెలుపులో కీలక పాత్ర పోషించాడు. ఇదే సిరీస్‌లో బ్యాటింగ్‌తో ఆకట్టుకున్న శ్రేయస్ అయ్యర్ పది స్థానాలు మెరుగుపర్చుకొని తన కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్ (16)కు చేరుకున్నాడు. ఇతర భారత బ్యాటర్లలో చతేశ్వర్ పుజారా 19వ స్థానానికి, విరాట్ కోహ్లి 14వ స్థానానికి పడిపోయారు.

ఎమర్జింగ్ ప్లేయర్ రేసులో అర్‌్షదీప్

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 'ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు కోసం భారత యువ పేస్ బౌలర్ అర్‌్షదీప్ సింగ్ పోటీ పడుతున్నాడు. ఈ అవార్డు కోసం ఐసీసీ నామినేట్ చేసిన నలుగురు ఆటగాళ్ల జాబితాలో అర్‌్షదీప్ ఒకడు. దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ మార్కో జాన్సన్, న్యూజిలాండ్ చెందిన ఫిన్ అలెన్, అఫ్గనిస్తాన్ ఆటగాడు ఇబ్రహీం జద్రాన్‌లు అవార్డు కోసం నామినేట్ అయ్యారు. 21 అంతర్జాతీయ టి20ల్లో అర్‌్షదీప్ 18.12 సగటుతో 33 వికెట్లు పడగొట్టాడు.



విరామం... విశ్రాంతి... వేటు..!



బీసీసీఐకి ఇది కొత్త కాదు... ఏదైనా సిరీస్ కోసం జట్టును దాదాపు అర్ధరాత్రి సమయంలో ప్రకటించడమే కాదు... పేర్లు మినహా ఎంపిక గురించి కనీసం ఏకవాక్య సమాచారం కూడా ఇవ్వకపోవడం రివాజుగా మారింది. ఫలానా ఆటగాడిపై వేటు వేశామనో, ఫిట్‌నెస్ లేదనో, లేదంటే విశ్రాంతినిచ్చామనో, లేదా ఆటగాడు కోరుకుంటే విరామం ఇచ్చామనో ఏమీ ఉండదు... తగిన కారణం లేకుండా ఆటగాళ్ల పేర్లు మాత్రం మారిపోతాయి. మరో వైపు ఉద్వాసనకు గురైన సెలక్షన్ కమిటీతోనే కొత్త జట్లను కూడా ఎంపిక చేయించడం కూడా ఆశ్చర్యం కలిగించే అంశం. ఈ నేపథ్యంలో తాజాగా శ్రీలంకతో సిరీస్‌లకు ప్రకటించిన జట్లను విశ్లేషిస్తే...

శ్రీలంకతో సిరీస్‌లకు భారత జట్టు

వచ్చే ఏడాది స్వదేశంలోనే వన్డే ప్రపంచకప్ జరుగనున్న నేపథ్యంలో సీనియర్ సెలక్షన్ కమిటీ కీలక ఆటగాళ్లపై ఒత్తిడి తగ్గించే నిర్ణయాలే తీసుకుంది. అందువల్లే రోహిత్, కోహ్లి, రిషభ్ పంత్, బుమ్రా, రాహుల్‌లను ఎంపిక చేసే విషయంలో జాగ్రత్తలు తీసుకుంది. అందులో కొందరిని టి20లకు తీసుకుంటే... మరికొందరిని వన్డేలకు ఎంపిక చేసింది. బుమ్రాలాంటి ఆటగాడిని ప్రపంచకప్ దృష్టితో చూసి ఏ సిరీస్‌కూ ఎంపిక చేయలేదు. నిజానికి అతను ఫిట్‌గానే ఉన్నాడు. అయితే తొందరపడి వెంటనే అంతర్జాతీయ క్రికెట్ బరిలో ఇప్పుడప్పుడే దింపకూడదని సెలక్టర్లు భావించారు. బంగ్లాలో గాయపడిన రోహిత్ ప్రస్తుతం కోలుకున్నాడు. నెట్ ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. ఇంకో వారం, పదిరోజుల్లో అతను పూర్తి ఫిట్‌నెస్ సంతరించుకుంటాడు. అందువల్లే అతన్ని వన్డేలకు ఎంపిక చేశారు. మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ కోహ్లి, కేఎల్ రాహుల్ విశ్రాంతి కోరకపోయినప్పటికీ సెలక్టర్లే టి20లకు రెస్ట్ ఇచ్చి వన్డే జట్టులోకి తీసుకున్నారు. బుమ్రాను ప్రపంచకప్ దృష్టితో చూసినట్టే... రిషభ్ పంత్‌ను సొంతగడ్డపై ఆసీస్‌తో జరిగే టెస్టు సిరీస్ కోసం బ్రేక్ ఇచ్చారు. కంగరూతో సిరీస్‌లో కీలకపాత్ర పోషించగలడని భావిస్తున్న పంత్‌ను కండిషనింగ్ క్యాంపునకు పంపారు. ఈ ఏడాది అతను అన్ని ఫార్మాట్లలో కలిపి 44 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. బిజీ షెడ్యూలు నుంచి కాస్త తెరిపినివ్వాలనే ఉద్దేశంతోనే అతన్ని బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీకి పంపారు. జడేజా విషయానికి వస్తే ముందుగా అతని మ్యాచ్ ఫిట్‌నెస్‌ను పరిశీలించాకే జాతీయ జట్టులోకి తీసుకోవాలని సెలక్షన్ కమిటీ భావించింది. గత సీజన్‌లో పేస్ బౌలింగ్‌తో ఆకట్టుకున్న ప్రసిధ్ కృష్ణ, ఆల్‌రౌండర్ దీపక్ చహర్ గాయాల నుంచి ఇంకా వంద శాతం కోలుకోలేదు. సీనియర్ సీమర్ భువనేశ్వర్‌ను అసలు పరిశీలించలేదు. దీంతో వచ్చే ప్రపంచకప్‌లో ఆడే టీమిండియా జట్టులో భువనేశ్వర్ భాగంగా లేడని సెలక్టర్లు సంకేతాలు ఇచ్చినట్లయింది. స్పిన్నర్లలో అనుభవజ్ఞుడైన చహల్‌పైనే సెలక్టర్లు నమ్మకముంచారు. దీంతో రవి బిష్ణోయ్‌కి అవకాశం లేకపోయింది. స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్, హైదరాబాద్ పేసర్ సిరాజ్‌లు ఫామ్‌లోనే ఉన్నారు. వారి ఆటతీరుపై సెలక్టర్లకు అసంతృప్తి ఏమీ లేదు... కానీ పొట్టిసిరీస్‌కు మాత్రం వీళ్లిద్దరికి విశ్రాంతినిచ్చింది.

భావి కెప్టెన్ అంచనాలతో...

హార్దిక్ పాండ్యా నాయకత్వ సత్తా ఏంటో ఐపీఎల్‌లో ఒకే ఒక్క సీజన్‌తో చాటిచెప్పాడు. రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ గైర్హాజరీలోనూ పగ్గాలు చేపట్టి జట్టును నడిపించాడు. ఈ నేపథ్యంలో భావి కెప్టెన్ అంచనాలున్న ఆల్‌రౌండర్ పాండ్యాకు జట్టులో ఒక రకంగా పూర్తి స్థాయి వైస్ కెప్టెన్సీతో పదోన్నతి ఇచ్చారు. టాపార్డర్‌లో ఇటీవల మంచి అవకాశాలు కల్పించినప్పటికీ పేలవమైన ఆటతీరు కనబరిచిన ధావన్‌పై సెలక్టర్లు వేటు వేశారు. ఇషాన్ కిషన్, శుబ్‌మన్ గిల్ లాంటి ప్రతిభావంతులు నిలకడగా రాణిస్తుండటంతో ఇక ధావన్ ఆటకు తెరపడినట్లే భావించవచ్చు.

-సాక్షి క్రీడా విభాగం

అంజలి శర్వాణికి చోటు

- శిఖా పాండే పునరాగమనం
- టి20 ప్రపంచకప్‌కు భారత జట్టు ప్రకటన

ముంబై: సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో ఆకట్టుకున్న ఆంధ్రప్రదేశ్ లెఫ్టార్మ్ పేసర్ కేశవ రాజుగారి అంజలి శర్వాణికి తొలి వరల్డ్ కప్ అవకాశం లభించింది. ఫిబ్రవరి 10నుంచి 26 వరకు దక్షిణాఫ్రికాలో జరిగే ప్రపంచకప్‌లో పాల్గొనే భారత జట్టును సెలక్టర్లు బుధవారం ప్రకటించారు. కర్నూల్ జిల్లా ఆదోనికి చెందిన 25 ఏళ్ల అంజలి ఆస్ట్రేలియాతో ఆడిన 5 టి20ల్లో 8.73 ఎకానమీతో 3 వికెట్లు తీసింది.

మరో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సబ్బినేని మేఘనను రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపిక చేశారు. అయితే వరల్డ్ కప్‌కు ముందు దక్షిణాఫ్రికా, వెస్టిండీస్‌లతో భారత్ ఆడే ముక్కోణపు సిరీస్ కోసం ప్రకటించిన టీమ్‌లో మాత్రం మేఘనకు అవకాశం దక్కింది. మరో వైపు దాదాపు ఏడాది కాలంగా జట్టుకు దూరమైన పేసర్ శిఖాపాండేకు మళ్లీ పిలుపు లభించింది. వచ్చే నెలలో జరిగే అండర్-19 ప్రపంచకప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్న రిచా ఘోష్, షఫాలీ వర్మ నెల రోజుల వ్యవధిలో సీనియర్ టీమ్ తరఫున కూడా వరల్డ్ కప్ ఆడనుండటం విశేషం.



ప్రపంచ కప్‌కు భారత జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ వర్మ, యస్తిక భాటియా, రిచా ఘోష్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, దేవిక వైద్య, రాధా యాదవ్, రేణుక ఠాకూర్, అంజలి శర్వాణి, రాజేశ్వరి గైక్వాడ్, శిఖా పాండే, పూజ వస్త్రకర్ (ఫిట్‌నెస్ సాధిస్తేనే). **రిజర్వ్‌లు:** సబ్బినేని మేఘన, స్నేహ్ రాణా, మేఘన సింగ్

ముక్కోణపు టోర్నీకి భారత జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, యస్తిక భాటియా, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, దేవిక వైద్య, రాజేశ్వరి గైక్వాడ్, రాధా యాదవ్, రేణుక ఠాకూర్, మేఘన సింగ్, అంజలి శర్వాణి, సుష్మ వర్మ, అమన్‌జోత్ కౌర్, సబ్బినేని మేఘన, స్నేహ్ రాణా, శిఖా పాండే, పూజ వస్త్రకర్ (ఫిట్‌నెస్ సాధిస్తేనే).

సవితశ్రీకి కాంస్యం

- ఐదో స్థానంతో ముగించిన అర్జున్
- వరల్డ్ ర్యాపిడ్ చెస్ టోర్నీ

అల్మాటీ (కజకిస్తాన్): 'ఫిడే' ప్రపంచ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో మహిళల ఈవెంట్‌లో భారత్‌కు చెందిన 15 ఏళ్ల టీనేజర్ సవిత శ్రీ గ్రాండ్‌మాస్టర్లను ఢీకొట్టి కాంస్య పతకం సాధించింది. విశ్వనాథన్ ఆనంద్, కోనేరు హంపి తర్వాత వరల్డ్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో పతకం నెగ్గిన మూడో భారత క్రీడాకారిణిగా సవిత శ్రీ నిలిచింది. మహిళా ఇంటర్నేషనల్ మాస్టర్ అయిన సవిత ఈ టోర్నీలో 36వ సీడ్‌గా బరిలోకి దిగి మూడో స్థానంలో నిలిచింది. బుధవారం జరిగిన మూడు రౌండ్లలో ఆమె 1.5 పాయింట్లు సాధించింది. దీంతో మొత్తం 8 పాయింట్లతో కాంస్యం గెలుచుకుంది. తొమ్మిదో రౌండ్లో జాన్సయ అబ్దుమలిక్ (కజకిస్తాన్) చేతిలో ఓడటంతో ఆమె రజత అవకాశానికి గండి పడింది. పదో రౌండ్లో క్వియాన్‌యున్ (సింగపూర్)పై గెలిచిన సవిత... ఆఖరి రౌండ్లో దినార సదుకసొవా (కజకిస్తాన్)తో గేమ్‌ను డ్రా చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ సీనియర్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి కూడా 8 పాయింట్లు సాధించినప్పటికీ సూపర్ టై బ్రేక్ స్కోరు ఆధారంగా ఏపీ అమ్మాయి ఆరో స్థానంలో నిలిచింది. ద్రోణవల్లి హారిక 29వ స్థానంతో నిరాశ పరిచింది. ఓపెన్ కేటగిరీలో జరిగిన ప్రపంచ ర్యాపిడ్ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ (9) ఐదో స్థానంలో నిలిచాడు. 8 రౌండ్లలో గెలిచి 3 ఓడిన అర్జున్ 2 రౌండ్లు డ్రా చేసుకున్నాడు. ఈ విభాగంలో ఇందులో ప్రపంచ నంబర్‌వన్, చాంపియన్ కార్ల్‌సన్ (10) విజేతగా నిలిచాడు. భారత సీనియర్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ 77వ స్థానంలో నిలిచాడు.



అలెక్స్ క్యారీ సెంచరీ

మెల్‌బోర్న్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టుపై ఆస్ట్రేలియా పట్టు బిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 386/3తో ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా తమ తొలి ఇన్నింగ్స్‌ను 8 వికెట్ల నష్టానికి 575 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ (149 బంతుల్లో 111; 13 ఫోర్లు) టెస్టు కెరీర్‌లో తొలి సెంచరీ సాధించగా... కామెరాన్ గ్రీన్ (51 నాటౌట్), ట్రవిస్ హెడ్ (51) అర్ధ సెంచరీలు చేశారు. రెండో రోజు రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగిన వార్నర్ (200) మళ్లీ క్రీజ్‌లోకి వచ్చి తొలి బంతికే క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. నోర్జేకు 3 వికెట్లు దక్కాయి. ఆసీస్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 386 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా ఆట ముగిసే సమయానికి కెప్టెన్ ఎల్గర్ (0) వికెట్ కోల్పోయి 15 పరుగులు చేసింది. ఎర్వీ (7 నాటౌట్), డి బ్రూన్ (6 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నారు. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే దక్షిణాఫ్రికా మరో 371 పరుగులు చేయాలి.



ఆధిక్యంలోకి న్యూజిలాండ్



కేన్ విలియమ్సన్

కరాచీ: కెప్టెన్ కేన్ విలియమ్సన్ (222 బంతుల్లో 105 నాటౌట్; 11 ఫోర్లు)తో పాటు టామ్ లాథమ్ (191 బంతుల్లో 113; 10 ఫోర్లు) కూడా సెంచరీలు నమోదు చేయడంతో పాకిస్తాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ స్వల్ప ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మ్యాచ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు కోల్పోయి 440 పరుగులు చేసింది. ఫలితంగా 2 పరుగుల ఆధిక్యం అందుకుంది. డెవాన్ కాన్వే (176 బంతుల్లో 92; 14 ఫోర్లు) శతకం చేజార్చుకోగా... బ్లన్‌డెల్ (47), మిచెల్ (42) రాణించారు. పాక్ బౌలర్లలో అబ్రార్‌కు 3 వికెట్లు దక్కాయి. ప్రస్తుతం విలియమ్సన్‌తో పాటు ఇష్ సోధి (1 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నాడు. కెరీర్‌లో 25వ శతకం సాధించిన విలియమ్సన్... భారత్, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, యూఏఈలలో సెంచరీ చేసిన తొలి ఆసియాయేతర బ్యాటర్‌గా ఘనత సాధించాడు.

కెప్టెన్‌గా దసున్ షనక

కొలంబో: భారత్‌తో పరిమిత ఓవర్ల క్రికెట్ సిరీస్‌లలో పాల్గొనే శ్రీలంక జట్టును బుధవారం ప్రకటించారు. రెండు ఫార్మాట్లకు కలిపి 20 మంది సభ్యులతో కూడిన జట్టుకు షనక సారథ్యం వహిస్తాడు. వచ్చే నెలలో లంక జట్టు మూడు టి20లు (3, 5, 7 తేదీల్లో), మూడు వన్డేలు (10, 12, 15 తేదీల్లో) ఆడుతుంది.

జట్టు వివరాలు

షనక (కెప్టెన్), అషీన్ బండార, నిసాంక, తీక్షణ, ఫెర్నాండో, కరుణరత్నే, సమరవిక్రమ, కాసున్ రజిత, కుశాల్, మదుషంక, అసలంక, వెల్లలగే, ధనంజయ డిసిల్వా, ప్రమోద్ మదుశాన్, హసరంగ, లహిరు కుమార.
టి20లకు మాత్రమే: భానుక రాజపక్స, తుశార.
వన్డేలకు మాత్రమే: వండెర్సే, నువానిడు ఫెర్నాండో.

హైదరాబాద్‌లోని గాడియమ్ స్కూల్‌లో సీబీఎస్‌ఈ జాతీయ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. దేశవ్యాప్తంగా 750 పాఠశాలలకు చెందిన 1700 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. అండర్-17 ఆల్‌రౌండ్ కేటగిరీలో గాడియమ్ స్కూల్‌కే చెందిన నిషిక ప్రవీణ్ అగర్వాల్ మొదటి స్థానంలో, నారాయణి మూడో స్థానంలో నిలిచారు. భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, జాతీయ అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేశ్ విజేతలకు బహుమతులు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో అరవిందో ఫార్మా డైరెక్టర్ మదన్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సినిమా

• ఇయర్ రౌండప్

అక్కడ హిట్... ఇక్కడ ఫట్

విదేశీ తెరపై హిట్టయిన సినిమా ఇక్కడ కూడా హిట్టవుతుందా? అంటే 'గ్యారంటీ' ఇవ్వలేం. అందుకు ఉదాహరణ ఈ ఏడాది విడుదలైన దాదాపు అరడజను చిత్రాలు. అక్కడ హిట్టయిన చిత్రాలు రీమేక్ రూపంలో వచ్చి, ఇక్కడ ఫట్ అయ్యాయి. ఆ రీమేక్ చిత్రాలను రౌండప్ చేద్దాం.






అరడజను ఆస్కార్ అవార్డ్స్ సాధించిన హాలీవుడ్ ఫిల్మ్ 'ది ఫారెస్ట్‌గంప్' (1994) హిందీలో 'లాల్‌సింగ్ చడ్డా'గా రీమేక్ అయింది. టైటిల్ రోల్‌ను ఆమిర్ ఖాన్ చేయగా, అద్వైత్ చందన్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో నాగచైతన్య ఓ కీ రోల్ చేశారు. హిందీలో చైతూకు ఇదే తొలి చిత్రం. భారీ అంచనాల మధ్య ఈ ఏడాది ఆగస్టు 11న రిలీజైన ఈ ఎమోషనల్ కామెడీ డ్రామా ఫిల్మ్‌కు బాక్సాఫీస్ వద్ద నిరాశే ఎదురైంది. లాల్‌సింగ్ చడ్డా జీవితంలో ఎలాంటి ఘటనలు జరిగాయి? దేశవ్యాప్తంగా జరిగిన ఘటనల వల్ల అతని జీవితం ఎలా ప్రభావితం అయింది? అనే అంశాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది.

ఇక ఈ ఏడాది అరడజను సినిమాలతో (హిందీలో 'లూప్ లపేట', 'శభాష్ మిథు', 'దోబార', 'తడ్కా', 'బ్లర్' తెలుగులో 'మిషన్ ఇంపాజిబుల్) ఎంటర్‌టైన్ చేసే ప్రయత్నం చేశారు తాప్సీ. ఈ ఆరులో మూడు సినిమాలు 'లూప్ లపేట, దోబార, బ్లర్' విదేశీ చిత్రాలకు రీమేక్. 1988లో వచ్చిన జపాన్ హిట్ ఫిల్మ్ 'రన్ లోలా రన్'కు హిందీ రీమేక్‌గా 'లూప్ లపేట' తెరకెక్కింది. ఆకాష్ భాటియా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఫిబ్రవరి 4న రిలీజైంది. యజమాని డబ్బును పోగొట్టి, చిక్కుల్లో పడ్డ తన ప్రియుడి కోసం గాయపడ్డ ఓ రన్నింగ్ అథ్లెట్ ఎలాంటి సాహసాలు చేసింది? ఆమెకు ఎలాంటి ప్రమాదాలు ఎదురయ్యాయి? ఎలా ఎదుర్కొంది? అన్నదే 'లూప్ లపేట' కథాంశం. ఇక స్పానిష్ చిత్రాలైన సైన్స్ ఫిక్షన్ మిస్టరీ థ్రిల్లర్ 'మిరాజ్' (2018) ఆధారంగా 'దోబార (2:12)', స్పానిష్ హారర్ థ్రిల్లర్ 'లాస్ ఓజోస్ దే జూలియా (2010) ఆధారంగా 'బ్లర్' చిత్రాలు రూపొందాయి. అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహించిన 'దోబార' ఆగస్టు 19న రిలీజైంది. పాతికేళ్ల క్రితం ఓ అమ్మాయి చూస్తుండగానే పిడుగుపాటుతో ఒకరు మరణిస్తారు. ఆ అమ్మాయి పెద్దయ్యాక ఆ పరిస్థితులే పునరావృతమై ఓ పన్నెండేళ్ల బాలుడు చిక్కుల్లో పడతాడు. ఓ టీవీ సెట్ ఆధారంగా ఆ బాలుడిని ఈ యువతి ఎలా కాపాడగలిగింది? అన్నదే 'దోబార' కథనం. ఇక 'బ్లర్' విషయానికి వస్తే... అజయ్ భాల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో తాప్సీ ద్విపాత్రాభినయం చేశారు. ఈ సినిమా ఈ ఏడాది డిసెంబరు 9 నుంచి జీ5 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ చిత్ర కథ విషయానికి వస్తే.. గాయత్రి, గౌతమి కవలలు. కానీ ఇద్దరూ దృష్టి లోపంతో బాధపడుతుంటారు. అయితే హఠాత్తుగా గౌతమి మరణిస్తుంది. గౌతమి మరణానికి దారితీసిన పరిస్థితులను గాయత్రి తెలుసుకోవాలనుకుంటుంది? ఈ ప్రయత్నంలో ఆమెకు ఎదురైన సవాళ్లు ఏంటి? అనే అంశాల నేపథ్యంలో 'బ్లర్' చిత్రం సాగుతుంది. విదేశీ కథలతో తాప్సీ చేసిన ఈ మూడు చిత్రాలూ ఆశించిన ఫలితాన్నివ్వలేదు. ఇక ఈ ఏడాది సెప్టెంబరులో విడుదలైన తెలుగు చిత్రం 'శాకినీ డాకినీ' బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. రెజీనా, నివేదా థామస్ టైటిల్ రోల్స్ చేసిన ఈ సినిమాకు సుధీర్ వర్మ దర్శకుడు. 2017లో వచ్చిన సౌత్ కొరియన్ హిట్ ఫిల్మ్ 'మిడ్‌నైట్ రన్నర్స్'కు రీమేక్‌గా 'శాకినీ డాకినీ' తెరకెక్కింది. అక్రమాలకు పాల్పడే ఓ ముఠా ఆటను ఇద్దరు ట్రైనీ పోలీసాఫీసర్లు ఎలా అడ్డుకున్నారు? అన్నదే ఈ చిత్రకథాంశం.







అలా ఈ స్థాయికి వచ్చాను

- సోహైల్

''తెలుగు ప్రజల ఆశీర్వాదాల వల్లే నేనీ స్థాయికి వచ్చాను. ప్రతి మగాడి విజయం వెనుక ఒక మహిళ ఉంటుందని అంటారు. కానీ, నా విజయం వెనక మా నాన్న (సలీం) ఉన్నారు. నాకు సినిమా తప్ప ఇంకోటి తెలీదు'' అని సయ్యద్ సోహైల్ అన్నారు. 'బిగ్ బాస్' ఫేమ్ సయ్యద్ సోహైల్, మోక్ష జంటగా ఏఆర్ అభి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'లక్కీ లక్ష్మణ్'. హరిత గోగినేని నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో సోహైల్ మాట్లాడుతూ– ''కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ఇది. అభిగారు ఎంతో కష్టపడ్డారు. మా నిర్మాత హరితగారు ఈ సినిమాను సొంతంగా రిలీజ్ చేస్తున్నారు'' అన్నారు. ''లక్కీ లక్ష్మణ్' చూసి థియేటర్ నుంచి బయట కొచ్చాక ఓ మంచి సినిమా చూశామని ప్రేక్షకులు తృప్తిపడతారు'' అన్నారు ఏఆర్ అభి. ''అభికి చిన్నప్పటి నుంచి డైరెక్షన్ పిచ్చి ఉంది. తన ఆకాంక్షను నెరవేర్చాలని మా చెమట బొట్టుని డబ్బుగా మార్చి ఈ సినిమా తీశాం'' అన్నారు హరిత గోగినేని.



• అభి, విజయానంద్, అనూప్, మోక్ష, సోహైల్, హరిత

ప్రేక్షకులే ప్రమోట్ చేస్తారు

- శ్రీపతి కర్రి



• సమన్య రెడ్డి, ఆనంద్ రవి, కిషోరి, శ్రీపతి కర్రి

''ఏడాది చివర్లో (డిసెంబర్ 31) మా 'కొరమీను' సినిమా వస్తోంది. ప్రేక్షకులను మా మూవీ నిరుత్సాహపరచదు'' అని హీరో ఆనంద్ రవి అన్నారు. శ్రీపతి కర్రి దర్శకత్వంలో ఆనంద్ రవి, కిషోరి జంటగా నటించిన చిత్రం 'కొరమీను'. 'స్టోరీ ఆఫ్ ఈగోస్' అనేది ఉపశీర్షిక. మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో పెళ్లకూరు సమన్య రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న విడుదలకానుంది. ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో మహేశ్వర్ రెడ్డి రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో శ్రీపతి కర్రి మాట్లాడుతూ– ''ఒక డైరెక్టర్‌లా కాకుండా ఓ ప్రేక్షకుడిలా చెబుతున్నా.. థియేటర్ నుంచి బయటకు వచ్చాక ప్రేక్షకులే మా సినిమాను ప్రమోట్ చేస్తారు'' అన్నారు. ''సినిమా బాగా వచ్చింది.. ప్రేక్షకుల ఆశీర్వాదం కావాలి'' అన్నారు సమన్య రెడ్డి. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పవన్ కుమార్ జనస్వామి.

స్టార్స్‌కు డ్యాన్స్ నేర్పించా!

- హీరో సాయి రోనక్

''రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'రాజయోగం'. ప్రేక్షకులు రెండు గంటలు నవ్వుకునేలా ఉంటుంది'' అని సాయి రోనక్ అన్నారు. రామ్ గణపతి దర్శకత్వంలో సాయి రోనక్ హీరోగా, అంకిత సాహా, బిస్మి నాస్ హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'రాజయోగం'. శ్రీ నవబాలా క్రియేషన్స్, వైష్ణవి నటరాజ్ ప్రొడక్షన్స్ పతాకాలపై మణి లక్ష్మణ్ రావు నిర్మించిన ఈ చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా సాయి రోనక్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో డ్రైవర్ పాత్ర చేశాను. కథలోని పదివేల కోట్ల రూపాయల డైమండ్స్ పాయింట్ ఆసక్తిగా ఉంటుంది. ఈవీవీ సత్యనారాయణగారి సినిమాల్లో ఉన్నట్లు ఒక ఛేజింగ్‌తో సినిమా సాగుతుంది. ఈ సినిమాలో రొమాంటిక్ సీన్స్ చేసేటప్పుడు భయపడ్డాను.. కొన్నిసార్లు దర్శకుడితో గొడవపడ్డాను. అయితే ఎడిటింగ్‌లో చూశాక దర్శకుడి విజన్ అర్థమైంది. నాకు ఇండస్ట్రీలో గాడ్‌ఫాదర్ లేరు. నాకు డ్యాన్స్, ఫైట్స్ బాగా వచ్చు. ఇండస్ట్రీలో కొంత మంది స్టార్స్‌కు డ్యాన్స్ నేర్పించాను. ఆ పరిచయాలే నన్ను హీరోని చేశాయి. రియలిస్టిక్ చిత్రాల కంటే 'కేజీఎఫ్, ఆర్‌ఆర్‌ఆర్' వంటి ఫ్యాంటసీ చిత్రాలంటే నాకు ఇష్టం. పూర్తి కమర్షియల్‌గా సాగే మా 'రాజయోగం' అందరికీ నచ్చుతుంది. ప్రస్తుతం నీలకంఠగారి దర్శకత్వంలో ఓ థ్రిల్లర్ సినిమా చేస్తున్నాను. అవికా గోర్‌తో 'పాప్ కార్న్' అనే మూవీ, ఉషాకిరణ్ మూవీస్‌లో ఓ సినిమా చేస్తున్నా'' అన్నారు.





• నాగచైతన్య

నాగచైతన్య, కృతీ శెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'కస్టడీ'. వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ కుమార్ సమర్పణలో తెలుగు–తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. 2023 మే 12న 'కస్టడీ'ని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ''నాగచైతన్య పుట్టినరోజు (నవంబర్ 23) సందర్భంగా విడుదల చేసిన మా సినిమా టైటిల్ పోస్టర్, ఫస్ట్ లుక్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకుని మే 12న తెలుగు, తమిళ భాషల్లో సినిమాని విడుదల చేయనున్నాం. ఈ చిత్రంలో అరవింద్ స్వామి విలన్ పాత్రలో నటిస్తుండగా, ప్రియమణి పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా, యువన్ శంకర్ రాజా, కెమెరా: ఎస్ఆర్ కదిర్.

రెండో భాగం ఆ రోజే...



'పొన్నియిన్ సెల్వన్' మలి భాగం థియేటర్స్‌లోకి వచ్చే తేదీపై ఓ స్పష్టత వచ్చింది. విక్రమ్, 'జయం' రవి, కార్తీ, ఐశ్వర్యా రాయ్, త్రిష, శరత్‌కుమార్, ప్రకాశ్‌రాజ్ ప్రధాన తారాగణంగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పొన్నియిన్ సెల్వన్'. రెండు భాగాలుగా రూపొందిన ఈ చిత్రం తొలి భాగం 'పొన్నియిన్ సెల్వన్: పార్ట్ 1' ఈ ఏడాది సెప్టెంబరు 30న థియేటర్స్‌లో విడుదలైన విషయం తెలిసిందే. ఇక రెండో భాగాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ 28న థియేటర్స్‌లో రిలీజ్ చేయనున్నట్లుగా బుధవారం ప్రకటించింది చిత్రయూనిట్. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.

టాప్‌గేర్ ఆదికి బ్రేక్ ఇస్తుంది

- సాయికుమార్



• శ్రీధర్ రెడ్డి, సాయికుమార్, శశికాంత్, సాయి శ్రీరామ్, ఆది, రియా

''టాప్ గేర్' ట్రైలర్, టీజర్ బాగున్నాయని అందరూ మెచ్చుకుంటున్నారు. మంచి కథతో వస్తున్న ఈ సినిమా మా ఆదికి పెద్ద బ్రేక్ ఇస్తుందని ఆశిస్తున్నాను'' అని సాయికుమార్ అన్నారు. ఆది సాయికుమార్, రియా జంటగా కె. శశికాంత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'టాప్ గేర్'. ఆదిత్య మూవీస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో కేవీ శ్రీధర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి హీరో సందీప్ కిషన్, నిర్మాతలు దామోదర ప్రసాద్, అనిల్ సుంకర, రాధా మోహన్, బెక్కం వేణుగోపాల్, దర్శకులు యన్. శంకర్, కాశీ విశ్వనాథ్, సత్తిబాబు తదితరులు అతిథులుగా హాజరై, 'టాప్ గేర్' హిట్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ చిత్రంలో ముఖ్య పాత్ర చేసిన సాయికుమార్ మాట్లాడుతూ– ''మా నాన్నతో (పీజే శర్మ) మొదలైన మా జర్నీ ఇప్పుడు ఆది వరకూ వచ్చింది. ఆది క్రికెటర్ కావాలని కోరుకున్నాం.. కానీ, అన్నయ్య (చిరంజీవి) సినిమాల స్ఫూర్తితో ఇండస్ట్రీకి వచ్చాడు'' అన్నారు. ''సస్పెన్స్, థ్రిల్లర్.. ఇలా అన్ని ఎమోషన్స్ ఉన్న చిత్రమిది'' అన్నారు కె. శశికాంత్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽ 18	60,910	
నిఫ్టీ ▽ 10	18,122	

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,277	▽	77
డోజోన్స్	33,014	▽	210
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,497	△	24
డాక్స్	13,926	▽	69
షాంఘై	3,087	▽	8
నికాయ్	26,340	▽	107

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
54,571	△	68
బంగారం (99.5 స్వచ్ఛత)		
54,352	△	68
వెండి (కిలో)		
67,848	△	920

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.09	83.76
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	86.68	89.73
€	యూరో	ఎస్‌బీఐ	97.92	101.21
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	60.80	62.78
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.79	57.14
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.60	62.55
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.10	22.77
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.66	23.46
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.76	12.78

ఇన్నోవా హైక్రాస్ @ 18.3 లక్షలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్ మోటార్.. హైబ్రిడ్ మల్టీపర్పస్ వెహికిల్ ఇన్నోవా హైక్రాస్ పెట్రోల్ వర్షన్ ధరను వేరియంట్‌నుబట్టి రూ.18.3–19.2 లక్షలుగా నిర్ణయించింది. జనవరి మధ్యకాలం నుంచి డెలివరీలు ఉంటాయని కంపెనీ ప్రకటించింది. సెల్ఫ్‌చార్జింగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వర్షన్ ధర వేరియంట్‌నుబట్టి రూ.24–29 లక్షలుగా ఉంది. ఈ–డ్రైవ్ సీక్వెన్షియల్ షిఫ్ట్ సిస్టమ్‌తో 2.0 లీటర్ పెట్రోల్ ఇంజన్ పొందుపరిచారు. మైలేజీ లీటరుకు 23.24 కిలోమీటర్లు అని కంపెనీ ప్రకటించింది. ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తో 2.0 లీటర్ పెట్రోల్ ఇంజన్ ఆప్షన్‌లోనూ లభిస్తుంది. మైలేజీ లీటరుకు 16.13 కిలోమీటర్లు. బుకింగ్స్ నవంబర్ 25 నుంచే ప్రారంభం అయ్యాయి. 2005లో భారత్‌లో అడుగుపెట్టిన ఇన్నోవా ఇప్పటి వరకు 10 లక్షలకుపైగా యూనిట్లు రోడ్డెక్కాయి. సంస్థ మొత్తం అమ్మకాల్లో ఈ మోడల్ వాటా ఏకంగా 50 శాతం పైమాటే.

గూగుల్‌కు డిమాండ్ నోటీసులు

పెనాల్టీని చెల్లించనందుకు సీసీఐ జారీ

న్యూఢిల్లీ: పోటీ వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నందుకు విధించిన పెనాల్టీని నిర్ణీత గడువులోపు చెల్లించనందుకు గూగుల్‌కు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) డిమాండ్ నోటీసులు జారీ చేసింది. గూగుల్‌కు వ్యతిరేకంగా సీసీఐ అక్టోబర్ చివర్లో రెండు ఆదేశాలు జారీ చేసింది. రెండు కేసుల్లోనూ మొత్తం రూ.2,274 కోట్ల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఈ ఆదేశాలను జాతీయ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) ముందు గూగుల్ సవాల్ చేసింది. వీటిపై ట్రిబ్యునల్ ఇంకా విచారణ నిర్వహించాల్సి ఉంది. పెనాల్టీ చెల్లించేందుకు గూగుల్‌కు ఇచ్చిన 60 రోజుల గడువు ఈ నెల 25నే ముగిసింది. దీంతో గూగుల్‌కు సీసీఐ డిమాండ్ నోటీసులు జారీ



చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. వాస్తవానికి సీసీఐ నిబంధనల కింద జరిమానా చెల్లించేందుకు 30 రోజుల గడువే ఉంటుంది. సీసీఐ ఆదేశాలపై అప్పీల్‌కు వెళ్లామని, స్టే రాకపోతే చెల్లించాల్సి వస్తుందని గూగుల్ పేర్కొంది. ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ రూపంలో గూగుల్ తన ఆధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందని, అనుచిత వ్యాపార విధానాలను అనుసరిస్తోందంటూ సీసీఐ అక్టోబర్ 20న రూ.1337.76 కోట్ల జరిమానాను విధించడం గమనార్హం. ప్లేస్టోర్ విధానాలపరంగా తనకున్న అధిక మార్కెట్ వాటాతో అనైతిక విధానాలు అనుసరిస్తున్నందుకు రూ.936 కోట్ల జరిమానా విధించాలంటూ అక్టోబర్ 25న మరో కేసు విషయంలో సీసీఐ ఆదేశించింది.

ఎయిర్‌టెల్ రూ.28,000 కోట్ల పెట్టుబడి

నెట్‌వర్క్ విస్తరణకు ఈ వ్యయం

న్యూఢిల్లీ: టెలికం కంపెనీ భారతి ఎయిర్‌టెల్ రూ.27–28 వేల కోట్ల పెట్టుబడి వ్యయం చేయనున్నట్టు ప్రకటించింది. ప్రధానంగా 5జీ నెట్‌వర్క్ విస్తరణ లక్ష్యంగా ఈ పెట్టుబడి ఉంటుంది. మొబైల్ యాంటెన్నాలు, ఫైబర్, బ్రాడ్‌బ్యాండ్, ఎంటర్‌ప్రైస్ టెక్నాలజీ డేటా సెంటర్స్‌పై ఈ ఖర్చు చేస్తారు. 'ఎయిర్‌టెల్ మూలధన వ్యయం గత మూడేళ్లలో ఖర్చు చేసిన దానికి అనుగుణంగా ఉంటుంది. 5జీ వేగవంతమైన రోల్‌అవుట్ కారణంగా ఇది హెచ్చుతగ్గులు ఉండవచ్చు. ఏడాదిలో ఈ వ్యయంలో పెరుగుదలను చూడవచ్చు. క్రమంగా అదే స్థాయిలో కొనసాగవచ్చు' అని కంపెనీ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. నవంబర్ 26 నాటికి కంపెనీ 5జీ నెట్‌వర్క్ కోసం 3,293 బేస్ స్టేషన్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. మొబైల్ సేవల ధరలు పెరిగే అవకాశం ఉందని అధికారి వెల్లడించారు. మార్కెట్ పరిస్థితులనుబట్టి ధరల శ్రేణి ఆధారపడి ఉంటుందని అన్నారు.

అధిక చార్జీలు ఉండవు..

హరియాణా, ఒడిశాలో కనీస రిచార్జ్ విలువ 28 రోజుల కాలపరిమితి గల ప్యాక్‌పై 57 శాతం ధర పెంచి రూ.155గా కంపెనీ నిర్ణయించింది. ఈ



పైలట్ ప్యాక్ కింద అన్‌లిమిటెడ్ కాలింగ్, 1 జీబీ డేటా, 300 ఎస్ఎంఎస్‌లను ఆఫర్ చేస్తోంది. పైలట్ ప్రాజెక్ట్‌పై ఆరు వారాల్లో కంపెనీ ఒక అవగాహనకు రానుంది. తదనుగుణంగా ఇతర టెలికం సర్కిల్స్‌లో ఈ ప్యాక్‌ను ప్రవేశపెడతారు. ప్రపంచంలో 5జీకి ప్రీమియం చార్జీలు విజయవంతం కాలేదని కంపెనీ ప్రతినిధి వ్యాఖ్యానించారు. అధిక చార్జీలు వసూలు చేసే ఆలోచన లేదన్నారు. 2జీ నుంచి 4జీకి మళ్లడం, ప్రీ పెయిడ్ నుంచి పోస్ట్ పెయిడ్, పోస్ట్ పెయిడ్ వినియోగదార్లు బ్రాడ్‌బ్యాండ్, డీటీహెచ్ వంటివి కొనుగోలు కారణంగా ఒక్కో కస్టమర్ నుంచి సగటు ఆదాయం అధికం అవుతుందన్నారు. జూలై–సెప్టెంబర్‌లో వినియోగదారు నుంచి ఎయిర్‌టెల్‌కు సమకూరిన సగటు ఆదాయం రూ.190. గతేడాది ఇదే కాలంలో ఇది రూ.153 నమోదైంది.

వెబ్‌సైట్‌లో సోనాలికా ట్రాక్టర్ల ధరలు

న్యూఢిల్లీ: ట్రాక్టర్ తయారీ సంస్థ సోనాలికా ట్రాక్టర్స్ తన అధికారిక వెబ్‌సైట్‌లో మొత్తం ట్రాక్టర్ శ్రేణి ధరలను అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. ట్రాక్టర్ల రేట్లపై మరింత పారదర్శకతను తీసుకురావాలని లక్ష్యంగా



పెట్టుకుంది. ట్రాక్టర్ పరిశ్రమలో ఈ తరహా నిర్ణయం తీసుకున్న తొలి కంపెనీగా అవతరించింది. రైతుల అవసరాలను తీర్చడంలో సోనాలిక ఎల్లప్పుడూ ముందుంటుందని కంపెనీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ మిట్టల్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-12-2022	
విశాఖ	547–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525–00
విజయవాడ	525–00
రిటైల్ ధర (డజను)	78.00
28-12-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	528–00
వరంగల్	530–00
రిటైల్ ధర	5.90

ముకేశ్ అంబానీ @ 20

- రిలయన్స్ పగ్గాలు చేపట్టి రెండు దశాబ్దాలు
- 20 ఏళ్లలో సంస్థ ఆదాయం 17 రెట్లు; లాభాలు 20 రెట్లు జంప్

న్యూఢిల్లీ: తండ్రి ధీరుభాయ్ అంబానీ ఆకస్మిక మరణంతో వ్యాపార సామ్రాజ్యం రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) పగ్గాలను ఆయన కుమారుడు ముకేశ్ అంబానీ (65) చేపట్టి రెండు దశాబ్దాలయ్యింది. ఈ ఇరవై ఏళ్లలో రిలయన్స్‌ను ముకేశ్ వృద్ధి బాటలో పరుగులు పెట్టించారు. టెలికమ్యూనికేషన్స్, రిటైల్, కొత్త ఇంధనం తదితర విభాగాల్లోకి సామ్రాజ్యాన్ని విస్తరించారు. ఆయన సారథ్యంలో రిలయన్స్ ఆదాయం 17 రెట్లు, లాభాలు 20 రెట్లు ఎగిశాయి. కంపెనీ అంతర్జాతీయ దిగ్గజాల్లో ఒకటిగా ఆవిర్భవించింది.

2002లో ధీరుభాయ్ మరణం అనంతరం ముకేశ్, ఆయన చిన్న సోదరుడు అనిల్ అంబానీ.. రిలయన్స్ పగ్గాలు చేపట్టారు. ముకేశ్ సీఎండీగాను, అనిల్ వైస్ చైర్మన్, జాయింట్ ఎండీగాను బాధ్యతలు స్వీకరించారు. అయితే, సోదరులిద్దరి మధ్య ఆధిపత్య పోరు తలెత్తడంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ రెండుగా చీలింది. విభజనతో ముకేశ్ వంతుకు గ్యాస్, ఆయిల్, పెట్రోకెమికల్స్ విభాగాలు రాగా అనిల్ చేతికి టెలికం, విద్యుదుత్పత్తి, ఆర్థిక సేవల విభాగాలు వచ్చాయి. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయ డ్రాపౌట్ అయిన ముకేశ్ సారథ్యంలో రిలయన్స్



మహా సామ్రాజ్యంగా ఎదిగింది. ఆ వివరాలు..

- 2002 మార్చిలో రిలయన్స్ మార్కెట్ క్యాప్ రూ. 41,989 కోట్లు కాగా 20% వార్షిక వృద్ధితో 2022 మార్చికల్లా రూ. 17,81,841 కోట్లకు చేరింది.
- ఆదాయాలు రూ. 45,411 కోట్ల నుంచి రూ. 7,92,756 కోట్లకు, లాభాలు రూ. 3,280 కోట్ల నుంచి రూ. 67,845 కోట్లకు ఎగిశాయి.
- ఎగుమతులు రూ. 11,200 కోట్ల నుంచి రూ. 2,54,970 కోట్లకు చేరాయి.
- మొత్తం అసెట్స్ వార్షిక ప్రాతిపదికన 19 శాతం వృద్ధితో రూ.48,987 కోట్ల నుంచి రూ. 14,99,665 కోట్లకు ఎగిశాయి. నికర విలువ 2002లో రూ. 27,977 కోట్లుగా ఉండగా.. 2022 మార్చి నాటికి రూ. 6,45,127 కోట్లకు పెరిగింది.
- రెండు దశాబ్దాల్లో ఇన్వెస్టర్ల సంపదకు ఏటా సగటున రూ. 87,000 కోట్లు చొప్పున, రిలయన్స్ రూ. 17.4 లక్షల కోట్లు జత చేసింది.
- మోతీలాల్ ఓస్వాల్ 26వ వార్షిక సంపద సృష్టి అధ్యయనం ప్రకారం 2016–21 మధ్యలో రూ. 10 లక్షల కోట్ల సంపద సృష్టితో రిలయన్స్ టాప్‌లో నిల్చింది. తన గత రికార్డును తానే తిరగరాసింది.
- ఈ క్రమంలో 2007లో ముకేశ్ అంబానీ దేశీయంగా తొలి ట్రిలియనీర్‌గా (రూపాయి మారకంలో లక్ష కోట్ల అధిపతి) ఎదిగారు.

విస్తరణ..

రెండు దశాబ్దాల్లో రిలయన్స్ పలు కొత్త వ్యాపారాల్లోకి విస్తరించింది. 2006లో రిటైల్‌లోకి, 2021లో న్యూ ఎనర్జీ విభాగంలోకి ప్రవేశించింది. 2016లో జియో ద్వారా టెలికంలో సంచలనం సృష్టించింది. రిలయన్స్‌కు 2002లో జామ్‌నగర్‌లో ఒక్క ఆయిల్ రిఫైనరీ ఉండేది. అది ప్రస్తుతం ప్రపంచంలోనే అతి పెద్ద సింగిల్ లొకేషన్ రిఫైనింగ్ కాంప్లెక్స్‌గా ఎదిగింది. ఈ వ్యవధిలో రిలయన్స్ చమురు శుద్ధి సామర్థ్యాలను రెట్టింపు చేసుకుంది. 2009లో చమురు, గ్యాస్ ఉత్పత్తి ప్రారంభించింది. అటు పైన బ్రిటిష్ పెట్రోలియం దిగ్గజం బీపీని భాగస్వామిగా చేసుకుని పెట్రోల్ రిటైల్ అవుట్‌లెట్స్ నడిపిస్తోంది. పర్యావరణ అనుకూల ఇంధనాలపై దృష్టి పెట్టిన రిలయన్స్ వచ్చే మూడేళ్లలో కొత్త ఇంధన వ్యాపారంపై రూ.75,000 కోట్లు వెచ్చించనుంది.

నిధుల సమీకరణ...

2021 ఆర్థిక సంవత్సరంలో రైట్స్ ఇష్యూ వంటి మార్గాల్లో రిలయన్స్ రికార్డు స్థాయిలో రూ. 2.5 లక్షల కోట్లు సమీకరించింది. జియో ప్లాట్‌ఫామ్స్.. రిలయన్స్ రిటైల్ వెంచర్స్‌లో మైనారిటీ వాటాలు విక్రయించింది. ఫేస్‌బుక్, గూగుల్ వంటి అంతర్జాతీయ టెక్ దిగ్గజాలు ఇన్వెస్ట్ చేశాయి.

పరిమిత శ్రేణిలో ట్రేడింగ్

ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

ముంబై: ట్రేడింగ్‌లో లాభ, నష్టాల మధ్య పరిమిత శ్రేణిలో కదలాడిన స్టాక్ సూచీలు బుధవారం ఫ్లాట్‌గా ముగిశాయి. గత రెండు రోజుల వరుస ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గచూపారు. నెలవారీ ఎఫ్అండ్ఓ ఎక్స్‌పైరీ(నేడు)కి ముందురోజు ట్రేడర్లు అప్రమత్తత వహించారు. ప్రపంచ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందాయి. ఉదయం సెన్సెక్స్ 115 పాయింట్ల నష్టంతో 60,812 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 362 పాయింట్ల పరిధిలో 61,075 వద్ద గరిష్టాన్ని, 60,714 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 18 పాయింట్ల నష్టంతో 60,910 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 47 పాయింట్ల నష్టంతో 18,132 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 18,173 – 18,068 పాయింట్ల శ్రేణిలో కదలాడింది. ఆఖరికి పది పాయింట్లు పతనమై 18,122 వద్ద స్థిరపడింది. బ్యాంకింగ్, ఆర్థిక, ఐటీ షేర్లు నష్టాలను చవిచూశాయి. ఆటో, ఎఫ్ఎంసీజీ, కన్జూమర్ షేర్లు రాణించాయి. కాగా, డాలర్ మారకంలో రూపాయి విలువ ఏడు పైసలు పెరిగి 82.80 స్థాయి వద్ద స్థిరపడింది.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- ఇండియా పెస్టిసైడ్స్ షేరు తొమ్మిదిశాతం లాభపడి రూ.263 వద్ద స్థిరపడింది. తన అనుబంధ షల్విస్ స్పెషాలిటీస్ ఉత్తరప్రదేశ్‌లో తయారీ ప్లాంట్ ఏర్పాటుకు పర్యావరణ అనుమతి లభించడం షేరు ర్యాలీకి కారణమైంది. ట్రేడింగ్‌లో 11% బలపడి రూ.269 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- మాల్దీవులు దేశంలో యూటీఎఫ్ హార్బర్ ప్రాజెక్ట్ అభివృద్ధి పనులను ఆర్‌వీఎన్ఎల్ దక్కించుకోవడంతో ఈ కంపెనీ షేరు ఐదు శాతం పెరిగి రూ.67 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.

విద్య, ఉద్యోగ సమాచారం

నిట్ వరంగల్‌లో 100 ఫ్యాకల్టీ పోస్టులు

తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్).. వివిధ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 100
- **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు.
- **విభాగాలు:** సివిల్, ఎలక్ట్రికల్, ఈసీఈ, మెటలర్జికల్, కెమికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో కనీసం 60 శాతం మార్కులతో బీఏ/బీఎస్సీ/బీకామ్/బీటెక్/బీఈ/ఎంఈ /ఎంటెక్ /ఎంఎస్/ఎంఎస్సీ/పీజీ/ఎంఏ/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 35 నుంచి 50 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష, ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు. • **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.01.2023.
- **వెబ్‌సైట్:** www.nitw.ac.in

డీఎంహెచ్‌వో, చిత్తూరులో 53 మెడికల్ స్టాఫ్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, చిత్తూరు జిల్లా వైద్యారోగ్య కార్యాలయం(డీఎంహెచ్‌వో).. మెడికల్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 53
- **పోస్టుల వివరాలు:** స్టాఫ్ నర్స్–23, ల్యాబ్ టెక్నీషియన్‌లు–02, అటెండర్ కమ్ క్లీనర్–01, కుక్ కమ్ కేర్‌టేకర్–01, పీడియాట్రీషన్–04, సెక్యూరిటీ గార్డ్స్–05, సపోర్టింగ్ స్టాఫ్–03, మెడికల్ ఆఫీసర్లు–14.
- **అర్హత:** పోస్టును అనుసరించి ఐదు, పదో తరగతి, ఇంటర్మీడియట్ / జీఎన్ఎం / బ్యాచిలర్స్ డిగ్రీ/ బీఎస్సీ/ ఎంబీబీఎస్/ డిప్లొమా/ పీజీ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. • **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.12,000 నుంచి రూ.1,10,000 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** క్వాలిఫైయింగ్ పరీక్ష, పని అనుభవం ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డీఎంహెచ్‌వో, చిత్తూరు చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 31.12.2022
- **వెబ్‌సైట్:** chittoor.ap.gov.in

బెల్, బెంగళూరులో 32 ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్).. తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 32
- **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ ఇంజనీర్1(ఎలక్ట్రానిక్స్)–27, ప్రాజెక్ట్ ఇంజనీర్1 (మెకానికల్)–05.
- **అర్హత:** బీఈ, బీటెక్ (ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్–కమ్యూనికేషన్/ఈ–టీ/టెలికమ్యూనికేషన్/ మెకానికల్) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి
- **వయసు:** 01.12.2022 నాటికి 32ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.55,000 చెల్లిస్తారు.
- **పని ప్రదేశం:** ముంబై/కోల్‌కతా.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డీజీఎం(హెచ్ఆర్/ఎంఆర్, ఎంఎస్–ఏడీఎస్ఎన్), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, జలహళ్లి పోస్టు, బెంగళూరు చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 07.01.2023.
- **వెబ్‌సైట్:** www.bel-india.in

లే అఫ్స్ వేళ.. క్యాంపస్ ఆఫర్ల మేళ

» ఐఐటీ, ఎన్‌ఐటీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ జోరు
» ప్రముఖ ఐఐటీల్లో రూ.కోటికి పైగా వేతనంతో ఆఫర్స్
» ఎన్‌ఐటీల్లోనూ రికార్డ్ స్థాయిలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్
» ట్యాలెంట్‌కు ఎప్పుడూ డిమాండ్ ఉంటుందంటున్న నిపుణులు

'లే' అఫ్స్.. నియామకాల్లో కోతలు! గడిచిన కొద్ది నెలలుగా జాబ్ మార్కెట్‌లో తరచూ వినిపిస్తున్న మాటలు! లక్షల సంఖ్యలో ఉద్యోగాలకు కోత పడుతోందనే వార్తలు! భవిష్యత్తు నియామకాలపై సందిగ్ధత అనే ఆందోళన!! ఇలాంటి పరిస్థితుల్లో సైతం దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీలు, ఎన్‌ఐటీల్లో.. క్యాంపస్ డ్రైవ్స్‌లో ఆఫర్స్ వెల్లువెత్తుతున్నాయి. కొన్ని ఇన్‌స్టిట్యూట్స్‌లో గతేడాది కంటే వార్షిక ప్యాకేజ్‌ల్లో పెరుగుదల నమోదైంది!! ఈ నేపథ్యంలో.. ఐఐటీలు, నిట్‌ల క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో జాతీయ, అంతర్జాతీయ ఆఫర్లు, టాప్ రిక్రూటర్స్, జాబ్ ప్రొఫైల్స్ తదితర అంశాలపై ప్రత్యేక విశ్లేషణ..

టెక్నికల్ విద్య, బోధన విషయంలో ఐఐటీలు, ఎన్ఐటీలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందాయి. వాస్తవ ధృక్పథంతో ఈ విద్యాసంస్థలు పాటించే ప్రమాణాలు, విద్యార్థులకు అందించే నైపుణ్యాలు, జాబ్ రెడీ స్కిల్స్ విద్యార్థుల కెరీర్‌కు సోపానాలుగా మారుతున్నాయి. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఈ ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులు సంస్థలకు హాట్ ఫేవరెట్స్‌గా నిలుస్తున్నారు.

భారీగా ప్యాకేజ్

- ఐఐటీలు, ఎన్ఐటీ క్యాంపస్ డ్రైవ్స్‌లో ఈ ఏడాది రూ. కోటికిపైగా వార్షిక ప్యాకేజ్‌తో ఆఫర్లు ఖరారు కావడం విశేషం. ముఖ్యంగా ఫస్ట్ జనరేషన్ ఇన్‌స్టిట్యూట్‌లుగా గుర్తింపు పొందిన ఐఐటీ–ఖరగ్‌పూర్,ఢిల్లీ, ముంబై, కాన్పూర్, చెన్నై వంటి క్యాంపస్‌ల్లో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపించింది.
- ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 2023 బ్యాచ్‌కు సంబంధించి ప్లేస్‌మెంట్ ప్రక్రియ తొలి దశలో అత్యధిక వార్షిక వేతనం రూ.2.68 కోట్లుగా నమోదైంది. ఈ క్యాంపస్‌లో తొలి దశ డ్రైవ్స్‌లో 1600 మందికి ఆఫర్లు లభించాయి. రూ.50 లక్షలు కనిష్ట వార్షిక వేతనంగా నమోదైంది. 16 మందికి అంతర్జాతీయ ఆఫర్లు అందాయి.
- ఐఐటీ కాన్పూర్‌లో రూ.1.9 కోట్ల వార్షిక ప్యాకేజ్‌తో ఆఫర్ లభించింది. ఇలా మొత్తం 33 మంది విద్యార్థులకు రూ.కోటికి పైగా ప్యాకేజ్ ఖరారైంది. మొత్తంగా చూస్తే 947మంది విద్యార్థులకు ఆఫర్లు ఖరారు కాగా, వాటిలో 74 ఇంటర్నేషనల్ ఆఫర్లు ఉండడం గమనార్హం.
- ఐఐటీ ఢిల్లీలో 1300కు పైగా ఆఫర్లు ఖరారవగా, 50 మంది విద్యార్థులకు రూ.కోటికి పైగా వార్షిక ప్యాకేజ్ లభించింది. ఈ క్యాంపస్‌లో గరిష్ట వేతనం ఏకంగా రూ.నాలుగు కోట్లుగా నమోదవడం విశేషం. అదే విధంగా 30 మంది విద్యార్థులకు అంతర్జాతీయ ఆఫర్లు లభించాయి. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది ఆఫర్లలో 20 శాతం పెరుగుదల కనిపించింది.
- ఐఐటీ చెన్నైలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్ తొలి రోజే 445 మంది విద్యార్థులకు ఆఫర్లు ఖరారవగా.. వారిలో 25 మందికి రూ.కోటికి పైగా వార్షిక వేతనం లభించింది. అంతేకాకుండా మొత్తం 15 మంది విద్యార్థులకు నాలుగు సంస్థల నుంచి ఇంటర్నేషనల్ ఆఫర్స్ దక్కినట్లు ఐఐటీ చెన్నై క్యాంపస్ ప్లేస్‌మెంట్ వర్గాలు తెలిపాయి.
- ఐఐటీ–ముంబై క్యాంపస్ డ్రైవ్స్‌లో ఇప్పటి వరకు 1500 మందికి ఆఫర్లు ఖరారయ్యాయి. వీటిలో 71 ఇంటర్నేషనల్ ఆఫర్స్ ఉండగా.. 63 మంది వీటికి సమ్మతి తెలిపారు. అదే విధంగా 25 మంది విద్యార్థులకు రూ.కోటికి పైగా వార్షిక వేతనం ఖరారైంది. ఈ క్యాంపస్ తొలి దశ డ్రైవ్స్ ముగిసే సమయానికి అత్యధిక వార్షిక వేతనం రూ.4 కోట్లుగా నమోదైంది.
- ఐఐటీ–రూర్కీలో గరిష్ట వార్షిక వేతనం రూ.1.06 కోట్లుగా నమోదు కాగా, పది మంది విద్యార్థులకు రూ.80 లక్షలకు పైగా వేతనం లభించినట్లు రూర్కీ ప్లేస్‌మెంట్స్ సెల్ వర్గాలు తెలిపాయి.
- ఐఐటీ హైదరాబాద్‌లో తొలి దశ ప్లేస్‌మెంట్స్‌లో 474 మంది విద్యార్థులకు 508 ఆఫర్లు లభించాయి. గరిష్ట వేతనం రూ.63.78 లక్షలుగా నమోదైంది. 54 ఇంటర్నేషనల్ ఆఫర్లు ఉన్నాయి. ఐఐటీ–హైదరాబాద్‌లో ఏఐ బ్రాంచ్ తొలి బ్యాచ్‌లో 82 శాతం మందికి ఆఫర్లు దక్కాయి. ఈ క్యాంపస్‌లో సగటు వార్షిక వేతనం రూ.19.49 లక్షలుగా నమోదైంది.
- ఐఐటీ–గువహటిలో సైతం తొలి దశ క్యాంపస్ డ్రైవ్స్‌లో గరిష్టంగా రూ.2.46 కోట్లతో ఇంటర్నేషనల్ ఆఫర్, రూ.1.1 కోటితో డొమెస్టిక్ ఆఫర్ ఖరారైంది.

ఎన్ఐటీలదీ అదే బాట

- ఐఐటీల తర్వాత దేశంలో ప్రముఖ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌గా పేరొందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) క్యాంపస్‌లలో సైతం ఈ ఏడాది భారీగా ఆఫర్స్ లభించాయి.
- తెలుగు రాష్ట్రాల్లోని ఎన్ఐటీ–వరంగల్‌లో రూ.88 లక్షల గరిష్ట వేతనంతో ఆఫర్ లభించింది. ఈ క్యాంపస్‌లో మొత్తం వేయి మంది విద్యార్థులకు ఆఫర్లు ఖరారు కాగా.. సగటు వార్షిక వేతనం రూ.19.9 లక్షలుగా నమోదైంది.
- ఎన్ఐటీ హమీర్‌పూర్‌లో గతేడాది కంటే 39 శాతం అధికంగా సగటు వార్షిక వేతనం లభించింది. సగటు వార్షిక వేతనం రూ.12.84 లక్షలుగా, గరిష్ట వార్షిక వేతనం రూ. 52 లక్షలుగా నిలిచింది.
- ఎన్ఐటీ జంషెడ్‌పూర్‌లో అయిదుగురు విద్యార్థులకు రూ.80 లక్షల వార్షిక వేతనంతో ఇంటర్నేషనల్ ఆఫర్స్ లభించాయి.
- ఎన్ఐటీ కాలికట్‌లో సగటు వార్షిక వేతనం రూ.23 లక్షలుగా ఉంది.
- ఎన్ఐటీ పాట్నా క్యాంపస్‌లోనూ గరిష్ట వేతనం రూ.52 లక్షలుగా, సగటు వేతనం రూ.16.51 లక్షలుగా నమోదైంది.
- ఇతర ఎన్ఐటీల్లోనూ ఇదే తరహాలో గతేడాది కంటే పది నుంచి 20 శాతం అధికంగా ఆఫర్లు లభించడంతో పాటు, వేతనాల్లోనూ పది శాతానికిపైగా పెరుగుదల నమోదైంది.

టాప్ రిక్రూటర్స్ వీరే

ఐఐటీలు, ఎన్ఐటీల్లో టాప్ రిక్రూటింగ్ సంస్థలను



పరిగణనలోకి తీసుకుంటే.. క్వాల్ కామ్, టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, గూగుల్, బార్‌క్లేస్, ఎస్ఏపీ ల్యాబ్స్, సిటీ బ్యాంక్, వెల్ ఫార్గో, మైక్రోసాఫ్ట్, బీసీజీ, బెయిన్ అండ్ కో సంస్థలు ఇంటర్నేషనల్ ఆఫర్స్ ఇవ్వడంలో ముందంజలో ఉన్నాయి. డొమెస్టిక్ ఆఫర్స్ పరంగా ఉబెర్, హనీవెల్, మైక్రాన్ టెక్నాలజీ, ఓఎన్‌జీసీ, ఫ్లిప్‌కార్ట్, బజాజ్ ఆటో, టాటా స్టీల్, ఎస్‌టీఎం మైక్రోఎలక్ట్రికల్స్ వంటి సంస్థలు ముందు వరుసలో ఉన్నాయి.

డిమాండింగ్ జాబ్ ప్రొఫైల్స్

కోర్ ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ అండ్ ప్రోగ్రామర్స్, డేటా అనలిస్ట్స్, యుఎక్స్ డిజైనర్, ప్రొడక్ట్ డిజైనర్, ఫుల్‌స్టాక్ ఇంజనీర్ జాబ్ ప్రొఫైల్స్‌లో అధిక సంఖ్యలో నియామకాలు జరిగాయి.

డేటా అనలిస్ట్ జోరు

- ఈసారి ఐఐటీ, ఎన్ఐటీల క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో డేటా అనలిస్ట్ ప్రొఫైల్ జోరు కొనసాగింది. ముఖ్యంగా కన్సల్టింగ్, ఫైనాన్షియల్ సెక్టార్‌లోని సంస్థలు ఈ నియామకాలు చేపట్టాయి. బీఎఫ్ఎస్ఐ, కన్సల్టింగ్ సంస్థలు క్లయింట్స్, వినియోగదారులను పెంచుకునే వ్యూహంతో అడుగులు వేస్తున్నాయి. దీంతో డేటా అనలిస్ట్ జాబ్స్‌కు డిమాండ్ కనిపించింది.
- ఐటీ మొదలు ఆన్‌లైన్ టెక్నాలజీస్ ఆధారంగా సేవలందిస్తున్న అన్ని రంగాల్లోని సంస్థలు సాఫ్ట్‌వేర్స్ ప్రోగ్రామింగ్, డిజైనింగ్‌కు ప్రాధాన్యమిస్తుండడంతో.. కోడింగ్ విభాగంలో జాబ్ ప్రొఫైల్స్‌కు కూడా డిమాండ్ కనిపించింది.

ఎస్‌పీఓల్లోనూ వృద్ధి

ఐఐటీలు, ఎన్ఐటీల్లో ఈ ఏడాది సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్‌లోనూ వృద్ధి కనిపించింది. దాదాపు అన్ని క్యాంపస్‌లలో నూటికి 80 శాతం మందికి సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ లభించాయి. గరిష్టంగా రెండు నెలల కాలానికి ఆయా సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేసేందుకు ఇచ్చే సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్‌లో స్టయిఫండ్ మొత్తాలు కూడా ఆకర్షణీయంగా నమోదయ్యాయి. కనిష్టంగా రూ.50 లక్షలు, గరిష్టంగా రూ.80 లక్షలు, సగటున రూ.30 లక్షల స్టయిఫండ్‌తో పలు సంస్థలు విద్యార్థులకు ఇంటర్న్ ట్రైనీగా పని చేసేందుకు సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్లు ఖరారు చేశాయి.

రెండు, మూడు రౌండ్లలో ఎంపిక

ఐఐటీలు, ఎన్ఐటీల్లో క్యాంపస్ డ్రైవ్స్‌లో పాల్గొన్న సంస్థలు రెండు, మూడు రౌండ్లలో ఎంపిక ప్రక్రియ నిర్వహించాయి. తొలుత రిటెన్ టెస్ట్, ఆ తర్వాత హెచ్ఆర్ రౌండ్, చివరగా టెక్నికల్ రౌండ్ ఇంటర్వ్యూలు చేపట్టి.. ప్రతిభ ఆధారంగా ఆఫర్లు ఖరారు చేశాయి.

కోడింగ్‌కే ప్రాధాన్యం

సంస్థలు విద్యార్థుల్లోని కోడింగ్ నైపుణ్యాలపైనే ప్రధానంగా దృష్టి పెట్టాయి. కంపెనీలు రిటెన్ టెస్ట్‌లు, టెక్నికల్ రౌండ్స్‌లో కోడింగ్ సంబంధిత నైపుణ్యాలను ఎక్కువగా పరిశీలించినట్లు ఆయా క్యాంపస్‌ల ప్లేస్‌మెంట్ వర్గాలు పేర్కొన్నాయి. కోర్ ఇంజనీరింగ్, సర్క్యూట్ బ్రాంచ్‌లకు సంబంధించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌పై విద్యార్థులకు ఉన్న నైపుణ్యాలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు.

మార్చి నాటికి నూరుశాతం

క్యాంపస్ డ్రైవ్స్ ప్రతి ఏటా డిసెంబర్‌లో ప్రారంభమై.. మరుసటి ఏడాది మార్చి వరకు కొనసాగుతాయి. ప్రస్తుతం అన్ని క్యాంపస్‌లలో తొలి దశ ముగిసింది. ఇందులో దాదాపు 80 శాతం మందికి ఆఫర్లు లభించాయి. మార్చి నాటికి నూటికి నూరు శాతం మందికి ఆఫర్లు లభిస్తాయని ఐఐటీల క్యాంపస్ ప్లేస్‌మెంట్ వర్గాలు పేర్కొంటున్నాయి.


స్వీయ అన్వేషణ దిశగా

ఇప్పటికే పలు సంస్థలు లే అఫ్‌లు కొనసాగిస్తున్నప్పటికీ.. వాటి కార్యకలాపాల నిర్వహణకు మానవ వనరుల అవసరం ఏర్పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో ఫ్రెషర్స్‌ను నియమించుకుని తమ విధానాలు, సాంకేతికతలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చే అవకాశముందంటున్నారు. టైర్–2 ఇన్‌స్టిట్యూట్స్‌కు చెందిన విద్యార్థులు మాత్రం ఉద్యోగ సాధనలో క్యాంపస్ డ్రైవ్స్‌పైనే ఆశలు పెట్టుకోకుండా.. స్వీయ అన్వేషణ దిశగానూ అడుగులు వేయాలని సూచిస్తున్నారు. సంస్థలు కోరుకుంటున్న కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐఓటీ వంటి నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకుని.. జాబ్ మార్కెట్‌లో పోటీకి సిద్ధంగా ఉండాలని సూచిస్తున్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్.. ముఖ్యాంశాలు

- ఐఐటీలు, నిట్‌ల్లో 2023 బ్యాచ్‌కు ముగిసిన తొలి దశ క్యాంపస్ డ్రైవ్స్.
- ఐఐటీ–ఢిల్లీలో రూ.4 కోట్ల గరిష్ట వార్షిక వేతనంతో ఆఫర్. ■ ప్రతి క్యాంపస్‌లోనూ గరిష్టంగా రూ.కోటికి పైగా వేతనం నమోదు.
- సగటు వార్షిక వేతనం రూ.36 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు నమోదు.
- గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 15 నుంచి 20 శాతం పెరుగుదల.
- కోడింగ్, ఏఐ–ఎంఎల్, ఐఓటీ స్కిల్స్‌పై ప్రత్యేక దృష్టి పెడుతున్న సంస్థలు.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.